# కథామంజరి

## పది కథల సమాహారం





డాక్టర్స్ స్పెషల్

జనవరి 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**జనవరి 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 1

ఈ నెల కథామంజరి సంచికకి

ఆర్థికంగా ఊతమిచ్చిన వారు

ప్రముఖ రచయిత

**డా. కె. వివేకానందమూర్తి, UK.**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ / శ్రీమతి / కుమారి

- పప్పు భోగరావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి ఎస్ మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- లక్ష్మి గాయత్రి గారు

**శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి**

**శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరుస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి ... ... ... ... ... ... | ii |
| కథా మార్గదర్శి ... ... ... ... ... ... | iv |
| వినదగునెవ్వరు చెప్పిన ... ... ... ... ... ... | vi |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| అనువాద కథ ... | మెడికో శ్యామ్ ... ... ... | 1 |
| కర్పూర దీపం ... | డా. పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి.. | 6 |
| దేవుడు బాబు ... | డా. రవి శర్మ ... ... ... | 13 |
| డాక్టర్స్ డైరీ ... | డా. డి.వి.జి.శంకర రావు... ... | 17 |
| అదర్ ఏంగిల్ ... | డా. శైలజ కాళ్లకూరి ... ... | 21 |
| స్త్రీకి స్త్రీయే ... ... | డా. మూర్తి జొన్నలగెడ్డ ... ... | 27 |
| ఒక్క మాత్ర ... | డా. రమణ యశస్వి ... ... | 33 |
| "వైద్యో నారాయణో హరిః" ... | డా. మజ్జి భారతి ... ... ... | 39 |


Cover Page Drawing: Kocherla V.R.
(Caricature : Yulia Smirnova, Germany)

# కథాకీయం


తెలుగుసాహిత్యాన్ని అందించేవారు, ఆస్వాదించేవారు, భుజం మీద వేసుకుని మోసేవారు.. అన్నిరంగాల్లోనూ కనబడతారు. గతంలో దేశ ప్రధాని నుంచి కూలీనాలి చేసుకునే వారి వరకు.. ఎందరో మహానుభావులు, తెలుగు సాహితీజగత్తులో మనకి తెలుగువెలుగుల్ని వారివారి కోణాల్లో పంచారు. కొంతమందికి స్వతహాగా కవిత్వం వస్తే, మరికొందరికి కృషితో ఆ అదృష్టం వరిస్తుంది. పుట్టి పెరిగిన వాతావరణం, సామాజిక పరిస్థితులు, ఆలోచనా సరళి, మానసిక దృక్పథం.. వంటివి వారి భావజాలం మీద ప్రభావం చూపుతాయి. ఆ భావజాలాలతో నవరసాలు ఒలికి అక్షరజననం జరుగుతుంది. అలా రచనలు అందించే వారిలో నేటికి ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగాలలో ఉన్నవారు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, పోలీసు శాఖలో పనిచేసేవారు, ఐఏయస్, ఐపియస్ వంటి ఉన్నత పదవుల్లో ఉన్నవారు కూడా ఉన్నారు. మొన్నటి తరంలో, కేవలం కథలు వ్రాసి జీవనం సాగించినవారు కూడా ఉండేవారు. కాని నేడు రచనలు చేయడమే వృత్తిగా ఉండేవారు.. కేవలం సినిమా, టివి రంగాలకే పరిమితం అయిపోయారు. ఇక.. నేడు సంఖ్యాపరంగా అధికంగా కనబడే సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేసే వారిలో రచయితలు సుమారుగా లేరు. కారణం.. చదవడానికి, వ్రాయడానికి సమయం లేదంటారు. కొంతవరకు ఈ పరిస్థితి రావడానికి సాంఘిక మాధ్యమాలు కొంతవరకు కారణమని చెప్పుకున్నా.. మరోవైపు చూసినప్పుడు, అది సరైన కారణమని అనిపించదు. ఎలా అంటే..

ప్రపంచీకరణ తర్వాత, వైద్యరంగంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. వైద్యవృత్తిలో ఉన్నవారు కూడా, ఇతర ఉద్యోగస్థుల్లాగే కాలంతో పరిగెత్తుతూ సేవలు అందిస్తున్నారు. పని ఒత్తిడి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవలసిన అవసరాలు.. వైద్యుల కాలాన్ని హరిస్తున్నాయి. యుక్తవయస్సులో ఉన్న వైద్యుల నుంచి వృద్ధుల వరకు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వారికీ సమయం చిక్కటం లేదు. అయినా సరే... అలాంటి ఉన్నతమైన వృత్తి (noble profession) లో ఉన్న వైద్యులలో ఇప్పటికీ ఎంతోమంది రచనలు చేసేవారు ఉన్నారు. సమయాన్ని చిక్కించుకుని... కథలు, కవితలు, పద్యాలు రచిస్తున్న వైద్యులు, తప్పకుండా నేటి యువతరానికి మార్గదర్శకులనే చెప్పాలి. ఎంత సమయాభావంతో ఉన్నా, తమ అలోచనలకు అనుభవాలకు అక్షరరూపం ఇచ్చి, చక్కటి కథలను అందిస్తున్న వైద్యులను నేటి తరానికి పరిచయం చేయాలనే ఓ సంకల్పంతో ఈ ప్రత్యేక సంచికను విడుదల చేయడానికి తలపెట్టాం. ఆ దిశలో ప్రయత్నాలు చేసినప్పుడు, అనూహ్యంగా స్పందనలు వచ్చాయి. వైద్యవృత్తిలో ఉండి తెలుగు కథలు వ్రాసేవారి సంఖ్య ఊహించిన దాని కంటే, పదిరెట్లు ఎక్కువగా ఉంది. ఎంతోమంది వైద్యులు స్పందించి తమ రచనలు పంపారు. ఒక సంచికతో సరిపెట్టలేని సంఖ్యలో కథలు మాకు అందాయి. అందుకే జనవరి, ఫిబ్రవరి సంచికలను 'డాక్టర్స్ స్పెషల్'గా విడుదల చేస్తున్నాం. కథామార్గదర్శి, విశిష్ట అతిథి .. ఆఖరుకి ఈ సంచిక సౌజన్యం దాకా – అందరూ వైద్యులే అవ్వడం .. ఈ సంచికకి మరింత సంపూర్ణత చేకూరిందేమో కదా!

వైద్యుల స్పందన, వారి జీవనశైలి, తెలుగు కథ మీద వారికున్న మమకారం, గౌరవాలు తప్పకుండా కొంతమందికైనా స్ఫూర్తిని కలగ చేయగలదని గట్టి నమ్మకంతో 'కథామంజరి' మీ ముందుకు వస్తోంది. మా ఈ ప్రయత్నాలకి.. 'మేం సైతం..' అంటూ చేయూత అందించి, ప్రోత్సహిస్తున్న ఎంతోమంది వైద్యులకు వందనాలు తెలియజేసుకుంటున్నాం.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. ప్రయాగ మరళీమోహనకృష్ణ**

వైద్యులు రచయితలైతే... వారు వ్రాసే ప్రతీ అక్షరం నిత్య యవ్వనంతో ఆరోగ్యంగా పది కాలాలపాటు జీవిస్తుందనే సత్యం... డా. ప్రయాగ మరళీమోహనకృష్ణ గారిని చూస్తే తెలుస్తుంది. ఎనభై వసంతాలు నింపుకుని ఓ రెండుమూడు సంవత్సరాలు గడిచినా సరే, జీవితంలో ప్రతీ క్షణం అనుభవించినట్టే, వ్రాసే ప్రతి అక్షరాన్ని అనుభవించి అందంగా చెక్కి అమర్చుతారు. వాటికి ఏం మందులు ఇస్తారో గాని, అవన్నీ అమృతం త్రాగినట్టు చిరంజీవిగా ఉండిపోయాయి. ఆయనలో ఇంకా అదే హూషారు, అదే ఉత్సాహం! ఇప్పుడు కూడా కంప్యూటర్ మీద టైపు చేసుకుంటూ రచనలు చేస్తున్నారు! సంప్రదాయమంటే మౌఢ్యం కాదు, అది తరతరాల వారసత్వం, ఒక తరం నుండి మరొక తరానికి ప్రవహించే విలువల సారం అని నమ్మే డా. మోహనకృష్ణ గారి రచనల నిండా అదే సారం ఉంటుంది. వారు వ్రాసినది ఏ వాదం వారు చదివినా... 'ఆహా' అనిపించేలానే ఉంటుంది. చివరికి ఆయన ఆత్మకథ కూడా ఓ నవలలా, అందంగా కదిలే అలలలా ఉంటుంది. జీవితంలో సగభాగం విదేశాల్లో గడిపినా, ఆయనలోని తెలుగుభాష సంపద పెరుగుతూ వచ్చింది గాని, తరగలేదు. చక్కటి కథాకథన శిల్పం ఆయనలో ఉందంటే, ఆయన మాతృభాషని ఎంతలా ఆరాధిస్తారో తెలుస్తుంది! డా. మురళీకృష్ణ గారి రచనలలో మాతృదేశం మీద అపారమైన భక్తిభావం, అచంచలమైన విశ్వాసం, మానవతా విలువలపై ప్రగాఢమైన నమ్మకం కనబడతాయి. వ్యక్తిగతంగా కూడా ఆయనలో ఆ లక్షణాలు నిండుగా ఉన్నాయి. ఏది వ్రాస్తారో, అదే అచరరణలో పెట్టే డా. మురళీకృష్ణ గారు, ఎన్ని దేశాలు తిరిగినా మాతృదేశం మీది ప్రేమతో... తాను చదువుకుని ఎదిగిన ఊర్లో మంచి ఇంటిని నిర్మించుకోవాలనే ప్రయత్నాలలో వాస్తు నిపుణులూ, రియల్ ఎస్టేట్ వాళ్ళూ... ఒకరేమిటి చాలమంది ఆయన్ని మోసం చేసారు. కాని ఆ మోసాలని ముచ్చట్ల రూపంలో 'నేలతల్లి' నవలలో అందించడం ... పాత్రలు సృష్టించి, ఆ పాత్రల ద్వారా తన ఉద్దేశాలను, జీవితంలోని చీకటి వెలుగుల్ని చిక్కగా 'ఆకాశం నవ్వింది' నవలలో సీతాలు ద్వారా అందించడం... తనలోని ఉక్రోషం, ఆంతర్యంలోని ఘోషని ఓ వినూత్న రీతిలో 'అయితే నాకేటి!'గా చిన్న చిన్న కథనాలలో అందించడం డా. మురళీకృష్ణ గారి ప్రత్యేకత.

ఆయన రచనలలో ఓ సందేశంతో పాటు, చక్కటి సంభాషణలతో, పాఠకుల్ని కూర్చోబెట్టి కబుర్లు చెబుతున్నట్టు ఉంటాయి. వీరి మొదటి కథ 'అమ్మతల్లి', 1961లో ఓ పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో బహుమతి పొందింది. తర్వాత

కాలంలో ఆచి తూచి, వంద వరకు కథలు, ఓ ఆరు నవలలు వ్రాసిన డా. మురళీకృష్ణ గారు వైద్యశాస్త్రానికి సంబంధించి మూడు గ్రంథాలు, అనేక పరిశోధనా పత్రాలు రచించారు.

డా. మురళీకృష్ణ గారు శ్రీకాకుళం జిల్లా, గొటివాడ గ్రామంలో జన్మించారు. ఆంధ్ర మెడికల్ కాలేజిలో ఎమ్.బి.బి.యస్, ఉస్మానియా యూనివర్సిటీలో అనెస్థీషియాలో పి.జి. చేసి, 1962–72 ల మధ్య ప్రభుత్వోగం చేసారు. తర్వాత విదేశాలు... ట్రినిడాడ్, ఇంగ్లాండ్, ఐర్లాండ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే దేశాలలో ముప్పై ఐదు సంవత్సరాల పాటు అనెస్థటిస్టుగా పనిచేసారు. నార్వేలో అనెస్థీషియాలో ఎమ్.డి. కూడా చేసారు. అక్కడ ఉన్నప్పుడు మూడు వైద్య పనిముట్లను రూపొందించి, పేటెంట్ హక్కులు కూడా పొందారు.

డాక్టరు చదువు చదివినా, విదేశాల్లో చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ మూడు దశాబ్దాలు గడిపినా సరే, కుటుంబపరంగా సంక్రమించిన నియమనిష్ఠలను నిక్కచ్చిగా పాటించారు. అంతే కాదు ఆయన కథలలో, శైలిలో తన చిన్ననాటి గ్రామీణ జీవిత వాసనలు ప్రస్ఫుటంగా కనబడతాయి. ఇప్పటికీ తెల్లవారుజామున మూడు గంటలకు లేచి, అయిదు గంటల వరకు రచనలు చేసి తర్వాత వాహ్యాళికి వెళతారు.

మొదట్లో “నీ కంఠశోష, నీ కలంలో విలాపాన్ని వినేవాళ్ళెవరు? నిన్ను పలకరించి ఆదరించేదెవరు?” అని అన్నయ్య కోప్పడితే, తనలోని మొండితనం మరింత రెచ్చిపోయి, కసితో రచనలు చేసిన డా. ప్రయాగ మురళీ మోహనకృష్ణ గారు, మరిన్ని రచనలతో తెలుగు సాహితీప్రియులను అలరించగలరనే గట్టి నమ్మకంతో వారికి, ‘కథామంజరి’ శుభాభివందనాలు తెలియచేసుకుంటోంది.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



డా. వి. చంద్రశేఖరరావు

“జీవితాన్ని అధ్యయనం చెయ్యటానికి నేనెంచుకున్న ప్రక్రియ కథ. కథ... నాకూ ప్రపంచానికీ మధ్య ఒక ఇన్‌స్ట్రక్టర్‌లా నిలబడి నన్ను విద్యావంతుణ్ణి చేసింది. నాలోనికి తొంగి చూసుకోవటానికి అవసరమైన చూపునిచ్చింది. ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అంటామే, అట్లాంటి ఆత్మీయమైన అనుభూతిలా నన్ను స్పృశించింది కథ.”

ఈ మాటలు తన తొలి కథాసంపుటి ‘జీవని’కి స్వగతంలో వ్రాసుకున్నారంటే... ఆయన జీవితాన్ని ఎంతలా అధ్యయనం చేసారో అర్థం చేసుకోవచ్చును. తన జీవితాన్నే కాదు, ఎదురుపడ్డ, దగాపడ్డ ప్రతిజీవిని అర్థం చేసుకుని, అక్షరంలో నిక్షిప్తం చేసారు. కథాంశాలను ఎంపిక చేసుకోలేదు. ఎదురొచ్చాయి. ఎదలో గుచ్చుకుని నిరంతరం మథనపడేలా చేసాయి. సుడులు సుడులుగా తిరుగాడే, ఆ ఆలోచనా అలలను ఒడిసి పట్టి, వాడైన కథలు వ్రాసారు. మూడు దశాబ్దాల కాలంలో ఆయన వ్రాసినవి ఏడు పదుల కథలు మాత్రమే. కాని అవి తూటాలా దూసుకుపోయాయి. తెలుగు సాహితీ జగత్తులో ఈ తేజం ప్రకాశవంతమైనది 1990 తర్వాతే! అటు పాఠకుల్ని, ఇటు పాలకుల్ని ఆలోచింప చేయగలిగే కథలను అందించి, తెలుగు కథా చరిత్రలో చిరంజీవిగా నిలిచిపోయిన ఆ కథారచయిత డా. వి. చంద్రశేఖరరావు గారు.

కథ వ్రాయడానికి ముందు... ఆ అంశం మీద లోతుగా అధ్యయనం చేయడం, పరిశోధనలు చేయడం, పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి, అనుభవించి కథలు వ్రాయడం, చివరికి ఆ ఆలోచనల క్రమంలో నిద్రలేమి కూడా చవి చూసి... డా. చంద్రశేఖరరావు గారు కథలు వ్రాసారు. కళ్ల ఎదుట కనబడే అన్యాయాలను ఎదుర్కోడానికి అక్షరాన్నే ఆయుధంగా ఎన్నుకుని, మారిన కాలమాన పరిస్థితులకు దగ్గరగా తన భావజాలాన్ని సంధించారు.

గ్లోబలైజేషన్‌కి ముందు, తర్వాత ఆయన వ్రాసిన కథలలో ఆ మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. లాటిన్, అమెరికా కథలను ఎక్కువగా చదివి, అవగాహన చేసుకున్న తెలుగు కథకుల్లో డా. చంద్రశేఖర్ గారే అగ్రగణ్యులు. వీరిపై లాటిన్, అమెరికా కథకుల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. “తెలుగు కథ ఇంకా చప్పగా ఉంది. తెలుగు కథకులు ఉత్తమ కథలు రాయలంటే లాటిన్ అమెరికా కథలు బాగా చదవాలి. అధ్యయనం చేయాలి!” అంటూ డా. చంద్రశేఖర్ గారు నేటి కథమీద అభిప్రాయాన్ని

చెప్పేవారు. ఆయన కథల్లో ఎక్కువగా వర్తమానం కనబడుతుంది. వర్తమానంలో నుంచి భవిష్యత్తులో వచ్చే ఉపద్రవాలను వేలెత్తి చూపెట్టి, పాఠకుల్లో చైతన్యం కలిగించడమే ఆయన కథల్లో కనబడుతుంది.

ఆయన మొదటి కథ 'నైట్ డ్యూటీ' 1993 లో వచ్చింది. అలా ఓ డెబ్బై పైచిలుకు కథలు, ఓ ఐదారు నవలలు వ్రాసారు. జీవని, లెనిన్ ప్లేస్, మాయాలాంతరు వంటి ఆయన కథాసంపుటాల ద్వారా ప్రథమశ్రేణి కథకునిగా గుర్తింపు వచ్చింది. నల్లమిరియం చెట్టు, ఐదు హంసలు... వంటి నవలల ద్వారా నవలాకారుడుగా కూడా గుర్తింపు పొందారు. డా. చంద్రశేఖర్‌గారి క్రానికల్స్ ఆఫ్ లవ్, హంస రెక్కలు, ఆదివారం, హెచ్. నరసింహం ఆత్మహత్య, ద్రోహవృక్షం, సూర్యుని నలుపురంగు రెక్కలు, నేను–పి. వి. శివం వంటి కథల్లో వస్తువిస్తృతిని, దానితోపాటు శైలీ, శిల్పాల వైవిధ్యాన్ని, వాటితోపాటు భాషలోనూ చాలా మార్పులు రావడం గమనించవచ్చు. రచయితగా అలా సహజసిద్ధమైన వర్తమానంలో ఆలోచించడంలో ఆయనకి ఆయనే సాటి!

తెలుగు, ఆంగ్ల సాహిత్యాలను ఔపోసన పట్టిన డా. చంద్రశేఖర్ గారు 2015 సంవత్సరంలో జరిగిన తానా వారి సభలో 'తెలుగు సాహిత్యం' ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆయన 1994లో వెలువడిన 'జీవని' తొలి సంపుటి కాగా, 2012లో వెలువడిన 20 కథల 'ద్రోహవృక్షం' ఆయన బ్రతికుండగా వచ్చిన ఆఖరు కథాసంపుటి. ఆయన మరణానంతరం 2018లో మరో ఏడు కథలతో 'ముగింపుకు ముందు' కథాసంపుటాన్ని మిత్రులు, కుటుంబ సభ్యులు ప్రచురించారు.

ఆయన చాలా సున్నితస్వభావుడు. మొహమాటస్తుడు కూడా. ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య, 'పాండిత్యపు బరువునే కాదు, భాష బరువును కూడా సహించలేని సాహిత్య ప్రక్రియ కథ' అంటూ ఎక్కువగా ఆంగ్ల పదాలు ఉపయోగించనవసరం లేదని, భాష బరువుగా ఉండనవసరం లేదని రచయితని సున్నితంగానే హెచ్చరించారు. ఈ మాటలకు డా.చంద్రశేఖర్ గారు నొచ్చుకుని, ఆ క్షణానికి బాధపడినా మార్చుకోవడానికి ప్రయత్నం చేసారు. తర్వాత కాలంలో ఆయన రచనలలో స్పష్టమైన మార్పు కనబడుతుంది. బరువైన భాష స్థానంలో బరువైన భావ వ్యక్తీకరణ, నూతన పదచిత్రాలు చోటుచేసుకున్నాయి. దురదృష్టం ఏమిటంటే... తెలుగు సాహితీజగత్తులో ఎంతో ఎత్తు ఎదిగి, తెలుగువారికి గర్వకారణమైన ఓ రచయితగా గుర్తింపు పొందగలడని ఆశించిన తరుణంలో పిన్నవయసులో ఆయన సుదూరతీరాలకి వెళ్ళిపోయారు.

1959 ప్రకాశం జిల్లాలో జన్మించిన డా. చంద్రశేఖర్ గారు గుంటూరు మెడికల్ కాలేజిలో ఎమ్.బి.బి.యస్ చదివి, ఇండియన్ రైల్వేలో ఉన్నతాధికారిగా పనిచేసారు. సుమారుగా 2012 సంవత్సరం నుంచి అడపాదడపా కొంత అనారోగ్యంతో బాధపడుతూ 2017 లో మరణించారు.

తెలుగు కథాప్రపంచంలో డా. చంద్రశేఖరరావు గారు చిరంజీవిగా... ఆయన కథలు అజరామరంగా నిలిచిపోయాయి! ఈ ఉత్తమ వైద్య రచయితని ఈ 'డాక్టర్ స్పెషల్' సంచికలో కథామార్గదర్శిగా స్మరించుకుంటూ... ఆయనకి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

## నూతనవత్సరపు ఆరంభ సంచికకు ముందస్తు మంజీర నాదం!

మనసు దోచిన ముఖ చిత్రంతో, పత్రికను నిరంతరాయంగా నడపడానికి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తూన్న ప్రకటనతో వెలువడిన ఈ నెల కథామంజరి బాగుంది. ముఖచిత్రం మరీ ఆకర్షణీయంగా ఉంది. అందాల ప్రకృతిని కనువిందైన రీతిలో ముఖచిత్రాలుగా వేయడమనే ఆలోచనకు.. పత్రిక సాంకేతిక బృందానికి అభినందనలు! ఈ నెల భువనచంద్రగారి పరిచయంలో శ్రీ శ్రీ, ఆరుద్ర,‐ ‐ ‐ వంటి వారు సైన్యంలో పని చేశారని తెలిసి ఆశ్చర్యపోయాను.

ఈ సంచికలో మొత్తం పన్నెండు కథలున్నాయి. వాటిలో చివరలో ఉన్న జొన్నవిత్తులగారి 'నాగేటి సాళ్లలో', భువనచంద్రగారి 'సరేనా' కథలు వేటికవే బాగున్నాయి. జొన్నవిత్తులగారి కథ మరీనూ! ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతానికి, వామనుడి త్రివిక్రమ దర్శనానికి సంధానం చేస్తూ, శాస్త్రదోషం లేకుండా పసందుగా సాగింది. ఇప్పటి కథకులు కథ రాయడానికి ముందు ఎంతగా అధ్యయనం చేయాలో, సమకాలీనతను ఎలా అవగాహన చేసుకోవాలో నిరూపించింది. ఒక పాఠమే అని చెప్పొచ్చు. యధావిధిగా 'సరేనా' కథ భువనచంద్రగారి చిలిపితనాన్ని పట్టించింది.

మిగిలిన కథలలో ఆకట్టుకున్న కథలు శివకుమార్ గారి 'తుమ్మల్లో వెలుగు'. రుద్ర నాయుడూ, చీర కొంగున 'గుప్పెడు తెగింపు'ని మూట కట్టుకుందీ... అనగానే దౌటనుమానం వచ్చింది. అనుకున్నట్టుగానే కథ నడిచింది. సీనియర్ కదా... కథ నడక బాగుంది. మరి జంగమదేవర ఎవరు... బహుశా రుద్ర నాయుడే పంపి ఉంటాడు. కథ అంటే అన్నీ విప్పి చెబుతారా? మీరు మరీనూ!! కదా.

అలాగే మరో ఆకట్టుకున్న కథ సూర్యలక్ష్మి గారి 'చీకటిలో... కారు చీకటిలో..'. ఈ కథతో నాకు 'ట్రెపీజ్ ఆర్టిస్ట్' అంటే తెలిసింది. సర్కస్‌లో తాళ్ళతో వేలాడే రెండు మూడు బారల కర్రతో విన్యాసాలు చేసేవారు. ఆ మధ్యన ఎక్కడ చూసినా.. బోరు బావిలో పసి పిల్లాడు లేదా పసి పాప... అనే కలవరపెట్టే వార్తలు బాగా వినవస్తున్నాయి. వాటిలో పసి ప్రాణం కాపాడబడిన ఘటనను ట్రెపీజ్‌తో ముడిపెట్టి రాసిన కథ. చివర వరకు ఉత్కంఠ బాగానే వచ్చింది గానీ, చివరలో రెండు పేరాలు చాప చుట్టేసినట్టనిపించింది. కాస్త ముందే ముగిస్తే ఎలా ఉండేదో?? సూర్యలక్ష్మిగారిని అడగాలి. 'ఇది నా కథ. నేను అనుకున్నచోట ముగిస్తాను. నువ్వెవరివాయ్.. ఇక్కడ ముగించు.. అక్కడ ముగించు.. అని చెప్పడానికి!' అంటే. ఏం చేస్తాం? వారి మాట కూడా కరెస్టే కదా!

ఇక రమణరావుగారి 'అంతస్తులు ' కథ. అంశం సరే గానీ కథను రాయగలిగేంత విషయమున్న అంశమా? అంటే ఏమో! ఇంతకీ 'కృష్ణ విజ్ఞత ముందు నా సంస్కారం...' అంటూ సాగిన మాటలో విజ్ఞత, సంస్కారం అన్న పెద్ద మాటల వాడకానికి చోటెక్కడుంది? కృష్ణకు బతుకు తెలివితేటలు, కథకుడి మిత్రుని మీద ప్రేమా? అంతే గదా? పోనీ అవే ముందు వాక్యంలోని పదాలనుకుందామా? అలాగే తటవర్తిగారి 'క్షమ'. ఏం చెప్పదలుచుకున్నారో! పాత్రకు నియమిత స్వభావాలు సరిగా నిర్ణయించుకోకుండా కథ చెప్పినట్టయింది అనిపించింది. అలాగే పుల్లంరాజుగారి 'తిలా పాపం ..తలా పిడికెడు..' కూడా!

ఇవన్నీ ఒక పాఠకుడిగా నా 'సొంత' అభిప్రాయాలేనండీ! ఎవరూ ఏకీభవించనక్కరలేదు. పనికి వచ్చే పలుకులుంటే తీసుకోవడానికి కాపీరైట్ లేదు!!!!

**రాంబో**

ఇప్పుడే విన్నాను. శ్రవ్య సంచిక పేరుకు తగినట్టుగానే శ్రావ్యంగా ఉంది. చదివిన తీరు అలనాటి రేడియోను తలపించింది. ఏదో చిన్నప్పటి ఆదివారం మధ్యాహ్నంలోకి వెళ్ళిపోయినట్టనిపించింది.

కథారచయితగా జొన్నవిత్తుల పేరు అజోవిభో కథాపోటీలలో ప్రథమ బహుమతి విజేతగా (వంధ్య కథ) దాదాపు ఇరవైయ్యేళ్ళ క్రితం విన్నాను. తరువాత ఒకటో రెండో చదివానంతే. ప్రతిభావంతుడు. నా అభినందనలు చెప్పండి. ఈ నాగేటిసాళ్ళు వింటూంటే ఎందుకో ఒకసారి మల్లాది, లేదా ఒక అమరావతి కథల శంకరమంచి, లేదా మరొకరు (వేణువు గురించిన కథ) మనసులో మెదిలారు.

పోతన చరిత్రను వానమామలై వరదాచార్యులు పద్యకావ్యంగా రాశారు. ఉచ్చారణ చాలా బాగుంది. ఒకటి రెండు చోట్ల భ ధల బెడద కలిగిందని చెప్పడానికి మనసు రావడంలేదు. 4:57 దగ్గర పూర్ణశ్యలాగా వినబడింది. పూర్ణస్య అని ఉండాలి కద.

వామనావతారం నాకు చాలా ఇష్టమైన ఘట్టం. అప్పుడప్పుడు చదువుతూంటాను. 'స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు', 'కలరున్ దాతలు', శంభుండో హరియో పయోజభవుడో, రవి మధ్యాహ్నమునన్ చరింప, ఇలా బోలెడు రమణీయమైన పద్యాల భాండారము.

ముఖ్యంగా ఆయన ఎన్నుకున్న 'రవిబింబంబుపమింప'. అది వినగానే చెప్దామనుకున్నాను. పోతన ఎలా ఒక కెమెరామన్ లాగా వామనుని కాయవృద్ధి పాఠకుల కళ్ళకు కట్టించాడో కదా అని. ఇంతలో రచయితే అదంతా అద్భుతంగా వివరించారు.

తెలుగు అభిమానులు అల్పసంఖ్యాకులైపోయిన ఈ కాలంలో ఈమాత్రం వినడానికి నోచుకోవడం మా అదృష్టం.

మీ కార్యవర్గబృందానికి అందరికీ అభినందనలు. మీ తరువాయి సంచికకై ఎదురుచూస్తూ

**మదన్, కెనడా**

# రచయిత పరిచయం

## అనువాద కథ

### మెడికో శ్యామ్

తెలుగు సాహితీ ప్రపంచంలో మెడికోశ్యామ్ గా ముద్రపడిన డా. చిర్రావూరి శ్యామ్ గారు రాశి లో కంటే వాసిలో ఉన్న కథలు రాశారు. కథలకి శీర్షికలు పెట్టడంలోనూ, కథాశైలిలోనూ తనకంటూ ఓ ప్రత్యేకత ఉన్న రచయితగా గుర్తింపు ఉంది. శ్యామియానా, సరాగమాల వంటి కథాసంపుటాలతో పాటు ఎన్నో తెలుగు, ఆంగ్ల, హిందీ భాషలలొ వ్యాసాలు, సమీక్షలు రచించిన డా. శ్యామ్ కి సాహిత్యం వైపు మక్కువ పెంచుకోడానికి దోహదపడింది ఇంట్లో వాతావరణమే! వారి తండ్రి సర్వేశ్వరశర్మ గారు కూడా పేరుపొందిన సాహితీవేత్తే. డా. శ్యామ్ గారి చిన్నతనంలో వారి ఇంట్లో.. చాసోగారు, రోణంకి అప్పలస్వామి గారు వంటి ప్రముఖుల సాహితీ సంభాషణలు నిత్యంజరుగుతుండేవి. డా.శ్యామ్ గారు క్లాస్ పుస్తకాలతో పాటు ఇంట్లో ఉండే తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలని కూడా చదివి, వారి చర్చలలో పాలుపంచుకునేవారుట. అలా ప్రేరణ కలిగి, ఏడో తరగతి చదువుతున్నప్పుడే ఇంగ్లీషులో పద్యాలు రాసారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషలలొ మంచి ప్రావీణ్యత ఉన్న డా. శ్యామ్ గారు పుట్టింది కోయంబత్తూర్ లో, బాల్యం, హైస్కూల్ విద్య, ఇంటర్ వరకు విజయనగరంలో జరిగాయి. తర్వాత మెడిసిన్ ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో, పబ్లిక్ హెల్త్ లో ఎండీ ఏం. డీ. ఢిల్లీ లోని ఆల్ అల్ ఇండియా ఇనిస్టీట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సైన్సస్ లో చేసి అక్కడే చాలాకాలం పని చేసి, ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ అండ్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్, అమెరికా యూనిట్ లో ఫ్యాకల్టీ గా పని చేస్తున్నారు. ఎయిమ్స్ లో పని చేస్తున్నప్పుడు కిడ్నీదివ్యాధి , డయాబీటీస్ కి సంబంధించిన పరిశోధనా వ్యాసాలను ప్రభుత్వానికి సమర్పించి, కిడ్నీ వ్యాధిని జాతీయ ఆరోగ్య విపత్తు పరిధిలోకి తీసుకు రావడానికి కృషి చేసారు. ఇండియా, అమెరికా దేశాలలో వైద్య పరిశోధనల్లో పలు అవార్డులు రివార్డులు అందుకున్నారు. తెలుగు కథాసాహిత్యంలో

అనంతమైన జ్ఞానసంపద ఉన్న డా. శ్యామ్ యుపియస్‌సి నిర్వహించే వైద్యుల నియామక కమిటీ సలహాదారుడుగా చాలాకాలం పనిచేశారు కూడా. గతంలో కథామంజరిలో ప్రచురింపబడిన వారి కథ 'వంటకం', ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ వారి సాహిత్య సభలో సమర్పణకు ఎంపికై, ఆయనే స్వయంగా చదివి వినిపించారు కూడా. డా. శ్యామ్ గారు మంచి వక్తగా ఇండియా, అమెరికా దేశాలలో మంచి పేరు తెచ్చుకున్నారు. వారు భవిష్యత్తులో మరిన్ని కొత్త కథలతో తెలుగు కథాప్రియులను అలరించగలరని ఆశిస్తున్నాం.

# అనువాద కథ

మెడికో శ్యామ్

+18032375741



***ఈ విశాలసృష్టిలో ఒక్కడే మూల రచయిత. మిగతా అందరమూ అనువాదకులమే.***
***అనేకమంది అనువాదకులు చుట్టుముట్టి గోలగోలగా గొణుగుతున్నట్టు... గొణగొణ.***
***జీవితమంతా అదే పనిచేసిన ఓ దద్దమ్మ, అసలు అనువాదం సాధ్యమేకాదంటున్నాడు. కవిత్వం విషయంలో అసలే కాదు అంటున్నాడు... కొత్తవాళ్ళకీ కుర్రవాళ్ళకీ నేర్పరా నాయనా అంటే!***

"మీ కథ అనువదించడం సాధ్యం కాదు!" అన్నాడు అతడు.

"ఏ కథ?" అన్నాను.

"ఏ కథ అని కాదు. ఏ కథైనా సరే..." అన్నాడతను నవ్వుతూ.

నాకేం నవ్వు రాలేదు.

ఏం? ఎందుకు? ఎలా? ఇలా అన్ని ప్రశ్నలూ వచ్చేయి మనసులోకి.

కాని ఏ ప్రశ్నలూ రాలేదు పెదవి పైకి.

"మీ కథలు అనువాదానికి లొంగవు!" అన్నాడు అతడే మళ్ళీ, అదేదో ప్రశంసలాగ.

తనేమీ అనలేదు.

మళ్ళీమళ్ళీ అవే మాటలు వినిపించసాగేయి.

మెల్లమెల్లగా అవేం నచ్చకపోవడం, నొప్పినొప్పిగా అనిపించడం ప్రారంభమైంది.

చిమ్మచీకట్లు నెమ్మదిగా కమ్మేయో, ఒక్కసారిగా అలముకున్నాయో గాని, గదినిండా, మదినిండా చీకటే చీకటి.

పొగమంచులోంచి చూస్తున్నట్టు, కేటరాక్ట్ కళ్ళల్లోంచి చూస్తున్నట్టు మసకమసకగా కనిపిస్తున్నాయి బతుకూ... భవిష్యత్తూ.

ఒక్కసారి బయటి వాతావరణంలో శిశిరం ముసిరినట్టు ఉంది. ఇంట్లో, వంట్లో కూడా శిశిరకాలపు శీతలమే. ఏది దేనికి కారణమో తెలియదు మరి.

తనకి జీవితాన్నీ, పరిస్థితులనూ అనువదించుకోవడం రాలేదు. తనకనుగుణంగా అనువదించుకోవడం రాలేదు. అర్థం చేసుకోవడం రాలేదు.

చేతకాని అనువాదకులు అనుసృజన చేస్తారనేవాడు తను. అదికూడా తనకి చేతకాలేదు.

"అంత మొనగాడివైతే ధనవంతుడివెందుకు కాలేదూ?" అన్నదట ఒక అమెరికన్ రచయిత్రి.




నా గురించేనా?

వెండికప్పులు తేవలసినవాడు వెళ్ళి అప్పులు తెచ్చాడు.

పరాజితుడైన ప్రతిసారీ నేర్చుకుందాం అనేవాడు.

ఏవయిందా స్ఫూర్తి? ఆ వన్నె? ఆ తళుకు బెళుకు?

ఏమిటీ అసహాయత? ఒంటరితనం? నిస్తేజం. నీరసం.

ఇది శారీరకమా? మానసికమా?

ఈ విశాలసృష్టిలో ఒక్కడే మూలరచయిత. మిగతా అందరమూ అనువాదకులమే.

అనేకమంది అనువాదకులు చుట్టుముట్టి గోలగోలగా గొణుగుతున్నట్టు... గొణగొణ.

జీవితమంతా అదే పని చేసిన ఓ దద్దమ్మ, అసలు అనువాదం సాధ్యమే కాదంటున్నాడు. కవిత్వం విషయంలో అసలే కాదు అంటున్నాడు... కొత్తవాళ్ళకీ కుర్రవాళ్ళకీ నేర్పరా నాయనా అంటే!

మరో 'స్వయంభూ'ననుకునే ప్రబుద్ధుడు పదార్థమే ప్రధానమన్నట్టు సెలవిస్తున్నాడు. పదార్థము జడపదార్థము. భాషాతీత భావప్రకటనే సరియైన పరిభాష అని మరిచి.

ఎందరో మహామహులు వెలయించినట్టు ఒకోసారి పెద్దపెద్దవి కాదు, చిన్నచిన్న పదాలు ఇబ్బందిలో పడేస్తాయి.

ఇటాలో కాల్వినోకి పనిలేని ఉత్తరాంధ్ర మాండలీకం తగిలించే వాడొకడు... ఒక గుసగుస.

చెహోవ్‌కి తూ.గో. యాస అతికించే వాడొకడు – మరో గుసగుస.

మిషనా, కమిషనా ఏదిఘోరం? ఏది ఘోరాతిఘోరం?

అనువాదం అనునాదం. అది హృదయంలో భాషలకతీతంగా ఇంకిపోయి, పొంగిపొరలి, వరలి వ్యాపించదా?

రచనల్లోని మెత్తని ఊహలనీ, వెచ్చని స్పందనలనీ అనువాదంలో అందించలేమా? గుండెగోడల్ని తడిమి తట్టే, గుర్తుండిపోయే వాక్యాలు ప్రసరింపజేయలేమా?

చదవడం ఒక అనుభవమైతే, అన్ని అనుభవాల్లాగే ఎవరికివారు అనుభవించి, రచయిత చెప్పిన విషయాన్ని అర్థంచేసుకుని, చెప్పని, చెప్పలేని విషయాన్ని ఆస్వాదించడం సాధ్యం కాదా?

అనువాదకుడు మొట్టమొదట సహృదయుడూ, పిదప చదువరీ, కట్టకడపట భాషాంతరీకరణ చేయువాడూ కదా!

కాదా?!

అనువాదకుడు సర్వశక్తిమంతుడైపోయి రచయిత భావి భాగ్య విధాతైనాడా?

మిగతా భాషల విషయం తెలీదుగానీ, మన విషయంలో అది నిజమే అన్పిస్తోంది.

తివాచీ మీదకెలా చేరేనో నాకే తెలీదు.

లోపలా బయటా అంతా చీకటిలో ఒంటరిగా మౌనంగా రోదిస్తున్నాను.

ఆ రోదనలో వెక్కిళ్ళలో వెచ్చని గాలి నా మొహానికి దగ్గరగా.

అక్వేరియం గోడల్లోంచి చూసినట్టుగా మకమకలాడుతూ తెల్లగా ఏదో రెండుకాళ్ల మీద నిలబడి నా మొహానికి దగ్గరగా నాలుకతో నాకుతూ.

ఒక్కసారి తెలివొచ్చింది.

ఎవరు?

ఇంకెవరు?

మా మిక్క... మనిషికి అత్యంత మిత్రుడు.

కొద్ది కొద్దిగా వెక్కుతున్నట్టు వాడి గొంతులోంచి వింత శబ్దం.

నాలో కదలిక రాగానే, ఒక్కసారి ఉత్సాహంగా ఎగురుతూ, తోక వేగంగా ఆడిస్తూ, జారుతున్న నా కన్నీళ్ళని చప్పరిస్తూ...

చెప్పక్కర్లేకుండానే చెప్పలేని భావావేశాల్ని నాలో జొనిపిస్తూ మిక్క.

తివాచీ మీద కూర్చుని తాపీగా నా చేయిని లాగి, నింపాదిగా ఒకటి విడిచి ఒకటి చేతుల్ని నిమురుతున్నట్టు.

అలా ఎంతసేపో!

ఒక్కసారి ఉబికి ఉబికి ఉప్పొంగిన దుఃఖం చల్లగా చల్లబడింది. దుఃఖాశ్రుబిందువులు ఆనందబాష్పాలుగా మారాయి.

నేనొంటరిని కాననీ, నా భావాలని అర్థంచేసుకునే, అనువదించుకోగలిగే అనువాదకులున్నారన్న ఆలోచనే అద్భుతంగా అనిపించింది.

సానుభూతీ, కరుణా, దయా, నెనరూ, కూరిమీ ఈ పదాలేవీ తెలీని అమాయకప్రాణిలో ఏమీ తిరిగి ఆశించని అంతప్రేమ ఎలా సాధ్యమయిందో!

నా మనసులోని వేదన ఎలా అర్థమయిందో!?

అది ఆ జీవి జీవలక్షణమని అర్థమయింది!!

సౌహిత్యంలేని సాహిత్యసేవ, అది అనువాద సేవైనా, నిరర్థమూ, నిష్ప్రయోజనమూ అని అర్థమయింది.

మెల్లమెల్లగా ఒళ్ళంతా, మనసంతా, వెచ్చవెచ్చగా పాకిన హాయి. మెదడులో ఆవహించిన హర్షోల్లాస చైతన్యం.

కళ్ళల్లో వెలిగిన, వెదజల్లిన వెలుగులు.

నా రచనలనాహ్వానించే, అర్థంచేసుకునే, ఆస్వాదించే, అనువదించే సహృదయులుంటారు!

కావలసింది కాస్త ఓరిమి.

మిక్కని ప్రేమగా దగ్గరికి తీసుకున్నాను.

# రచయిత్రి పరిచయం

## కర్పూర దీపం

### డా. పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి

నెల్లూరు జిల్లాలో తొలి నవలా రచయిత్రిగా తెలుగు సాహితీ రంగంలో పేరు గడించి, 14వ ఏట 'శ్రీరాముడి పేలలో' అనే కథతో తన రచనా ప్రస్థానం ఆరంభించిన రచయిత్రి డా. పెళ్లకూరు జయప్రద గారు. అటు వైద్య వృత్తిలోనూ, ఇటు రచనా ప్రవృత్తిలోనూ ఎదిగి, ఇంకా ఎదుగుతూ, 75 వసంతాలు నింపుకున్న డా. జయప్రద గారు నెల్లూరులో పుట్టి, ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో మెడిసిన్ చదివి, ఓ ఐదు సంవత్సరాలు ప్రభుత్వ డాక్టర్ గా పనిచేసి, తర్వాత స్వతంత్రంగా వైద్యవృత్తిని చేపట్టి, నేటికి 53 సంవత్సరాలు అయింది. 'ఇంకా చేస్తాను.. ఇంకా రాస్తాను' అంటూ హుషారుగా చెప్పే డా. జయప్రదగారు తన రచనలతో 38 పుస్తకాలు విడుదల చేశారు. అందులో నవలలు, కథాసంపుటులు, కవితా సంపుటులు, నానీలు, దీర్ఘ కవితలు, సాహిత్య స్వర్ణోత్సవ సంచిక, వ్యాసాలు.. ఇలా అన్నీ ప్రక్రియలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం పొందిన డా. జయప్రద గారు, నెల్లూరులో నేటికీ వైద్య వృత్తిని నిర్వహిస్తూ, మధ్య మధ్యలో కథలు, నవలల, కవితలు, వ్యాసాలు రాస్తూనే ఉన్నారు. వారిని ఎన్నెన్నో డాక్టర్ పురస్కారాలు, సాహిత్య పురస్కారాలు వరించాయి. వారి చాలా కథలకు, నవలలకు, కవితలకు, వ్యాసాలకు బహుమతులు వస్తూనే ఉన్నాయి. అన్నిటికి మించి.. దివ్యాంగులకు వృద్ధులకు మానసికంగా, ఆర్థికపరంగా, వైద్య పరంగా తన వంతు సాయం అందిస్తూ అందరికీ మార్గదర్శకులుగా ఉన్న డా. జయప్రదగారి ఏ కథ అయినా నిత్య నూతనంగా ఉంటుంది.

# కర్పూర దీపం

డా. పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి



9440279594

***"ఒరే అబ్బాయ్... మన చేతిలో డబ్బుంటేనే అన్ని ఆచారాలు, అన్ని సాంప్రదాయాలూను! ఉన్నవాళ్ళు కూడా ఇప్పుడు రెండో రోజే పెద్దకర్మ కూడా చేసి, ఉద్యోగాలకు వెళ్ళిపోతున్నారు. అప్పుచేసి అమ్మకు నూటొక్కటీ జరిపితే ఆమె ఆత్మ శాంతించదు. అందరు బంధువులు ఇక్కడే ఉన్నారు. ఈ రోజే పెద్దకర్మకు చేసే తంతేమైనా ఉంటే చేసేయండి. ఇలా మీరూ మీరూ తగువులాడుకోకండి. అది పెట్టాలి, ఇది పెట్టాలి అని బ్రతుకే కనాకష్టంగా ఉన్న అక్క చెల్లెళ్ళను అప్పులపాలు చేయకండి. అప్పుడే అమ్మ ఆత్మ శాంతించేది!"***

ఆమె అమ్మ! పదిమంది సంతానానికి అమ్మ! ఈ రోజు ఆ అమ్మ చనిపోయింది. ఆమె వయస్సు డెబ్బై. ఐదుగురు కొడుకులు, ఐదుగురు కూతుళ్ళు. పిల్లలకు పెళ్ళిళ్ళు చేసి మనవల్ని ఎత్తుకున్న ఆమె, ఎక్కిరాని కొడుకుల గురించి దిగులు పడ్తూ... టెన్షన్... బిపి పెంచుకుని చనిపోయింది. ఏ బిడ్డ బాధపడుతున్నా చూడలేక ఒంటి మీద ఉన్న కొద్దిపాటి నగలను ఇచ్చేసింది. ఆఖరుకు మంగళ సూత్రాలు కూడా!

అదే వీధిలో నేను ఒక రూములో కాపురం ఉంటూ ఆమెతో స్నేహం కలిపాను. అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నా ఎప్పుడూ నవ్వుతూనే వుండేది. పిల్లల్ని కూడా ఏమీ అనలేని పరిస్థితి. ఎవ్వరూ చదువుకోలేదు. ఆటో రిక్షా తొక్కుతూనో, పండ్లు అమ్ముకుంటూనో గంపెడు బిడ్డల్ని కంటూ రోజు గడిపే వాళ్ళు. నేను ఇద్దర్ని కని ఊర్కున్నాను. ఇద్దరూ చదువుకున్నారు. ఒకడు ఉద్యోగం చేస్తున్నాడు. రెండో వాడు రొయ్యపిల్లల ప్రమోటర్‌గా వుంటూ, ఈమధ్య ఆశ పెరిగి చిన్న హేచరీ తీసుకుని, రొయ్యపిల్లలు తయారు చేసే బిజినెస్‌లో దిగాడు.

పరమపదించిన రమణమ్మ ఇన్ని రోజులు తనకు, తన భర్తకు వచ్చే పెన్షన్లో బాడుగ రూములో ఎలా గడుపుతోందోనని అనుకోని పిల్లలు, ఇప్పుడు ఏడుస్తున్నారు. రక్త సంబంధం కదా.

ముత్తయిదువ చావు కనుక ముఖం తెలియనంతగా పసుపు, కుంకుమ పూసారు. అన్నం లేక చనిపోయిన అమెను చూడడానికి వచ్చిన బంధుజనానికి అన్నం పెట్టారు. ఆమె ముత్తయిదువ కనుక బంగారు మంగళ సూత్రాలు రెండు తెచ్చి ఆమె పసుపు తాడుకు తగిలించాడు బంగారం పనిచేసే కొడుకు. బతికుండగానే అమ్మ మెడను చూసి రెండు బొట్లు చేయించుంటే ఆమె సంతోషపడేది కదా! ఆ బంగారు సూత్రంతోనే ఆమె కడసారి ప్రయాణం జరగాలట. అలాగే జరిగింది. నేను ప్రేక్షకురాలిగా నిలబడ్డాను.

కొడుకుల్ని కన్నప్పుడల్లా ఎంత సంతోషించిందో ఆ తల్లి! తనకున్నంతలోనే అందరి బిడ్డల్ని సమంగా చూసిన ఆ అమ్మ కర్మక్రతువులు చేయడానికి ఒకరి మీద ఒకరు పోటీపడడం లేదు. ఎవరికి వారే నువ్వు చెయ్యాలంటూ తగువు వేసుకుంటున్నారు. తండ్రి బిక్క చూపులు చూస్తున్నాడు. ఇప్పుడు ఒంటరి అయిన తనని ఎవరు చూస్తారోనని ఆలోచిస్తున్నట్లున్నాడు. పోట్లాటలు, కొట్లాటలు సాగుతూనే ఉన్నాయి. మరో ప్రక్క జరగాల్సిన సంప్రదాయాల గురించి ఆడపిల్లలు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు మాట్లాడే సంప్రదాయం ఖర్చు లెక్క వేస్తే చాలానే అవుతుంది. 'అంత ఖర్చు భరించగలమా? చెయ్యి నోటి దగ్గరకు పోవడమే కష్టంగా వుంది' అని వాపోతున్నారు.

అన్నీ వింటున్న నాకు నోరు విప్పాలనిపించింది. మెల్లిగా అన్నాను. "ఇప్పుడు ఇవన్నీ అవసరమా?"

"మన ఆచారాన్ని పాటించకపోతే ఆమె ఆత్మ మా చుట్టూ తిరగదా?" వాళ్ళలో ఒకరు అన్నారు.

నాకు నవ్వొచ్చింది.

"అమ్మ మన చుట్టు తిరిగితే సంతోషమే కదా!" అన్నాను గొణిగినట్లుగా...

ఎవరూ విన్పించుకోలేదు. లేని వాళ్ళు, కాస్త ఉన్న తోబుట్టువుల్ని "మీరు పెట్టుకోవచ్చు కదా" అని అడుగుతున్నారు.

"మాకూ పిల్లలున్నారు" గుంపులో నుండి ఒక కూతురు.

'నిజమే... పిల్లలున్నారు. పిల్లలకు పెట్టే ఖర్చులో ఓ కొద్దిపాటి ఖర్చు అమ్మకు కూడా పెట్టచ్చుకదా!' నా మనసు మూలిగింది. సహాయం చేయాలంటే నేను ఒంటరిగా పెన్షన్‌తో బ్రతుకుతున్నదాన్ని. అవసరాలకు తప్ప... ఆచారాలకు, దేవుడికి ఖర్చు పెట్టనిదాన్ని. అయినా దేవుడు నామీద కోప్పడలేదు. నాకు ఎలాంటి హానీ చేయలేదు. ఒక దీపం వెలిగించి పెడదామన్నా, ఆ నూనె ఖర్చుతో నాకు కూరకి ఇంత నూనె మిగుల్తుంది అనుకునే తత్వం నాది!



"వెంటిలేటర్ నుండి అమ్మను బయటకు తీయకుండా వుండాల్సింది. ఇంకొన్ని రోజులు బ్రతికుండేది.." కన్నీళ్ళతో ఓ కూతురు అంటోంది.

రెండు రోజులు బ్రతకడానికి వీళ్ళ స్థితికి అన్ని వేలు ఖర్చుపెట్టాలా? ఇప్పటికే ఇరవై వేలయ్యింది. చావబోతున్న అమ్మకు ట్రీట్‌మెంట్ ఇప్పించాల్సిందే... కానీ ఆ ట్రీట్‌మెంట్‌కి పెట్టిన ఖర్చు బ్రతికుండగానే పెట్టుంటే ఆమె చనిపోయేది కాదు. ఆమె అన్నం లేక చనిపోయింది. పిల్లల దగ్గర నుండి తిండికోసం తలా ఒక వంద అడిగి నిరాశపడి చనిపోయింది. పెన్షన్ ఇంటి బాడుగకు సరిపోతే ఆ అమ్మ, ఈ అమ్మ పెట్టే దాంట్లో ఇంత భర్తకు పెట్టి తాను తినే తల్లి, ఇంకా బ్రతకాలా? జబ్బులతో ట్రీట్‌మెంట్ లేక దినదినం అల్లాడే అమృతమూర్తిని ఇప్పుడు బతికించాలా? అవసరం లేదు. ఆమె అన్ని బంధాలనుండి, కడుపుతీపి నుండి, కడుపాకలి నుండి విముక్తి పొందుతూ హాయిగా వెళ్ళి పోయింది.

నేను కూడా కొద్దిగా జాగ్రత్తపడాలి. నా కొడుకు చిన్నాడేం కాదు. నిన్న అడిగాడు. నా భర్త మిగిల్చిన మెడలో ఒక్క గొలుసు, ముక్కుపుడక ఇవ్వమని. ఇద్దామనుకున్నాను, నిన్న రాత్రి వరకూ!

రమణమ్మ చావు నాకు చాలా సత్యాలు చెప్పింది.

శవం ఇల్లు దాటి వెళ్ళిపోయింది. నేను ఇంటి దారి పట్టాను. నాలుగు అడుగులు... నా రెండో కొడుకు, ఇంట్లో కూర్చునున్నాడు. వాడికి, నేను ఉదయం చేసిన ఉప్మా మిగిలిపోయుంటే, అది తెచ్చిపెట్టి కుశల ప్రశ్నలు అడిగాను.

"బిజినెస్ ఎలా వుందిరా?"

"డబ్బుంటే బాగుంటుందమ్మా. నీ కోడలి నగలు కూడా తాకట్టు పెట్టేశాను. ఇక నువ్విచ్చే నగలకు వచ్చే డబ్బు ఖర్చు పెట్టాలి!"

"అంతటితో అయిపోతుందా?"

"అప్పుడే ఎలా అయిపోతుంది? ఇంకా చాలా పెట్టాలి."

ఇంత భారం ఎందుకు పెట్టుకున్నావయితే? బ్రోకర్‌గా దర్జాగానే ఉండేవాడివి కదా. పెళ్ళానికి నగలు కూడా చేయించావు... ఇంకొద్ది రోజుల్లో ఇల్లు కట్టుకుంటున్నానని కూడా చెప్పావు? ఎందుకొచ్చిన దురాశలు నాయనా!"

కొడుక్కి ఒళ్ళు మండిపోయింది.

"ఎదుగూ బొదుగూ లేని జీవితంలో ఇలాగే వుండాలనా నువ్వు చెప్పేదీ?"

"నువ్వు ఎదిగితే సంతోషమే కదా నాయనా. కానీ ఇలా ఇబ్బందులు పడి ఆరోగ్యం పాడుచేసుకుంటావేమోనని నా భయం!"

"లేదమ్మా... డబ్బుంటే భలే లాభాలమ్మా!"

"డబ్బు లేదు కదరా! ఉన్నది కాస్తా కాజేసుకుంటివి. వ్యాపారమా మధ్యలో ఆగిపోయె!"

ఈసారి కొడుక్కి కోపం వచ్చింది. "నీ నగలు అడుగుతున్నాననే కదా, నాకు పాఠాల మీద పాఠాలు చెప్తున్నావు!"

ఈ తరం వాళ్ళకు మంచి చెప్తే సహించదు కదా. మనసులోనే నిట్టూర్చాను.

"ఒరేయ్ ముకుందా! రమణమ్మ చావుని చూసొచ్చానురా. ఆమె ఒంటి మీద కొన్ని నగలున్నా వాటిని అమ్మి ఆరోగ్యం బాగు చేయించుకునేది. ఇప్పుడే చచ్చిపోయి వుండేది కాదు!" అన్నాను, వాడు అర్థం చేసుకుంటాడని.

"నీకు అలాంటి బాధ లేదమ్మా... మేమున్నాముగా నిన్ను చూసుకోవడానికి!" అమ్మ వెనకడుగేస్తుందేమో అని కొద్దిగా భయపడ్డాడు నా కొడుకు.

"నాకు మీరిద్దరే... రమణమ్మకు పదిమంది బిడ్డలు!"

"అదే ఆమె చేసిన తప్పు" ఇప్పటికి ఒక మంచి మాట అన్నాడు నా పుత్రరత్నం. నిజమే ఎక్కువమంది పిల్లలుంటే ఎవరికి వారే, బాధ్యత నుండి తప్పుకుంటారు.

"నువ్వు త్వరగా ఇస్తే నేను తాకట్టు పెట్టి ఈ రోజుకి రొయ్య పిల్లలకు ఫీడ్ కొనాలమ్మా!" వాడి మాటలకు ఆశ్చర్యపడ్డాను.

"మరి రేపటికి?"

"అప్పుడు ఆలోచిస్తాలేమ్మా!"

"ఒరే... నా మెళ్ళో గొలుసు ఈ రోజుకి వాటి తిండికి సరిపోయే పనైతే నేనివ్వనురా. అదే నాకు... నాకు కడకి ఇంత తిండి పెడ్తుందేమో. ఒక్క రోజు కాదు. నేను చచ్చేదాకా..." నాకెందుకో కన్నీళ్ళొచ్చాయి. బహుశా రక్త సంబంధం బాధపెడ్తోంది కదా... నన్ను!

"నేను మరలా తెచ్చిస్తా కదమ్మా. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటా... నా బిజినెస్ సక్సెస్ అయితే..."

కళ్ళల్లో నీళ్ళు మరింత ఊరాయి. 'ఆ కన్నీళ్ళే రమణమ్మను అనాథను చేసింది. నేనీ పొరపాటు చేయకూడదు. కడుపు తీపికి లొంగ కూడదు.' గట్టిగా నిర్ణయించుకున్నాను.

"వద్దులే నాయనా, భవంతుల్లో గడపాలని నాకేం లేదు. నువ్వు సంపాయించుకుని ఎదిగితే సంతోషిస్తాను. కానీ, మీ నాన్న గుర్తుగా ఉన్న ఈ గొలుసు నన్ను ఉంచుకోనీ... ఏమీ అనుకోకు...."

నా కొడుకు ఇంకా చెలరేగుతాడనుకున్నాను. కాసేపు నిశ్శబ్దంగా మిగిలిపోయిన ముకుందం "నువ్వే అలా అంటే నేనేం చేయాలమ్మా?"

పాపం నా కొడుకు... నా రక్తంలో రక్తం, రేపు నాకు కొరివి పెట్టాల్సినవాడు బ్రతిమలాడుతున్నాడు. అందరు బిడ్డలు ఒకేలాగుంటారా? పాపం వాడు మంచోడే... కోడలి వల్ల వేరుపోయాడు గానీ, లేకపోతే ఈ ముసలితల్లిని ఒంటరిగా వదిలేవాడా? అయినా నేను కాకపోతే వాడిని ఎవరు ఆదుకుంటారు?

నా మనసు వెన్నలా, ఐస్ ముక్కలా కరగిపోయింది.

హఠాత్తుగా స్పృహ వచ్చినట్లయింది. ఏవిటిది? నేనీ ధోరణిలో ఆలోచిస్తుందేవిటి? తల్లులు ఇలా త్యాగమూర్తులవుతుంటే బిడ్డలు స్వార్థపరులు కావడంలో ఆశ్చర్యమేముంది?

ఉహు... త్యాగశీలి బిరుదు నాకు వద్దు! ఆఖరి దశలో రోడ్డున పడదలుచుకోలేదు

"ముకుందా! నాకుండేదే ఈ ఒక్క గొలుసు... నా తర్వాత నువ్వే తీసుకో నాయనా! ఇప్పుడే అడిగి నన్ను బాధ పెట్టకురా!"

"అప్పుడు నాకెందుకమ్మా... అప్పటికి నేను నిలదొక్కుకుంటాను... అన్నయ్యను అడుగుదామంటే వదిన అడ్డుపడతాది."

"ఎవరి జీవితాలు వాళ్ళవి కదా నాయనా!"

"అలా అనకమ్మా... ఎవరో ఒకరు చేయి అందించకపోతే ఎలా అమ్మా? అన్నయ్య గవర్నమెంటు ఉద్యోగి ఇప్పుడు కాస్త సాయం చేస్తే, నేను ఎదిగి తీర్చేయనా!"

కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు ముకుందం. మరలా కరిగిపోతున్నాను నేను.

ఉహూ కరగకూడదు. బిడ్డ అలుగుతున్నాడని... నెలాఖరు రోజుల్లో మిగిలిన పది రూపాయల్ని వాడి చేతుల్లో ధైర్యంగా పెట్టేసేదాన్ని నేను. ఒకటో తేదీకి భర్త జీతం తెచ్చి నా చేతిలో పోస్తాడనే ధైర్యంతో... ఆ ధైర్యం ఇప్పుడేది? కొడుకులిద్దరూ వేరుపోయారు. ఏ అర్ధరాత్రో ప్రాణం పోవచ్చు... అనాథగా! ఎవరూ లేనిదానిలా కళ్ళు మూయొచ్చు... అదే జరిగినా పర్వాలేదు. ఈ గొలుసుతో పని లేదు. మెడలో బంగారు గొలుసుతో ఊరేగాలని నాకు లేదు. ఆఖరి దశలో, అదే నా బాధలకు ఉపశమనం ఇస్తుందని ఓ భరోసా...

ఎంత దురన్యాయం! ఇద్దరు కొడుకుల్ని కని, పెంచి, పోషించి, పెద్దచేసి తమ తదనంతరం ఒంటరి వాళ్ళయిపోతారనే భయంతో, వాళ్ళకంటూ ఒక సంసారం ఉండాలని పెళ్లి చేస్తే... ఏం జరుగుతోంది? తమకు సర్వం చేసే తల్లిదండ్రులను ఏకాంతానికి వదిలేస్తున్నారు.

క్షణంలో క్షణం సేపు అన్యాయానికి, కడుపుకోతకి మధ్య నలిగిపోయాను. ఆఖరుగా నిర్ణయించుకున్నాను.

చిన్నకొడుకు పెరిగి పెద్దవాడైనప్పుడు ఎంత సంతోషించానో, ఇప్పుడు సంపాదనాపరుడైతే అంతే సంతోషిస్తాను బతికుంటే... అంతేగానీ వాడి ఎదుగుదలకు, గొలుసుకు ముడిపెట్టడం చేయదల్చుకోలేదు.

"లేదులే ముకుందా! ఈ ఒక్క గొలుసుతో నీ కష్టాలు తీరిపోవు. నీకు చాలా మంది శ్రేయోభిలాషులు, స్నేహితులు ఉన్నారని చెప్తుంటావు కదా! వాళ్ళు నీకు సహాయం చేస్తారేమో అడుగు నాయనా"

ముకుందానికి మరలా కోపం వచ్చింది. కొద్దిగా ఆవేశంగా అన్నాడు.

"రక్తం పంచిన నువ్వే సాయం చేయనప్పుడు వాళ్లకి ఏం బట్టి చేస్తారు!"

"నిజమేలే" గొణిగాను.

హఠాత్తుగా వాడు పసిపిల్లాడిలా నా ఒళ్ళో వాలాడు.

'అమ్మా నువ్వే దిక్కు' అన్నట్టు చూసాడు.

నా తల్లి మనసు కరిగిపోయింది. మరలా కడుపుతీపికి లొంగిపోయింది. ఆ ప్రేమపాశం తాలూకు హస్తం బిడ్డ తల నిమురింది.

"అలోచించి చెప్తానులే నాన్నా... వెళ్ళి నీ ప్రయత్నాలు కూడా నువ్వు చేసుకో"

వాడు లేచి నిల్చున్నాడు.

"అలాగేమ్మా... ఆలోచించుకో రేపు వస్తాను." వాడు వెళ్ళిపోయాడు.

ఈ సృష్టే చిత్రం. బిడ్డలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు, ఎన్ని త్యాగాలయినా చేస్తారు తల్లిదండ్రులు! వాళ్ళు పెద్దవాళ్ళయి పాఠాలు చెప్పేకా... తమ జీవితం గురించే ఆలోచించుకుంటారు. ఇది స్వార్థం కాదు. భయం! బిడ్డలు తమని చూస్తారో చూడరో అనే భయం. జీవితాలు చెప్పిన పాఠం!

ఆలోచనల నుండి తేరుకుని ఉప్మా ప్లేటు వంక చూస్తే... వాడు ఉప్మా తినకుండానే వెళ్ళిపోయాడు. మరలా కడుపుతీపి తాలూకు తడి.

ఆ రాత్రంతా ఆలోచించుకుని ఓ నిర్ణయానికొచ్చాను నేను. ఆ తర్వాత ఏ అర్థరాత్రికో నిద్ర పట్టింది.

మర్నాడు రమణమ్మ చనిపోయిన రెండవ రోజు. ఆ కార్యక్రమాలకు పిలిచారు. వెళ్ళాను. మరలా అదే తంతు. ఇప్పుడెలాగో కొద్దిమంది కాబట్టి జరిగిపోయింది. రేపు పెద్దకర్మ రోజు ఎలా చేయాలి? వాగ్వివాదాలు, తగువులు, పోట్లాటలు, కొట్లాటలు. నేనిక ఓర్చుకోలేకపోయాను.

"ఒరే అబ్బాయ్... మన చేతిలో డబ్బుంటేనే అన్ని ఆచారాలు, అన్ని సాంప్రదాయాలూను! ఉన్నవాళ్ళు కూడా ఇప్పుడు రెండోరోజే పెద్దకర్మ కూడా చేసి, ఉద్యోగాలకు వెళ్ళిపోతున్నారు. అప్పుచేసి అమ్మకు నూటొక్కటీ జరిపితే ఆమె ఆత్మ శాంతించదు. అందరు బంధువులు ఇక్కడే ఉన్నారు. ఈ రోజే పెద్దకర్మకు చేసే తంతేమైనా ఉంటే చేసేయండి. ఇలా మీరూ

మీరూ తగువులాడుకోకండి. అది పెట్టాలి, ఇది పెట్టాలి అని బ్రతుకే కనాకష్టంగా ఉన్న అక్కచెల్లెళ్ళను అప్పులపాలు చేయకండి. అప్పుడే అమ్మ ఆత్మ శాంతించేది!"

డబ్బు లేకనో, లేక నా సలహా వాళ్ళకు నచ్చో, సమస్య తీరుతుందనో... కర్మ కూడా మొత్తానికి ఆరోజు ఖర్చుతోనే చేయాలని నిశ్చయించుకున్నారు.

ఈసారి నాలో ఊగిసలాట లేదు.

నా కొడుకు వయస్సులో ఉన్నాడు. ఎలాగైనా భార్యాబిడ్డల్ని పోషించుకోగలడు. నన్ను ఎవరూ పోషించేవాళ్ళు లేరు.. గవర్నమెంట్ ఇచ్చే పెన్షన్ తప్ప.

పనిచేసి సంపాదించలేని ముసలితనం వెక్కిరిస్తుంటే... రమణమ్మ చావు, మారుతున్న మాతృప్రేమలోకి వచ్చి హెచ్చరిస్తుంటే ఆఖరి నిర్ణయం తీసుకున్నాను.

# రచయిత పరిచయం

## దేవుడు బాబు

### డా. రవి శర్మ

*డా. పూడి పెద్ది రవీంద్రనాథశర్మగారు చిత్తూరులో పుట్టి, విశాఖపట్నం, ఆంధ్ర మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివి, గత నాలుగు దశాబ్దాలుగా, అమెరికాలో కేన్సర్ స్పెషలిస్ట్ గా పని చేస్తున్నారు. ప్రస్తుతం వాషింగ్టన్ డి.సి. లోని హోవర్డ్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. సంఘసేవాభిరతి ఉన్నవ్యక్తి. దానధర్మాలు చేయడంలో దిట్ట. అమెరికాలో చాలా పేరు సంపాదించుకున్న మహామనీషి. అట్లాంటాలో 1996 లో ఒలింపిక్ టార్చ్ ని పట్టుకుని పరిగెట్టడానికి ఎన్నిక కాబడిన మొట్ట మొదటి తెలుగువాడు డా. రవిశర్మగారు. అమెరికాలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నా.. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ, తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తున్నారు. డా. రవిశర్మగారి భార్య శ్రీమతి రామశేషు గారు కూడా వైద్యవృత్తిలో ఉంటూ, తెలుగు భాషాసాహిత్యంలో చాలా కృషి చేస్తున్నారు.*

# దేవుడు బాబు

డా. రవి శర్మ



***"బాబు అలా ఆడి కతమంతా ఇవరంగా సెప్పి, "ఒరే ఎఱ్ఱి సన్నాసీ, మనమందరి ఈ పేద బతుకులు. మతాలన్నీ ఉన్నోళ్ళకి. అడుక్కు తినే బతుక్కు ఎవడు తిండి పెడితే ఆడే దేవుఁడ్రా. కిస్టుడు ఆవుల్ని తోలితే, ఏసు గొఱ్ఱెల్ని తోలే గొల్లోడు. ఏసు కూడా దేవుడు బాబేన్రా.***

నా పేరు అబ్బరం అండి. 'అప్పన్న' అనేవోళ్ళు జనాలు. కోనసీమలో కూలి పని సేసేవోళ్ళండి. మా అయ్య, అమ్మ, రాజులింట్లో! సచ్చినోడు--- మా అయ్య నా సిన్నప్పుడే మా అమ్మను ఒగ్గేసి మాయమయ్యేడండి... తాగుబోతు నాయాల! మా అమ్మ పుట్టడం సివ్వాచెలంలో బాబూ. అందికే నన్నప్పన్న అనేవోళ్ళు. అమ్మకు సదువు నేదండి. రెక్కాడితేకాని డొక్కాడదు కదండీ. పెద్దోళ్లింట పనిపిల్ల కింద ఉండేది. నాయుళ్ళండి--- పెట్రోలు బంకు, లారీల కిరాయి యాపారం. రైలు పట్టాల కూలి పనిలో సేరింది బాబు వయసొచ్చేనాటికి. అప్పుడు సూసిందండి మా అయ్యని. నల్లగ, సింగరేని బొగ్గులాగ మెరిసిపోతూ ఉండేఓడని సెప్పేది. నూనూగు మీసాలప్పుడే మొదలెట్టేయంటండి. కులం తెలీదు. మాలోళ్ళు కాదు. మాదిగోళ్ళు కాదు. గొల్లోళ్ళేమో? గుళ్ళోకెల్తే పంతులు లోనికి రానీలేదంటండీ. బైటనుండే దండవెట్టేవాడంట. ఆళ్ళూళ్ళో వక సెట్టుండేదటండి. దాని సుట్టూ మూడు పెదచ్చినాలు సేత్తే ఏ పనైనా తలుసుకుంటే అవుద్దట--- పెద్దింటోల్లు సెప్పేవోరు! ఓనాడు మా అయ్య సీకటడిన తరోత సెప్పాసెయ్యకుంటా మా యమ్మను లాక్కెల్లి, ఆ సెట్టు సుట్టూ మూడు సుట్లు సుట్టేడటండీ. సుట్టి, "పోలీ,నా ఆలివైపానావే' అని సెప్పేట్ట బాబూ. ఆడి సిన్నాన్న నులిగడుపు ఇరోసినాలు వచ్చి పొయ్యేడు కదండీ... 'కులం తక్కువదాన్ని సేసుకున్నాడ'ని తన్నేడటండీ. అయినా మా అయ్య లెక్క సేయలేదు బాబూ. మొదట్లో బాగానే గడిసిందండీ. కెమంగా కలాసీలతో కలిసి తాగటం ఆరంబించేడండి. రాజులాయనొకాయన జాలిపడి కోనసీవ తీసుకుపోయేడండి. నేను పసికందునండి. కొన్నాల్లూరక మల్లీ పాతదారంటే పడ్డాట్టండీ. కల్లు తాగి ఓనాడు మాయమ్మను సితక్కొట్టి మాయమయ్యేడటండి, దొంగనాయల! నన్నెంటనేసుకుని మా యమ్మ మల్లీ ఇసాకపట్నం వేపు ఒచ్చిందండీ... కూలిపని దొరుకుద్దేమోనని! ముక్కుపుడక, గాజులు,కాల్లమట్టిల్లు తాకిటెట్టి సావులమదుం దగ్గర ఒక టిన్ను సెడ్డులో సేరిందండీ.


దానికి పరివిట్టు లేదు. అమాయకపు గొడ్డండి, దానికి తెలీలేదు. పోలీసోడొచ్చి నాతో తొంగోయే,షెడ్డు తీయనన్నాడట. దాంతో సివమెత్తి ఆడ్ని తన్నింది బాబూ. బొక్కలో తోసేసేరు. అదొచ్చేదాకా, నేను రైల్వేటేసనులో టీ కొట్టులో కప్పులు కడిగేవోన్ని. ఏదో పడేసీఓరు, తినడానికి అప్పుడప్పుడూ. నిజెం సెప్పాలంటే కడుపెప్పుడూ ఆకలితో కటకటలాడుతుండేది. అప్పుడే ఐజాగులో ఆటోలొచ్చేయి. ఆ డైవర్లు టీ కొట్టి కబుర్లాడేటప్పుడు నేను జాగ్రత్తగా ఇనేవోడ్ని. ఆళ్లదగ్గరే నేర్సేనండి, ఇంజిను రిపేరు! పెట్రోలు బంకోళ్ళు టేషను దగ్గరే ఉద్దోగమిచ్చేరు. కాపులోళ్ళ పిల్ల జొన్నపొత్తులు కాల్చేది బాబు. దాన్ని మనువాడేనండి. అగ్గిలాంటి పిల్ల బాబు. ఒక్క గుంటడండి. అమ్మ కోసమని అన్ని దేవుళ్ళకు మొక్కేనయ్య. సాములోళ్ళందరకూ దండాలెట్టేను. దొంగ నాకొడుకులు, జైల్లో టి.బి. వస్తే మందులకు కర్చవుద్దని ఒగ్గేసేరు. కేజీఎచ్చి కెడ్తే సచ్చిన్నోళ్ళు డబ్బులిత్తే గాని సూడనన్నారు. దొరలు, ఫారినోళ్ళూ, టిప్పులిచ్చేవోళ్ళు. లోకలోళ్లు, పీనాసోళ్ళు బాబూ. గుంటడిని బడిలో ఏదామని కూడగట్టిన డబ్బు టీబీ మందులకై పోనాయి! ఈడు కూడ,కూలోడై పోతాడేవోనని దిగులేసింది.

మాఓడొొకడు సీకాకులం వోడండి. ఓనాడు గుడిసి కొచ్చినాడు. సర్టు,పేంటు, జోల్లూ ఏసుకొనున్నాడు. ”ఏటిరా కల్లుసారా అమ్మతనావేటిరా? సిప్పోళ్ళకు ఆడోళ్ళనందిస్తన్నావేటిరా? జాలారిపేతలో ఫారెను సావాన్లమ్ముతున్నావేట్రా నాయాల” అని నిలదీసి అడిగేను సార్.

“అదేవీ లేదురా. ఎర్రోడి మతంలో సేరేన్రా!” అన్నాడండీ. అదేంట్రా అని అడిగేను. నూకాలమ్మ జాతరకు, తలుపులమ్మ సంబరాలకు, మేవిద్దరమీ కొంచెం మందు కొట్టేవోళ్ళం. నిజం సెప్పాలికదా సార్. మావోడికి ఎప్పుడూ నోటంత మాట పైకొచ్చేది కాదు. కానీ ఆయేల సిక్కోలు ఏసతో సారం చెప్పేడు సార్.

“ఒరే అప్పన్నా, మనవంతా పంచమోళ్లమురా. పెద్దోళ్ళందరూ గుళ్ళకెల్తారు. ఆళ్లంతా మంత్రాలు సదువుతారు. ఆళ్ల కుర్రోళ్లను ఇంగిలీసు సదువు సదివిత్తారు. మనకేటుందిరా? గాందీగారు సెప్పేరు. జగ్జీవన్ రాం గారు సెప్పేరు. అంజియ్య చెప్పేరు. కులం లేదన్నారందరూ. కులం లేకుండా ఎక్కడికి పోతదేటిరా? ఇదంతా, మన ఇందూ మతానికేరా! ముదనష్టపు రాత!”

“ఒకనాడొక బైబిలాయన వచ్చేడ్రా గుడిసెలోకి. అమెరికానుండట. సెట్టంత మడిసి. షేకు హాండిచ్చేడు. పాకలో కూసొని కష్టసుకాలడిగేడు. రొయ్యల కూడుంది తింటాడేంటి దొర అనడిగింది మా యాడది. ఇంగిలీసులో సరే అన్నాడు! అప్పన్నా... పెద్ద కులమోళ్ళిల్లల్లో పనిసేసేదిరా మీ యమ్మ. నువ్వు కూడా పెద్దాళ్ళిళ్ళలో పెరిగేవు కదా. ఎప్పుడైనా, కావందులూ, రైతులూ, ఇలా నిన్ను మనిసిలా సూసేర్రా? మనవన్నీ మూడ నమ్మకాలని సెప్పేడ్రా ఆ బైబిలాయన. ఏసుని నమ్ముతే పాపాలన్నీ పోతాయన్నాడు. గోదార్లో మూడు మునకలు మునుగుతే పోతాయన్నా. కుళ్ళు ఒంకాయ నీళ్ళలో ముంచితే కుళ్ళు పోతుందా అని అడిగేడు. సబవేనని పించింది.”




“మా ఆడదానికి సుస్తీ సేసిందిరా. ఎలా తెలిసిందో, ఏమో బస్సంత ఫారిన్ ఏసుకుని తోలుకొచ్చినాడు. సెంటు జోసెపు ఆసుపత్రికి లాక్కు పోయినాడు. ఆళ్ళకు ఇంగిలీసులో అన్నీ సెప్తే మనిసిగా సేసి వప్పగించేర్రా. సేతి కరుసులకని ఒక యాబై రూపాయలు, తెలుగులో ఒక బైబిలు ఇచ్చేర్రా. సదువు రాదమ్మా అంటే కేరల నరసమ్మ,”పరవాలేదులే. తలదెగ్గిరెట్టుకో... పెబువు సల్లగ సూసుకుండాడనింది.”

“మా పిన్నతనంలో వానాకాలాలొస్తే ఆడోళ్లందరూ సుక్కురోరాలు గొప్ప గనంగా సేసేవోరురా. రంగురంగుల కోకలేసుకొని అమ్మోరికి దండాలేట్టేవోరు. కొత్తమావోస్య అయిన తరోత బైబిలాయన ఓనాడు ఇద్దరు తెలుగోళ్ళను తోడుకొచ్చేడ్రా. మొదటోో బామ్మలంట. తాతముత్తాతల్లో ఒకాయన మన బాసకు యాకరనం రాసేట్ట. పరోస్తువోరంట, ఇంటిపేరు! ఈయన మట్టుకు ఏసు వైపు వెళ్ళిపోయేట్ట. ఏదాలలో అలాగే సెప్పేరని ఆయన అన్నాడ్రా. ఆయంతో వచ్చిన రెండొ మనిసి డాట్టరు బాబట.

కిరస్తానీ నర్సుని లవ్వు సేసి, మనువాడి మతం మార్చేడట. పాత పేరు సోమయాజులుట. తరువాత సామియల్ అయ్యేట్ట. అంతంత గొప్పోళ్ళే మతం మారుస్తూ ఉంటే, పేదోళ్ళం మనకేంట్రా. ఆడదానితో మాట్టాడితే... ఎంకటేసరసామిని, అమ్మోరు తల్లిని ఒగ్గేసి, ఎవరో సిలేసినాయనకు దండాలెట్టా పెట్టేది మావా అని ఏడిసిందిరా!"

"కొత్తామాఓస్య అని సెప్పేను కదరా. అదయిన తరువోత ఓ సుక్రవోరం నాడు చర్చికి రా అయ్యా, పెబువును యూదుల పంతులోళ్ళు ఇస్రయిలులో సిలవేయించిన రోజు." అని సెప్పేరు. మళ్ళా వేను పంపింసేరు. మనలాంటోళ్లని సాలా మందిని కూడగట్టుకుని వేను చర్చి కెల్లిందిరా. అందర్ని బల్లల మీద బడిలో కూర్చున్నట్టుగా కూర్చోపెట్టేర్రా. ఏవో పాటలు పాడ్రు. ఒకాయాన పేస్టరుట. స్టేజీ ఎక్కి, ఏసు పెబువు గొప్పతనం సెప్పేడు. గొప్ప కూడెట్టి, కొత్త బట్టలిచ్చి కుట్టుకూలికి పాతిక రూపాయలిచ్చి పంపిన్నినాడ్రా!"

"అప్పన్నా, మన కోయిళ్ళకెడితే పూజారోళ్ళు కసురుకుంటారు. సాలా రోజుల కిందట టెంకాయ కొడదారని ఆస పడింది మా యాడది. గుడికెడితే గవర్మెంటోడు పెట్టిన సిట్టీవోడు పదిరూపాయలవుద్ది అన్నాడు. గవర్మెంట్ పొజిసన్ కదా, సాయిబోడికిచ్చేర్రా పోస్ట్. సివరకి, ఆడూ, పంతులూ, టెంకాయ కొట్టనివ్వలేదురా. ఇయన్నీ మనసులో పెట్టుకొని మతం మార్సడానికి ఒప్పేసుకున్నాం!"

"నాకు, మా ఆడదానికి, సిన్నోళ్ళకు దొరల పేర్లు ఇస్సేర్రా. మా ఆడది రూపాయకాసంత బొట్టెట్టుకుని, మల్లెపువ్వులెట్టుకొని, కొత్త గాజులేసుకుంటే అమ్మతల్లిలా ఎలిగి పొయ్యేది. అదంతా మూర్కత్వం, కొత్త మతంలో అయన్నీ కూడదని సెప్పేరు. పదిరోజులేడిసింది, మా మావుండగా కుంకం ఎట్టా సెరుపుతాను అంటా. పుస్తులతాడు కూడా తీసేమంటే, అమ్మోరి సాచ్చిగా మావ కట్టిన తాడు... నేను సవుద్రంలో పడి సస్తాగాని తీయనని ఏడిసింది. పోనీలే అని ఒగ్గేసేరు. ఇప్పుడంతా బానే ఉంది. ఆదోరం నాడు అందరం సెర్చికెడతాం. మా పిన్నోళ్ళకు ఆళ్ళే సదువు సెప్పిస్తున్నారు. మా పెద్దోడు ఇంగ్లీసు బాగా మాట్టాడుతాడు. మా బొట్టి మతం పాటలు... దొరసానిలా పాడతాంది. ఈ మద్దెన మతం పెసారం సేత్తావా, అవెరికా నుండి డబ్బులొస్తున్నై, కూటికి లోటుండదని అడిగేరు. ఏవో ఆసలుంటాయి కదా సరేనన్నాను.

ఇప్పుడు నన్ను రెవరెండు అంటార్రా. ఒక పూట కూడుంటే రెండో పూట మాడే బతుకుల్రా మనయి. మన ఇందూవోళ్ళో మూర్కత్వం, ఫారెనోళ్ళ డబ్బులు, ఏసుప్రబువు దయ. ఇప్పుడు బతుకు బాగుంది. రెండు వోరాల కితం మతం పనిమీద అన్నవరం ఎళ్ళేం. ఎప్పుడెళ్ళినా సత్తెన్నారాయన సామి ఓరికి దండాలెట్టీవోణ్ణి. మా ఆడదానికి పెసాదవంటే బక్తిరా. కొంచెం అనిపించింది. సరేలే మతం మార్చేం కదా అని గుప్పున ఊరుకున్నారా."

"బాబు అలా ఆడి కతమంతా ఇవరంగా సెప్పి, "ఒరే ఎర్రి సన్నాసీ, మనమందరియా పేద బతుకులు. మతాలన్నీ ఉన్నోళ్ళకి. అడుక్కుతినే బతుక్కు ఎవడు తిండిపెడితే ఆడే దేవుడ్రా. కిస్టుడు ఆవుల్ని తోలితే, ఏసు గొర్రెల్ని తోలే గొల్లోడు. ఏసు కూడా దేవుడు బాబేన్రా. నేను పెపంచం మాపు బుక్కోటి సూశేన్రా. దాని అమ్మ సిగతరగా, ఏసు పెబువు మతం అన్ని సోట్లా ఉందిరా. మన ఇందూమతం ఒక్క మన దేసంలోనే కనబడ్తాది. అంటే పెపచెంలోని జనాలంతా మూర్కులంతావంట్రా?' అని అడిగేడు సార్.

ఇంత సెపుతున్నాడు కద సార్. బతుకు మెరుగవుదన్నఆస, చంటోడికి సదువు సెప్పించాలన్న ఆలోసన, బీదోళ్ళకు ఏ దేవుడైనా ఒకటే కదా అని మతం మార్చేను సార్. అప్పుడొచ్చిందయ్యా. ఈ పేరు, 'అబ్రహం'ట. బండనోళ్ళు తిరగవు సార్. 'అబ్బరం' అంటన్నారు జనాలంతా.

# రచయిత పరిచయం

## డాక్టర్స్ డైరీ

**డా. డి. వి. జి. శంకరరావు**

*తెలుగు రచయితలు గాని, కవులు గాని మనకి ఇప్పటి రాజకీయాల్లో కనపడటం లేదు. వెనకటి రోజుల్లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు మనకి రాజకీయాల్లో కూడా రాణించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. విలువలను కాపాడే ఆ నాయకులకు ప్రత్యేకమైన గౌరవం లభించేది. కానీ ఇప్పటి రాజకీయాల్లో సాహితీవేత్తలు గాని, రచయితలు గాని మనకి కనబడటం లేదు. కానీ ఆ లోటుని తీర్చడానికి అన్నట్టు.. ఈ రోజుల్లో ఆ అపురూపమైన విశేషంతో సాక్ష్యాత్కరించే రచయిత వైద్యులు డా. డీ. వి. జి. శంకరరావు గారు. ఓ రాజకీయ పార్టీ నాయకుడుగా రాజకీయాల్లో పనిచేసి, 1999 లోకసభకు ఎన్నికై, లోకసభ సభ్యుడుగా పని చేసి, తిరిగి తన వృత్తిలో, ప్రవృత్తిలోకి ఆనందంగా అడుగు పెట్టిన ఓ అరుదైన రచయిత డా. శంకరరావు గారు. ఇప్పటికీ అదే చైతన్యంతో.. అటు వృత్తితో పాటు, ఇటు ప్రవృత్తిగా.. పదునైన తన కలంతో సామాజిక విషయాలమీద కవితలు, కథలు సంధిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. అంతే కాదు.. నిత్యం కనబడే దేశ రాజకీయ, సాంఘిక, సామాజిక సమస్యల మీద స్పందిస్తూ, నిక్కచ్చిగా తన అభిప్రాయాలను వివిధ దినపత్రికలలో లేఖల ద్వారా అందిస్తూ ఉంటారు. 1969 సంవత్సరంలో విజయనగరం జిల్లా సాలూరు మండలం పాలికవలసలో రైతు కుటుంబంలో పుట్టి, అక్కడే హైస్కూల్ విద్య ముగించి, ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎం బి. బి. ఎస్. తర్వాత ఎం డి. చేసి, గత 17 సంవత్సరాలుగా విజయనగరం మిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. డా. శంకరరావు గారి సతీమణి శ్రీమతి స్వర్ణలత గారు కూడా అక్కడే డైటీషియన్ ఉన్నారు. తెలుగు, ఆంగ్ల దిన పత్రికలలో వివిధ సమస్యల మీద సుమారు 2500 పైగా వ్యాసాలు, లేఖలు ప్రచురింపబడ్డాయి. డా. శంకరరావు గారు 300 పైగా కవితలు, పాతిక పైగా కథలు వివిధ పత్రికల్లో ప్రచురింపబధ్దయి. సమకాలీన దేశ రాజకీయ వ్యవస్థకి డా. శంకరరావుగారి వంటి రచయితల పాత్ర ఎంతైనా అవసరమని భావిస్తూ, చైతన్య పరిచే వారి కథలతో అలరిస్తూనే ఉంటారని భావిస్తున్నాం.*

డా. డి.వి.జి.శంకర రావు



94408 36931

***'నన్ను కొట్టిన హస్తమూ' అంటూ కూనిరాగం తీసి ఆ చేతికి మందెక్కిస్తూ "ఈ చేత్తోనే సార్ నన్ను కొట్టాడు." అంటూ డ్యూటీ డాక్టరు నవ్వాడు.***

***"నిన్ను నానా తిట్లు తిట్టిన నోరు ఇప్పుడు ఎంత బుద్ధిగా మూతపడి ఉందో చూడండి!" డ్యూటీ డాక్టర్ నవ్వుకు జత కలుపుతూ ఎనస్థటిస్ట్ కామెంట్ విసిరాడు.***

"డాక్టర్ గారూ! ఎమర్జెన్సీ. అర్జెంట్‌గా రండి." అన్న ఫోన్‌కాల్‌తో ఉన్నఫళంగా ఇంటి నుండి మా హాస్పిటల్‌కి చేరుకున్నాను. అసలే కరోనా రోజులు. పేషెంట్‌ని కాదు కదా, తోటి మనిషిని కూడా చూసి దడుచుకునే రోజులు. మా టౌన్లో మాది పేరొందిన హాస్పిటల్. కరోనా లక్షణాలు లేని కేసుల వరకూ, అత్యవసరమైతే చూస్తున్నాం. కరోనా కేసుల కోసం ప్రభుత్వం కొన్ని హాస్పిటల్స్‌ని కేటాయించింది. అవి కిటకిటలాడుతూనే ఉన్నాయి.

స్ట్రెచర్ మీద పేషెంట్ స్పృహలో లేడు. తనతో బాటు ఒక టీనేజ్ దాటిన అబ్బాయి ఉన్నాడు. దగ్గరకు వెళ్లి చూస్తే పేషెంట్‌ది తెలిసిన ముఖమే. రంగారావు. ఈ టౌన్‌లో పేరుమోసిన రౌడీ. ఇతణ్ని సరిగ్గా వారం క్రితమే మా హాస్పిటల్‌లో ఫర్నీచర్ ధ్వంసం చేసి, డ్యూటీ డాక్టర్ పై చెయ్యి చేసుకున్నందుకు పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పుడైనా ఆయన మాపై దాడి చేసింది కేవలం డబ్బు గుంజడానికే. వాడి అనుచరుడికి సరిగ్గా ట్రీట్మెంట్ అందలేదని, అందుకనే మరణించాడని ఒక మిష చూపించాడు. ఆ అనుచరుడు తాగి తాగి, లివర్ పూర్తిగా పాడైపోయి, చావు బతుకుల్లో వస్తే చాతనైనంత వైద్యం చేశాం. వాడు ఎటూ పోతాడని చెప్పడానికి ఏ తెలివితేటలూ అక్కరలేదు.

ఏ డ్యూటీ డాక్టర్ పై చెయ్యి చేసుకున్నాడో, ఇప్పుడాయన చేతిలోనే సపర్యలు పొందడం రంగారావుకి తెలియకుండానే జరుగుతున్న విధివిలాసం. బహుశా తెలిస్తే షాక్ అవుతాడేమో భయంతో... అంతకంత కక్ష దీర్చుకుంటారేమోనని.

డ్యూటీ డాక్టర్ పరిశీలించిన అంశాలు నాకు రిపోర్ట్ చేశారు. ప్రాథమిక వైద్యం అప్పటికే మొదలుపెట్టారు. క్షుణ్ణంగా రోగిని పరీక్షించాను. ఆక్సిడెంట్ కేసు. కడుపులో బలమైన దెబ్బ తగిలింది. రక్తనాళాలు చిట్లి రక్తం పోతోంది... కడుపు ఉబ్బిపోతోంది. యాక్టీవ్ బ్లీడింగ్. విశాఖపట్నం పెద్దాసుపత్రికి రిఫర్ చేసి పంపడానికి వీలుకాదు. అంత సమయం లేదు. అక్కడికి వెళ్ళేటప్పటికి పరిస్థితి మరింత దిగజారుతుంది. ఇప్పటికిప్పుడు రిస్క్ తీసుకుని ఆపరేషన్ చేసినా బతుకుతాడన్న గ్యారంటీ లేదు. ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్స్. ఆ విషయమే ఆ అబ్బాయికి వివరించాను. ఈలోగా రంగారావు భార్య కూడా అక్కడకు వచ్చింది. మౌనంగా నా మాటలు వింది. ఆ అబ్బాయి విసురుగా మాట్లాడేడు. "నాన్న ఖచ్చితంగా బతుకుతాడనుకుంటేనే ఇక్కడ ఆపరేషన్ చెయ్యండి. ఏమాత్రం డౌటున్నా వైజాగ్ పంపించెయ్యండి... తీసుకుపోతా!"

అంతా తండ్రి పోలిక.

మా డ్యూటీ డాక్టర్, నర్స్ నన్నే చూస్తున్నారు. గతవారమే జరిగిన సంఘటన గుర్తొచ్చినట్లుంది. వాళ్ల చూపులో 'హమ్మయ్య పీడ విరగడయింది. ఇంకెందుకు సార్ ఆలస్యం పంపించేయండి' అన్న భావం కదలాడింది.


"చూడు బాబూ! ఇప్పుడు ప్రతీ క్షణం విలువైంది. ప్రాణానికి గ్యారెంటీ ఇవ్వలేం కానీ మా శాయశక్తులా ఉన్నంతలో ఉత్తమ వైద్యం అందిస్తాం. మీరు వైజాగ్ తీసుకెళ్లడానికి పట్టే మూడు గంటల్లో రోగి పరిస్థితి మరింత దిగజారుతుంది. అప్పుడు కోలుకునే ఛాన్సులు కూడా తగ్గుతాయి. మీరు ఒప్పుకుంటే ఇప్పుడే ఆపరేషన్ చేయడం శ్రేయస్కరం!"

వాడు కన్విన్స్ అయినట్టు లేదు. మా నర్స్ కూడా ' ఎందుకీ చాదస్తం. వెళ్తామన్న వాళ్ళను వదిలెయ్యక. బాగైతే ఫీజు ఇస్తారో లేదో కానీ, తేడా వస్తే మళ్లీ రగడ!' బయటకే గొణిగింది.

రంగారావు భార్య కన్విన్స్ అయినట్టుంది. మౌనంగా నమస్కరిస్తూ అంగీకార పత్రం మీద సంతకం పెట్టింది.

కరోనా టెస్ట్ చేసి, ఫలితం వచ్చేవరకు వేచి చూసే సమయం కూడా లేదు. రంగారావుని ఆపరేషన్ థియేటర్లోకి షిఫ్ట్ చేశాం. అవసరమైన అదనపు జాగ్రత్తలు తీసుకొని ఆపరేషన్ మొదలుపెట్టాం.

'నన్ను కొట్టిన హస్తమూ' అంటూ కూనిరాగం తీసి ఆ చేతికి మందెక్కిస్తూ "ఈ చేత్తోనే సార్ నన్ను కొట్టాడు." అంటూ డ్యూటీ డాక్టరు నవ్వాడు.




"నిన్ను నానా తిట్లు తిట్టిన నోరు ఇప్పుడు ఎంత బుద్ధిగా మూతపడి ఉందో చూడండి!" డ్యూటీ డాక్టర్ నవ్వుకు జత కలుపుతూ ఎనస్థటిస్ట్ కామెంట్ విసిరాడు.

నేను నవ్వే మూడ్లో లేను. ఆపరేషన్ ఊహించిన దానికంటే క్లిష్టంగా ఉంది. ఏకాగ్రతతో ప్రొసీజర్ నడుస్తుంది. పొట్టంతా రక్తంతో నిండి ఉంది. ఎక్కించడానికి రక్తం దొరకటం లేదు. దాతలు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ఆ అబ్బాయి, వాళ్ళ అమ్మ ఫోన్లో ఎంత ప్రయత్నించినా ఎవరూ ముందుకు రావడం లేదు. గొడవలకి వెంట వచ్చే వాడి అశేష అనుచరగణంలో ఒక్క పురుగు కూడా కనబడలేదు, రక్తమిచ్చి వాడి ప్రాణాలు కాపాడడానికి! భయంతో వచ్చే గౌరవానికి, అభిమానంతో వచ్చే గౌరవానికి అదే తేడా కాబోలు! పైగా కరోనా భయం కూడా పనిచేసి ఉంటుంది.

మళ్లీ మా డ్యూటీ డాక్టరే ముందుకు వచ్చాడు. 'సార్ నాది సేమ్ గ్రూప్ బ్లడ్. నేనిస్తాను.' అంటూ ఆ ప్రొసీజర్ కోసం వెళ్లి వచ్చి తన పనిలో నిమగ్నం అయ్యాడు. ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తయింది. అందరిలో ఒక తృప్తి.

తర్వాత రంగారావు కరోనా టెస్ట్ రిపోర్ట్ వచ్చింది పాజిటివ్‌గా. ఆపరేషన్‌లో పాల్గొన్న ఈ టీం అందరం ఒక వారం రోజులు ఐసోలేషన్ లోకి వెళ్లిపోయాం. కరోనా కరుణించి మమ్మల్ని ఎవరినీ పెద్దగా ఇబ్బంది పెట్టలేదు రంగారావుతో సహా.

రంగారావు పూర్తిగా కోలుకున్నాక, డిశ్చార్జ్ ఇచ్చేముందు నా ఛాంబర్‌కి వచ్చాడు. చేతిలో పూలబొకేతో. వాళ్ళ ఆవిడ, అబ్బాయితో సహా నా కాళ్ళ మీద పడి నమస్కరించారు.

"డాక్టర్ గారూ. మీరు దేవుడు. నేను మీకు అన్యాయం తలపెట్టినా మీరు నా ప్రాణం కాపాడారు. నా మీద మీకు కోపం ఉంది. అయినా ప్రత్యేకంగా హాని తలపెట్టక్కర్లేదు నాకెందుకులే అని వదిలేసివున్నా, నేను బ్రతికే వాడిని కాదు. అలా చేయకుండా రిస్క్ తీసుకొని నన్ను కాపాడడానికి ప్రయత్నించారు!"

"అది నా గొప్పతనం కాదు రంగారావ్. నా వృత్తి ధర్మం. అది పాటించకపోతే ఈ వృత్తికే తగను. నాకన్నా ముందు నువ్వు కొట్టిన డ్యూటీ డాక్టర్‌కి నువ్వు థాంక్స్ చెప్పాలి. ఆయన సమయానికి రక్తం ఇవ్వకపోతే నువ్వు బ్రతికే వాడివి కాదు!"

ఆ క్షణంలో రంగారావు ముఖంలో కనబడిన ఫీలింగ్స్‌ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. కచ్చితంగా చెప్పగలను రంగారావు రౌడీగానే ఉండిపోవచ్చు కానీ ఇంకెప్పటికీ ఏ డాక్టరు పైనా చెయ్యి ఎత్తడు... ఎత్తలేదు.

## రచయిత్రి పరిచయం

# అదర్ ఏంగిల్

**డా. కాళ్లకూరి శైలజ**

మహాత్మాగాంధీజీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకుని తెలుగు సాహితీలోకంలోకి అడుగుపెట్టి, అటు వృత్తిలోనూ, ఇటు ప్రవృత్తిలోనూ ఉన్నత ప్రమాణాలతో రాణిస్తున్న వైద్యులు డా. కాళ్లకూరి శైలజ గారు. తండ్రిగారి బాంకు ఉద్యోగరీత్యా శ్రీకాకుళంలో హైస్కూలు విద్య ముగించి, కర్నూలులో యం.బీ.బీ.ఎస్. చదివి, కాకినాడలో యం.డి. చేసి, అక్కడే జనరల్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్ గా పని చేస్తున్నారు. బాల్యం నుండి తెలుగు భాష అన్నా , తెలుగు సాహిత్యం అన్న మక్కువతో, వ్యాసరచనతో తన రచనాప్రస్థానం మొదలెట్టేరు. వృత్తిలో తీరిక లేకపోయినా, తీరిక చేసుకుని పుస్తకపఠనం చేయడం, ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వడం అంటే చాలా ఇష్టం. వైద్య విద్యార్థులకు పాఠాలు చెప్పేటప్పుడు ఈ విషయాలని ప్రస్ఫుటంగా చెపుతూ, వృత్తితో పాటు తనకోసం ప్రవృత్తిని కూడా ఎంచుకుని ముందడుగు వేస్తే, జీవితానికి ఓ అర్థం, పరమార్థం ఉంటుందనే నమ్మకం డా. శైలజ గారిది. ఆ కోవలోనే నడుస్తూ.. 'నవ నవలా నాయికలు'(9 నవలల స్త్రీ పాత్రల విశ్లేషణ) సంకలనంలో ఒక వ్యాసం, "నవతరానికి రోల్ మోడల్ గాంధీజీ" (వ్యాస సంకలనం), "నేను చూసిన బాపు" (మను బెన్ గాంధీ వ్రాసిన పుస్తకానికి తెలుగు అనువాదం) మొదలగు వ్యాసాలు వ్రాసారు. వివిధ పత్రికలలో ప్రచురింపబడిన తన కవితలతో "కొంగలు గూటికి చేరిన వేళ" అనే కవితాసంకలనం కూడా ప్రచురించారు. కథారచనలో కూడా కలం ఝుళిపించి ఇరవై వరకు కథలు వ్రాసిన డా. శైలజగారు, భవిష్యత్తులో మంచి కథలతో వారి కథాప్రస్థానం కలకాలం సాగాలని ఆశిస్తున్నాం.

# అదర్ ఏంగిల్

డా. శైలజ కాళ్లకూరి



9885401882

***"డాక్టర్ సతీష్.. మీరు పల్మనాలజిస్ట్ కదా? కరోనా పీక్ స్టేజ్‌లో నేను మిమ్మల్ని డ్యూటీలో కలుసుకున్నాను. నా ఫ్రెండ్ ఒకాయన అడ్మిషన్, ట్రీట్మెంట్ విషయంలో మీరు బాగా రెస్పాండయారు." గంభీరంగా చెప్పారు.***

***నిజానికి అచ్చారావుని ఎప్పుడు చూసిందీ సతీష్ కేం గుర్తుకు రాలేదు. మాస్క్‌లు, పీ.పీ.ఈ. కిట్లలో ఎవరూ అజ తెలీదు లెమ్మని సమర్థించుకున్నాడు.***

జిల్లా ఎడిషన్‌లో ఒక మూల వచ్చిన న్యూస్ ఐటం నేను చూడనే లేదు. డాక్టర్స్ గ్రూప్ వాట్సాప్‌లో ఎవరో పెట్టాక తెలిసింది. "జిల్లా వైద్యశాఖాధికారి ఐ.టి. దాడుల్లో చిక్కుకున్నారు. మరో రెండు వారాల్లో పదవీ విరమణ చేయవల్సి ఉండగా ఇప్పుడిలా జరగడం వివాదాస్పదమైంది. ఎవరో పథకం ప్రకారం ఇరికించారని కొందరు, ఎన్నాళ్లగానో ఆయనపై అధికారులు నిఘా పెట్టారనీ, ఈ టైంకి బయటపడిందనీ కొందరు వ్యాఖ్యానిస్తున్నారు!" ఆ వార్తలో సారాంశం అది.

ఈ న్యూస్ ఐటం షేర్ చేసిన వాళ్ళు కింద "సారంగధర సార్‌కి రిటైర్మెంట్ ముందు ఇలా జరగడం అన్యాయమే! మనం కొందరం వెళ్ళి ఆయన్ని కలిసి వస్తే బాగుంటుంది. ఎవరైనా వస్తారా?" అని పెట్టారు.


మేం ఆరుగురం. మమ్మల్ని 'సూపర్ సిక్స్' అనేవారు. సారంగధరగారి కింద పనిచేసి, తర్వాత సర్వీస్ కోటాలో పీజీ కొట్టిన వాళ్ళం. నేనూ రంగా జనరల్ సర్జరీ; సతీష్ పల్మనాలజిస్ట్. మధు, కృష్ణ... అనస్తీషియా. రావ్ మైక్రోబయాలజీ చేసి ఐ.సి.ఎం.ఆర్.లో మంచి పొజిషన్‌కి వెళ్ళాడు.

ఈ విషయం మీద మా ఆరుగురి ప్రత్యేక గ్రూపులో వివరంగా మాట్లాడుకున్నాం. 'ట్యూబెక్టమీ, వాసెక్టమీ ఎలా చెయ్యాలో నేర్పారనీ, ఎమ్మెల్యే దురుసుగా 'జన్మభూమి' కార్యక్రమంలో తిడితే, మొరేల్ దెబ్బతిన్నపుడు ఊరడించారనీ, ఈ రొంపి వద్దు, ఎలాగైనా పీజీ కి వెళ్ళమని చెప్పి పర్మిషన్ ఇచ్చారనీ' సారంగధర సార్ గురించి తలో మాట చెప్పుకున్నాం. ఊళ్లో ఉన్నందుగ్గాను, నేను, సతీషు ముందుగా సారంగధరగారింటికి వెళ్ళాం. ఆయనకింకా బెయిల్ దొరకలేదు. ఎంత అన్యాయం! ఇన్నేళ్ల సర్వీస్ చేసిన డాక్టర్‌కి దిక్కూమొక్కూ లేదు. ఈ పోలీసులు, లాయర్లు, మొత్తం దేశం మీద మాకు కోపంగా ఉంది. వాళ్ళావిడా, పెద్దకొడుకూ మమ్మల్ని కలుసుకునేందుకు నిరాకరించారు. మేం ఆశ్చర్యపోయాం. ఆ కుర్రాడు రఘురాం బాల్యం మా చేతుల మీదుగా జరిగింది. వాడి నాలుగో పుట్టినరోజు నుంచి పధ్నాలుగో పుట్టినరోజు దాకా... పదేళ్లపాటు ఇంట్లో బల్లలు, కుర్చీలు సర్ది, బెలూన్లు కట్టి, కేకులు తెచ్చి, ఫ్రెండ్సందరికీ విందు ఇచ్చి, వేరుగా డ్రింక్స్ పార్టీలు కూడా ఏర్పాటు చేసిన వాళ్ళం. సునీతగారు, రఘు మాకు అరచేతి మీద గీతల్లా తెలుసు. భారంగా వెనుతిరిగాం. ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా మరో గంటకి వాళ్ళమ్మాయి ఉష, అల్లుడు మధు మమ్మల్ని కాంటాక్ట్ చేశారు. వాళ్ల ఆహ్వానం మేరకు ఆదివారం మధ్యాహ్నం సిటీకి దూరంగా ఉన్న హైవే హోటల్‌లో కలుసుకున్నాం.

"అంకుల్ ఇంటికొచ్చారటకదా, థాంక్స్. నాన్న మీకు ఇన్స్పిరేషన్ కావచ్చు, కానీ అమ్మ జీవితంలో నిప్పులు పోశారు!" అన్నది ఉష. నేను సతీష్ వైపు చూశాను. వాడు ఏం చేయాలో తోచక మంచి నీళ్లు తాగాడు.

"కటికొండ సబ్ సెంటర్ ఏఎన్ఎం తో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. మాకు తెలీలేదు. ఒకసారి... నాకు పదేళ్లుండొచ్చు, అమ్మ, అన్నయ్య, నేను ఊరెళ్ళాం. అక్కడ మేం ఉన్న వారింట్లో ఎవరో బంధువు హఠాత్తుగా చనిపోతే. అనుకున్నదానికన్నా ఒకరోజు ముందే ఇంటికి వచ్చేసాం. తలుపు కొడితే నాన్నతో పాటు ఆవిడ కూడా ఉంది. అప్పుడు అమ్మ అడుగు గడప లోపల పెట్టాలో, బయటే ఉండాలో తెలియక నరకయాతన అనుభవించింది. అన్నయ్యకీ, నాకూ ఏం పాలుపోలేదు. నాన్నేం మాట్లాడలేదు. ఆవిడ కామ్‌గా తన బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయింది. నాన్న అమ్మకి 'సారీ' కూడా చెప్పలేదు. మధ్యాహ్నం మూడుగంటల్నుంచి రాత్రి ఎనిమిది దాక వాకిట్లో అచేతనంగా కూర్చుని ఏడ్చిన అమ్మ రూపం, ముందు గదిలో సోఫాలో సిగరెట్ మీద సిగరెట్ తాగుతున్న నాన్న బండరాతి విగ్రహం... మా ఇద్దరి హృదయాల్లో ముద్రించుకుపోయింది."

జరిగింది జరిగినట్టు ఆ సంఘటన మా కళ్ళముందు ఉంచేసరికి, నేను బిగుసుకుపోయాను. కాస్సేపటికి సతీష్ తేరుకుని



"సరేనమ్మా, సార్ అంటే ఒక తరం సర్వీస్ డాక్టర్లందరికీ హీరో వర్షిప్. ఆయనలా పి.హెచ్.సి మొత్తం తిరగడం, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ల టార్గెట్స్‌లో జిల్లాలో టాప్‌లో ఉండడం, ఎంత దూరమైనా, ఎంత రాత్రైనా 'డ్యూటీ ఫస్ట్' అని పని చేయడం... అసలు సంతలో టీకాలు వేయించాలనే ఆలోచన ఆయనదే తెల్సా! ఇలా, అన్నీ ఎంతో గొప్పగా అనిపించేవి" అన్నాడు.

"అవునంకుల్ ఆయన వర్క్ ఒకటే మీకు కనిపిస్తుంది కానీ మాకు ఆయన లోపలి మనిషి కూడా తెలుసు" అన్నది ఉష.

వాళ్ళాయన, "ఉషా ఇట్సాల్ రైట్. అందరిలో షేడ్స్ ఉంటాయి. అప్పుడప్పుడు అవి నేరుగా క్లాష్ ఔతాయి. ఒక్కోసారి బయటపడనే పడవు. సార్, మా మావయ్యగారు నాకు మేనమామ వరస. అన్నీ తెలిసే నేను ఉషను పెళ్లి చేసుకున్నాను. నా ఒపీనియన్‌లో మావయ్యకు అన్యాయం జరిగింది. ఆయన డబ్బు తిన్నారా, ఒకప్పుడు రిలేషన్‌షిప్‌లో ఉన్నారా అన్నది కాదు విషయం. ఈ కంప్లైంట్ చేసిన వ్యక్తికీ, ఆయనకి మధ్య ఏమైంది? ఇది నాకు ముఖ్యం. ఎందుకంటే అతడూ, ఈయన కలిసే పని చేశారు. ఎన్నో ఏళ్ళు కలిసున్నారు. ఇప్పుడు వీరిద్దరి మధ్య ఏం జరిగింది? ఎందుకు చెడింది? ఇది ఆలోచించాలి. ఇంకా ముందు ముందు అతడు మావయ్యను ఏం చేయవచ్చు? వాట్ ఈజ్ హిస్ మోటివ్ అండ్ టార్గెట్? అది తెలియాలి." అన్నాడు.

మేమిద్దరం అవాక్కయ్యాం. మాకన్నా వయసులో సుమారు పదేళ్లు చిన్నవాడు. అందుకేనేమో ఇలా ఆలోచించాడనిపించింది. ఈ కాలం యువత కేవలం రియాక్ట్ అవడమే కాక నెక్స్ట్ స్టెప్ గురించి కూడా థింక్ చేస్తున్నారు.

నేను "ఓకే మధూ గుడ్ పాయింట్. వి షల్ దూ సమ్ హోంవర్క్ అండ్ కం బ్యాక్ టు యు" అని చెప్పాను.

★★★

ఆ మర్నాడే సతీష్, రావు రంగంలోకి దిగారు.

అచ్చారావు పెరట్లో మొక్కలకు నీళ్లు పోసి, తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ ఇంటి పక్క సందులోంచి ముందు వైపుకు వచ్చాడు. పాతకాలపు డాబా ఇల్లు. హడావుడి లేని కాలనీ. ఇంటి పక్కనున్న సిమెంటు మెట్లమీద ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారని గమనించి కాస్త ఉలిక్కిపడి, "మీరెవరు?" అని అడిగాడు.

"మీతో మాట్లాడాలని వచ్చాం" అన్నారు వాళ్లు ముక్తసరిగా.

"నేను ఇక్కడున్నానని మీకెవరు చెప్పారు? అన్నట్టు మీరు డాక్టర్ సతీష్ కదూ?"

"అవునండీ నేను డాక్టర్ సతీష్ నే. మీరు రిటైరయ్యే ముందు రెండు నెలల పాటు లీవు తీసుకుని వెళ్లారని తెలిసింది. సారంగధరసార్ విషయంలో మీతో కొంచెం మాట్లాడాలి."

తడిసిన బనీన్ పైకి లాగి, ఒక పక్క నీళ్లు పోయేలా రెండు చేతులతో పిండుకుని, "ఆపిల్" అని అరిచాడు.

నాలుగున్నర అడుగుల కుక్క, మేడ మీంచి దిగింది. ఆఖరి మెట్టుకు దగ్గరగా ఉన్న సతీష్, రావు పక్కకి జరిగారు.

కుక్కను చైన్‌తో వరండాకున్న గ్రిల్‌కు ఎటాచ్ చేసి, ఆయన లోపలకి దారి తీస్తూ, "సరే రండి, మాట్లాడదాం" అన్నారు. 'కూర్చోండి' అంటూ చెక్కసోఫా వైపు చూపించి లోపలకు వెళ్లారు. పదినిమిషాల్లో ట్రేలో వేయించిన జీడిపప్పు, ఆపిల్ ముక్కలతో వచ్చారు. అంత కామ్‌గా ఉన్న అచ్చారావును చూసి వచ్చిన వాళ్ళు ఉద్రేకం తగ్గించుకుని, కాస్త సెటిలయ్యారు.

"సారంగగారికి మేం కొందరం సన్నిహితులం ఉన్నాం. ఆయన దగ్గర పని నేర్చుకుని పై చదువులకి వెళ్లాం. అందుకే, ఆయన మాకు గురువుతో సమానం" సతీష్ చెప్పాడు.

"మీ ఇద్దరూ కలిసి చేసిన పనులు ఎన్నో ఉన్నాయని కథనాలు వినబడుతున్నాయి కానీ ఇప్పుడు, ఈ నెలాఖరున రిటైరయ్యే సార్ గురించి ఏవో వివరాలు మీరు పై అధికారులకు పంపారట కదా. ఎందుకిలా?"

"అయినా... ఆయన పిల్లలకి లేనిది మీకేంటి?" సూటిగా అన్నాడాయన.

"వాళ్ళు బాధలో ఉన్నారు. మేమే వచ్చాం" రావు అన్నాడు.

"డాక్టర్ సతీష్ నాకు తెలుసు. మీరెవరు?" ఎదురు ప్రశ్నించాడు.

"నా పేరు రావు . ఢిల్లీలో ఉంటాను. నేను కూడా గవర్నమెంట్ ఉద్యోగినే"

"అయితే ఇంకేం, మీకు తెలుసుగా, పెన్షన్ పోతుంది. సర్వీస్ రిజిస్టర్‌లో మచ్చ పడుతుంది. అంతకు మించి ఏమౌతుంది గనక?" అచ్చారావు రెట్టించి అంటూ "ఇంతకూ మీ ఫోన్లు, టార్చ్‌లైట్ లు, పెన్స్ అన్నీ కింద పెట్టేయండి" యథాలాపంగా అన్నట్టే ఉన్నా... అచ్చారావు గొంతులో ఒక ఆర్డర్ ఉంది.

'అమ్మో! ఈయన పక్కా ప్రొఫెషనల్' అనుకుంటూ, వాళ్ళిద్దరూ ఆయన చెప్పినట్టే జేబుల్లో ఉన్న వాటిని అక్కడ టీపాయ్ మీద పెట్టారు.

ఇంతలో ఆయన ఫోన్ మోగింది. "ఒక్క నిమిషం" అంటూ ఆయన లోపలికెళ్లి, మరో పావుగంటకి కప్పుల్లో టీ పోసి

తీసుకొచ్చారు. ఈ అతిథి మర్యాదలకేం తక్కువ లేదు అని మనసులో వీళ్ళు అనుకునేలోపు ఆయనే, "డాక్టర్ సతీష్ మీరు పల్మనాలజిస్ట్ కదా? కరోనా పీక్ స్టేజ్ లో నేను మిమ్మల్ని డ్యూటీలో కలుసుకున్నాను. నా ఫ్రెండ్ ఒకాయన అడ్మిషన్, ట్రీట్మెంట్ విషయంలో మీరు బాగా రెస్పాండయారు." గంభీరంగా చెప్పారు.

నిజానికి అచ్చారావుని ఎప్పుడు చూసిందీ సతీష్ కేం గుర్తుకు రాలేదు. ఐనా మాస్కులు, పీ.పీ.ఈ. కిట్లలో ఎవరూ అజ తెలీదు లెమ్మని సమర్థించుకున్నాడు.

ఆయన తాపీగా మొదలెట్టారు. "నేను, సారంగగారు ముప్పై ఏళ్లుగా కలిసున్నాం. రెండు మూడు పోస్టింగ్ లలో యూ.డి.సి. గా నేను, మెడికల్ ఆఫీసర్ గా ఆయనా పనిచేశాం. మా ఇద్దరి మధ్యా మీరనుకున్నట్టే సయోధ్య ఉండేది. మేము మామూలు యంత్రాంగానికి పార్లల్ గా మరో యంత్రాంగం నడిపిన మాట నిజమే. ఆ తర్వాత ప్రమోషన్ మీద డిస్ట్రిక్ట్ లెవెల్ లో కూడా ఇద్దరం పని చేశాం. చాలా చేశాం, పకడ్బందీగా చేశాం. ఏం చేసినా సమానంగా బాగుపడ్డాం!"

"మరిప్పుడు ఎందుకిలా?" సతీష్ అడిగాడు.

"గత ఆరేళ్లలో ఎన్నో సివిల్ కాంట్రాక్టులు, డ్రగ్స్ కాంట్రాక్ట్స్ అన్నింటిలో బాగుపడి, కలిసి టూర్లు కూడా వెళ్ళాం. ఎవరికీ అనుమానం రాకుండా." ఆయన ధోరణిలో ఆయన చెప్పుకు పోతూనే, కాస్త బ్రేక్ ఇచ్చి, ఖాళీ టీ కప్పు పక్కన పెట్టి, ఏదో గుర్తు తెచ్చుకున్నట్టు కుర్చీ లోంచి లేచి, లోపలికెళ్లి వక్కపొడి డబ్బా తెచ్చారు.

"మాకు అలవాటు లేదు".

"నాకు ఆయనే అలవాటు చేశాడులెండి" నవ్వాడు.

"సో... చెప్పాలంటే గిఫ్ట్ లు, గోల్డ్ కాయిన్ల నుంచి, సివిల్ వర్క్ మొదలయ్యాక ఫ్లాట్లు, ఫ్లాట్ల దాకా వెళ్ళాం! అదంతా ఓ కథలా ఉంటుంది నాకిప్పుడు. అసలు విషయానికి వస్తే... కోవిడ్ టైంలో నేను సిక్ అయ్యాను. నా భార్య సెకండ్ వేవ్ లో చనిపోయింది. లక్షలు పోసినా ఆవిడ ప్రాణాన్ని మేం దక్కించుకోలేకపోయాం." కాసేపు ఆగారు.

రావు, సతీష్ ఇద్దరూ ఒకేసారి "సో సారీ అండీ!" అన్నారు.

ఆయన కళ్ళలో తడి పొర. "నాకే ఎందుకలా జరగాలి? ఆ సమయంలో మీ సారంగ గారు నన్ను పలకరించడానికి కూడా రాలేదు. ఎందుకో నాకర్థం కాలేదు. బహుశా ఆయన బిజీ ఐపోయినట్టున్నాడు. కేడర్ డిఫరెన్స్ అనుకున్నారా? ఏమో, ఏం తెలీదు. నేను చాలా బాధపడ్డాను." కాసేపు మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత, "చేసిన పాపం ఇద్దరికీ సమానంగా తగలాలి కదా" ఆయన ఆ మాటలకు, కూర్చున్న వాళ్ళిద్దరూ నిర్ఘాంతపోయారు.

"డీఎంహెచ్వోగా ఆయన ఈ జిల్లాకు చాలానే సేవ చేశాడు. అయినా సరే, అతను పచ్చగా ఉన్నాడు. నేను ఒంటరివాడినయ్యాను. ఆ బాధే నాలో కక్ష పెంచింది!" అచ్చారావు ముఖం వివర్ణమైంది. "పథకం ప్రకారం ఆయన సంతకం పెట్టిన రెండు ఫైల్స్ లోకల్ ఎమ్మెల్యేకి అందించాను" ఆయన వాయిస్ లో కొత్తగా ఒక కరకుదనం.

ఉన్నది ముగ్గురే మనుషులు. కానీ అక్కడి వాతావరణం పగలు గడిచిపోయాక తప్పనిసరిగా వచ్చే చీకటిలా, చిక్కగా, అరవై ఏళ్ళు నిండాక వచ్చే రిటైర్మెంట్ లా నిక్కచ్చిగా మారింది.

అచ్చారావు, "ఆపిల్" అంటూ కుర్చీలో వెనక్కి వాలారు. చైన్ బాగా పొడుగ్గా ఉన్నట్టుంది, కుక్క లోపలి వైపుకు వచ్చి, ఆయనకు

దగ్గరగా కూర్చుంది. దాని వెన్ను నిమురుతూ "మనిషి ఒక్కడే విచిత్రమైన జంతువు" అని నవ్వారు.

సతీష్, రావు మరో పదినిమిషాలు కూర్చున్నారు. సతీష్ లేచి నిలబడి, "మీ ఆతిథ్యానికి థ్యాంక్స్. ఒక వీక్ పాయింట్ లో మీరు చేసిన పనికి ఆయన జీవితాంతం మచ్చను మోయాలి" అన్నాడు.

"కావచ్చు. బాధే శిక్షైతే... ఆయన కూడా శిక్షార్హుడే" అచ్చారావు మాటలు లోతుగా దింపిన బుల్లెట్ లా తగిలాయి. ఆయన చూపుడు వేలు టీపాయ్ పైనున్న వస్తువుల వైపు చూపించింది.

★★★

మా స్నేహితులంతా కలిసి కూర్చున్నపుడు రావు "అవినీతిలో నీతి ఉండదు. రెండు చుక్కల్ని ఒక లైన్ కలుపుతుందేమో కానీ, ఇద్దరు మనుషులు ఎప్పటికీ కలిసే ఉండాలని నియమం ఏదీ లేదు. నా అనుభవంలో ఏ పరిచయం లేనివాళ్లలో పరస్పర గౌరవం, అభిమానం చూశాను. బాగా తెలుసున్నవాళ్ళ మధ్య మటుకు తెలియని ఒక పలుచటి పొర ఉంటుంది. ఎప్పుడో ఒకసారి అది గాయపడిందనుకోండి, దాని స్థానంలో ఒక పెద్ద గోడ మొలుస్తుంది!" అన్నాడు.

సారంగ గారి మీద ఎంక్వయిరీ వేశారు. నడుస్తోంది. ఆయన భార్య, పిల్లలు ఆయన పక్కన నిలబడలేక పోయారు. అది వాళ్ళ నిర్ణయం.

ఇప్పుడు తోడుదొంగలిద్దరూ ఒంటరి వారే!

# రచయిత పరిచయం

## స్త్రీకీ స్త్రీయే

**డా. మూర్తి జొన్నలగెడ్డ**

*వైద్యవృత్తిలో మీ బ్రాంచ్ ఏమిటి అని అడిగినప్పుడు.. "సమ్మోహన వైద్య నిపుణుడు" అనే సమాధానం వస్తే, ఎవరైనా సరే ఆలోచనలో పడిపోతారు. నూటికి తొంభై మంది ఆ మాటకి అర్థం తెలియక "అంటే?" అని అడగడం కద్దు. అలా మాటల్లో సమ్మోహన పరిచే ఈ అనెస్థిటిస్టు డాక్టరుగారు ఇండియాలో కాదు, ఇంగ్లాండ్ లో గత రెండు దశాబ్దాల పైగా వైద్య వృత్తిలో ఉన్న తెలుగు రచయిత డా. మూర్తి జొన్నలగెడ్డ. డా. మూర్తి గారి స్వస్థలం అమలాపురం. అక్కడే జననం, బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం సాగి, తర్వాత విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో యం. బి బి. ఎస్. ఎనస్థీషియా చదివి, పాండిచ్చేరి లో ఓ మూడు సంవత్సరాలు పనిచేసి, తర్వాత ఇంగ్లాండ్ వెళ్ళి, అక్కడ గత 23 సం. గా ఉద్యోగం చేసుకుంటూ, రెండు వైద్య పరికరాల పేటెంట్లను సాధించారు. ప్రవృత్తిలో నాటికలు వ్రాయడం, దర్శకత్వం వహించడం, తెలుగు సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం, వ్యాఖ్యాతగా వ్యవహరించడం, కెమెరా పట్టుకుని ఫోటోలు తియ్యడం, కథల పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించడం, ఆ దేశ, విదేశాలలో సాహితీ ప్రసంగాలతో పాటు.. కవితలు, వ్యాసాలు వ్రాయడం. ఒకటేమిటి.. తెలుగు భాషా వికాసానికి తన వంతు సేవలు అన్నీ ప్రక్రియలు చేపట్టి, విజయవంతంగా ఆ తవ్వాలో నడుస్తూ, నడిపిస్తూ.. ఈమధ్యనే కథారచనలో కూడా తన కలం ఝుళిపిస్తున్నారు. ఇవేం చాలవన్నట్టు డా. మూర్తి గారు ఇప్పుడు ఎం.బి.ఏ. కూడా చదువుతున్నారు. క్షణం తీరిక లేకపోయినా, తీరిక చేసుకుని, కోరిక తీర్చుకుని కథ వ్రాసి పంపారు. డా. మూర్తి గారు భవిష్యత్తులో పుంఖానుపుంఖాలుగా మంచి వాసియున్న కథలతో తెలుగు కథాప్రియులను అలరిస్తారని ఆశిస్తున్నాం.*

# స్త్రీకి స్త్రీయే ...

డా. మూర్తి జొన్నలగెడ్డ

+447866625977



***నా మనసంతా రకరకాల ఆలోచనలు. బ్రెయిను పెరగడానికి మందు తినిపించారా! అలా చెయ్యకపోయినా నార్మల్‌గా పుట్టే వాడేమో! ఇప్పుడీమెని ఏం చేస్తారు? మొగపిల్లాడే పుట్టాడు కాబట్టి ఏవీఁ అనరా? ఈ బిడ్డ మరణిస్తాడు కాబట్టి ఇంకో అవకాశం ఇస్తారా? ఈవిడ జీవితాన్ని నిర్ణయించడానికి వాళ్ళెవరు? ఆ మొగుడు సన్నాసి ఏం చేస్తున్నాడు? అని పిచ్చి కోపం కూడా వచ్చింది. మొగ పిల్లాడు పుడితే, అప్పుడు ఆఫీసుకి సెలవు పెట్టి చూడ్డానికి వస్తాట్ట!***

"నమస్కారం డాక్టరు గారూ!" అని రొప్పుకుంటూ సైకిలు దిగాడు పక్క వీధిలో లేడీడాక్టరు దమయంతి గారి అసిస్టెంటు.

"ఏవిఁటి రమేష్! మంచినీళ్ళేవైఁనా ఇమ్మంటావేఁమిటి?" అన్నాను.

"అబ్బే పర్లేదండి. అర్జంటు సిజేరియన్ ఉంది మిమ్మల్ని రమ్మంటున్నారు!" అని చెప్పి వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

మా ఇంట్లో ఫోను అవుటాఫ్ ఆర్డరు. అందువల్ల అర్జంటు కాల్సు ఇలా వస్తూ ఉంటాయి. గబగబా బట్టలు మార్చుకుని వెళ్ళి, ఒక గంటలో కేసు ముగించుకుని వచ్చాను. అప్పటికి నా మిత్రుడు గిరి, మేస్త్రీ చేత సిమెంటు కలిపిస్తున్నాడు. "థాంక్సు రా గిరీ!" అన్నాను.

"పర్లేదురా నే వెళ్ళొస్తాను మరి" అన్నాడు.

"కాఫీ తాగి వెళ్ళరా" అన్నాను.

"అబ్బే! నేను మీ డాక్టర్లలా కాదురా, పెందరాళే భోంచేస్తాను!" అని నవ్వి వెళ్ళిపోయాడు.

నేను నైరుతి వేపు ప్రహరీ గోడ పడిపోతే మళ్ళీ కట్టిస్తున్నాను. లాగూ, బనీను వేసుకుని, నేనూ మేస్త్రీలతో పాటు, పని చేస్తున్నాను. ఇలాగ అర్జంటు కేసులు ఏవైఁనా వస్తే గబగబా వెళ్లొస్తున్నాను. అలాంటప్పుడు నా ఫ్రెండు గిరి అజమాయిషీ చేస్తుంటాడు. ఇంతట్లో మా వంటాయన నాకూ, మేస్త్రీలకీ, కూలీలకీ టీ కలిపి తీసుకొచ్చాడు. అందరం ఇసుక గుట్ట మీద కూర్చుని నెమ్మదిగా టీ తాగుతున్నాం.

"ఆయ్! అయితే ఇపుడు మీరు కేసు చేసొచ్చారన్నమాటండి!" అని ఇటుకలు మోసే సుబ్బయ్య కుతూహలంగా అన్నాడు.

నేను చూడ్డానికి కాలేజీ కుర్రాడిలా ఉండడం, వాళ్లతో కలిసి పని చెయ్యడం, అపుడపుడు అర్జంటుగా హాస్పిటలుకి వెళ్ళి కేసులు చేసి రావడం వాళ్ళకేవీఁ అర్థం కాకుండా ఉంది.

"లేకపోతే మోర్నింగు సో కి ఎల్లి, ఇంట్రవెల్లో వొచ్చేసారనుకున్నావేఁటి! ఎదవ డౌటూ నువ్వూను!" అన్నాడు మేస్త్రీ వెంకట్రావు. అందరూ భళ్ళున నవ్వారు.

"సర్లే మాకు తెలీక అడిగాం లేవోయ్... నీకు మరీ యెటకారం!" అన్నాడు సుబ్బయ్య.

“అవున్రా, అబ్బాయిగారు మత్తు డాట్టరుగారు కదా, ఆపరేసనుకి మత్తిచ్చి, అంతా పూర్తయ్యా వరకూ జాగర్తగా సూసుకుంటారు. ఏ తేడా వొచ్చినా ఈరే సూసుకోవాలి మరి. ఏదో సూది మందేసి వొచ్చేత్తారనుకున్నావేటి!” అన్నాడు మేస్త్రీ.

“బాగానే సమాచారం సంపాదించావు మేస్త్రీ!” అన్నాను నేను, నవ్వుతూ.

“ఆయ్ అవునండి, కిందటేడు ఉపద్రవైన కడుపు నెప్పి వొచ్చీసిందండి. అదేదో ఇరవై నాలుగు గంటల్లోపు ఆపరేసను సెయ్యాలంట కదండీ... అదన్నమాటండి!”

“ఎపెండిక్సా?” అన్నాను

“ఆయ్ అవునండి, అదేనంటండి. సెప్టిక్కయిపోయిందన్నారండి. సేలా ప్రమాదం సేసిందండి. అప్పుడు ఆ మత్తు డాట్టరుగారే జాగర్తగా సూసుకున్నారండి. లేకపోతే శాల్తీ గల్లంతయి పోయీదని వార్డు బోయి అన్నాడండి!”

“గొడవొదిలి పోయీది. హాయిగా ఉండీ వోళ్ళం!” అన్నాడు సుబ్బయ్య.

“సర్లేవో! అపుడు నీలాటీ ఎదవకి పనిచ్చీ వోడు లేక అడుక్కు తినీ వోడివి!” అని కసురుకుని, నా వేపు తిరిగి “అయితే అబ్బాయిగారూ, కానుపు ఆపరేసను కదండీ ... మొగ పిల్లాడేనా?” అని ఉత్సాహంగా అడిగాడు.



“ఆ మొగపిల్లాడేలే” అని విసుగ్గా అని, “రండి పన్లోకి దిగుదాం!” అన్నాను. నేనెప్పుడూ అలా ఉండకపోవడం చూసిన వెంకట్రావు, ఏదో జరిగిందని గ్రహించినట్టున్నాడు.

“ఆయ్, అవుననుకోండి మీరు కేసులు గురించి బైట ఎవరికీ సెప్పకూడదు కదండీ!” అని, “వొరేయ్ ఎంకటేసూ! నా తాపీ ఎక్కడ్రా?” అని కుర్రాణ్ణి కేకేశాడు.

నేను ఇటుక అందిస్తున్నాను, మేస్త్రీ సిమెంటు వేసి పేరుస్తున్నాడు. యాంత్రికంగా అందిస్తున్నాను కానీ, నా మనసు మళ్ళీ ఇందాకటి కేసు మీదకే మళ్ళింది.

స్పైనల్ ఎనస్థీషియా ఇచ్చి, పల్సు మీద చెయ్యేసి కూర్చున్నాను. డాక్టర్ దమయంతి చకచకా తన పని చేసుకుపోతోంది. నేను తదేకంగా అటే చూస్తున్నాను.

“డాక్టర్! డాక్టర్!”

ఒక్కసారి ఉలిక్కిపడి ఇటు తిరిగాను. పేషెంటు పిలుస్తోంది.

“ఏంటమ్మా?” అన్నాను.

"నన్ను చంపేస్తారు డాక్టర్!" అందామె భయంగా!

"భలేదానివేనమ్మా! నీకేవీఁ ప్రమాదం లేదు, ఇలాంటి ఆపరేషన్లు రోజూ చేస్తూనే ఉంటాము!" అన్నాను అనునయంగా.

"కాదు డాక్టర్! వాళ్ళు ... మా అత్తగారూ వాళ్ళూను. మీరు మంచివాళ్ళలా కనబడుతున్నారు. నేను చచ్చిపోతే నా పిల్లల్నిద్దర్నీ మీరు పెంచుకుంటానని మాటివ్వండి బాబూ!" అంది.

ఒక్కసారి అదిరిపడ్డాను! గుండె టకటకా కొట్టుకోసాగింది. అటూ ఇటూ చూశాను. పేషెంటుకి ఆపరేషను కనిపించకుండా చిన్న తెర అడ్డం ఉంది. అవతల దమయంతిగారూ, అసిస్టెంట్ రమేష్ మహా దీక్షగా ఆపరేషన్ చేసుకుంటూ పోతున్నారు. ఇంకొక నర్సు, డెలివరీ అయిన బేబీని రిసీవ్ చేసుకోడానికి వెయిట్ చేస్తోంది.

అపుడు మెల్లిగా, "ఏవిఁటమ్మా అసలు సంగతి? నీకేం పరవాలేదు చెప్పు!" అన్నాను.

"నాకు ఇద్దరు ముత్యాల్లాంటి ఆడపిల్లలు డాక్టర్. కానుపుకి వొచ్చేటప్పుడు, ఈ సారైనా మొగపిల్లాణ్ణి కనకపోతే ఇంట్లోకి అడుగు పెట్టనివ్వనని మా అత్తగారు వార్నింగు ఇచ్చారండి! అలాక్కాకుండా ఇంట్లోకి అడుగు పెట్టావంటే కిరసనాయిలు పోసి తగలెట్టేస్తామని మా ఆడపడుచు బెదిరించిందండీ!" అని చెప్పి సన్నగా ఏడవసాగిందామె.

"ఊరుకోమ్మా. నీకేం కాదు. మరి మీ ఆయన ఏం కలగజేసుకోడా?" అని అడిగాను.

"మా అత్తగారూ, ఆడపడుచూ నా మీద చెయ్యి చేసుకుంటుంటే ఆయన బయటికెళ్ళి పోతాడండి. ఎప్పుడో వోసారి అడ్డుకోబోతే... "నువ్వు పెళ్ళం మోజులో పడిపోయావు, అది నీకు ఏదో మందు పెట్టేసింది!" అని ఇంకా ఏవేవో ఆయన్ని చాలా అసయ్యంగా మాటాడారండి. అప్పట్నించీ బాధపడతాడు గానీ వాళ్ళని ఏవీఁ అన్లేడండి. అన్నట్టు, మొగపిల్లాడు పుడితే చాలా తెలివిగా ఉండాలని, బ్రెయిను పెరగడానికి, గర్భిణీ వొచ్చినప్పట్నుంచీ నాకు ఆయుర్వేదం మందు ఇప్పించారండి. మొగపిల్లాడే పుడతాడాండీ? లేకపోతే నన్ను చంపేస్తారండి. నా బంగారు తల్లుల్ని మీరు పెంచుకుంటానని మాటివ్వండి బాబూ!" అని సన్నగా ఏడవసాగింది.

"వొరేయ్!" అన్న కేక తోటి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వొచ్చాను.

కాఫీ పంతులుగారు, వాళ్ళ మావఁగారు పెళ్ళికి పెట్టిన ర్యాలీ సైకిలు మీద బజారెళుతూ, ఆపకుండానే స్లో చేసి కేకేశారు.

"అయ్! ఏవిఁటండీ, బావున్నారా." అని పలకరించాను.

"ఆ! నేను బానే ఉన్నాను!" అని, సైకిలాపి ఓ కాలు కింద పెట్టి, చూపుడు వేలు ఆడిస్తూ "నైరుతి మూల షెడ్డుని మెయిను బిల్డింగుకి కలపకు!" అన్నారు.

"భలేవారే. ఇది నా ప్లాను ఏవీఁ కాదండి. తాత గారు కట్టించిన గోడా, షెడ్డూ పడిపోతే ఎలా ఉన్నవి అలా తిరిగి కట్టిస్తున్నాను అంతే! ఇప్పటికిప్పుడు కలిసున్న ఆ రెండింటికీ ఓ ఆరంగుళాల ఖాళీ ఇచ్చాననుకోండి, కుక్కలూ, మేకలూ అన్నీ దూరిపోయి పెరడు పాడుచేస్తాయి కదండీ!" అన్నాను.

"ఏమో ... అవేవీఁ నాకు తెలీదు. మళ్ళీ నేను చెప్పలేదు అని అనక! నైరుతి మూల షెడ్డుని మెయిను బిల్డింగుకి కలపకు!" అని సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయారు.

ఆయనకి కాఫీపొడి అమ్మే ఏజన్సీ ఏదో ఉండీదనుకుంటాను. అసలు పేరు నాకు ఎప్పుడూ తెలీదు. మూడు తరాల నుంచీ పరిచయం, పైగా కావల్సిన వాళ్ళు. మొన్నటికి మొన్న ఇలాగే సైకిలు మీద వెడుతూ, "ఒరేయ్! నైరుతి మూల గోడ కట్టిస్తున్నావు. మొత్తం సామగ్రీ అంతా సమకూర్చుకుని, మొదలు పెట్టి ఏకధాటీగా కట్టించెయ్. నైరుతి మూల ఏ పని తలపెట్టినా సవాలక్ష అడ్డంకులొస్తాయి!" అని మళ్ళీ బజారెళ్ళి పోయారు. 'ఈయన రోజూ ఎందుకు బజారు వెళతాడో మరి, వారానికోసారి సరుకులు తెచ్చుకోవచ్చుగా. ఈలోపు గోడ పని అయిపోతుంది, నాకు రోజు వారీ బెదిరింపులు తగ్గుతాయి' అనుకున్నాను.

నా మూడ్ ఇంకొంచెం పాడయ్యిందని గ్రహించిన మేస్త్రీ, "మీరు కాసేపు కూర్చోండబ్బాయి గారూ, పొద్దుట్నుంచీ పని సేస్తానే ఉన్నారు!" అన్నాడు. సర్లే అని, ఆ పక్కనే ఉన్న చిన్న ఇసుక గుట్ట మీద కూలబడ్డాను. ఏవీః తోచక ఇసుకలో వేళ్ళు పెట్టి కెలుకుతూ చూస్తున్నాను. క్రమంగా మేస్త్రీ, ఇటుకలూ మసకబారి, ఆపరేషను థియేటరు కళ్ళముందు నిలిచింది.

అలా ఏడుస్తున్నావిడని, "అరెరే... ఏవీః భయపడకు. ఇంకెంత సేపు! కొంచెం సేపట్లో బేబీని బయటకు తీస్తారు. అన్ని సమస్యలూ తీరతాయి. నువ్వలా గాబరా పడితే డాక్టరు గారికి డిస్టర్బెన్సు కదా, చాలా శ్రద్ధగా చెయ్యాలి ఆపరేషను" అన్నాను. దాంతోటి ఆవిడ కాస్త కుదుటబడి, బెంగగా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది.

నేను తెర ఇవతలకి తల పెట్టి చూశాను. అప్పుడే డాక్టర్ దమయంతి బిడ్డను బయటకి తీస్తోంది. బిడ్డ అడ్డం తిరిగి ఉండడం వల్ల సిజేరియన్ చెయ్యాల్సొచ్చింది. హమ్మయ్య, మొగ పిల్లాడే!

కానీ ఎక్కడా పెద్ద చలనం లేదు. ఏవిఃటో తేడాగా అనిపించి చూస్తే ఏముంది! "ఎనెన్ సెఫలీ బేబీ" అంటే, మెదడు అస్సలు డెవలప్ అవ్వలేదు. మొహం మామూలుగానే ఉంది గానీ, పెద్ద పెద్ద కళ్ళూ, పుర్రె మాత్రం అతి చిన్నదిగా భయం గొలిపేలా ఉంది! నేను సంభ్రమంగా డాక్టర్ దమయంతి వైపు చూశాను. ఆవిడ నా వైపు చూసి మామూలుగా "యస్, ఐ నో. మొన్న స్కాన్ చేయించాము" అంది. నేను అయోమయంగా "మరి వాళ్ళకి తెలుసా?" అన్నాను. "ఐ డిడ్ నాట్ టెల్ దెమ్. వాళ్లకి ఏవో ఎక్స్పెక్టేషన్సు ఉన్నాయి. నువ్వేం మాటాడకు, నేను డీల్ చేస్తాను!" అంది.

నర్సు, బేబీని తీసుకుని బయటకు వెళ్ళిపోయింది. నా మనస్సు కకావికలం అయిపోయింది. అటువంటి వైకల్యంతో పుట్టిన పిల్లలు ఒక వేళ ప్రాణంతో పుడితే, మహా అయితే ఒక గంట బతుకుతారేమో... అంతే!

"డాక్టర్! మొగ పిల్లాడేనా?" ఏడుపు వినబడదేవిఃటి? అని ఆందోళనగా అడిగి "లేకపోతే నన్ను చంపేస్తారు సార్!" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది.

అతి కష్టం మీద, పూడుకుపోయిన నా గొంతు పెకిలించి, "ఏమోనమ్మా, వెంఠనే పిల్లల డాక్టరు గారు చూడాలి కదా ... బైటకి తీసికెళ్ళిపోయారు. ఇప్పుడు డాక్టర్ దమయంతిగార్ని డిస్టర్బు చెయ్యకూడదు!" అన్నాను.

ఆమెకి ఏదో సందేహం వచ్చినట్టుంది, వెంటనే హిస్టీరికల్‌గా ఏడవడం మొదలు పెట్టింది. ఎంత అనునయించినా కంట్రోల్ అవ్వట్లేదు. దమయంతి గారు నావేపు తిరిగి, "డాక్టర్! పేషెంటుకి ఏవైనా సెడేషన్ ఇవ్వండి, నేను ఆపరేషన్ కంటిన్యూ చెయ్యలేకుండా ఉన్నాను" అంది. వెంఠనే 'కాంపోజ్' ఇంజక్షను చేశాను. ఆమె నిద్రలోకి జారుకుంది. అంత గాఢనిద్రలోనూ మధ్య మధ్య వెక్కుతోంది.

నా మనసంతా రకరకాల ఆలోచనలు. బ్రెయిను పెరగడానికి మందు తినిపించారా! అలా చెయ్యకపోయినా నార్మల్‌గా పుట్టే వాడేమో! ఇప్పుడీమెని ఏం చేస్తారు? మొగపిల్లాడే పుట్టాడు కాబట్టి ఏవీః అనరా? ఈ బిడ్డ మరణిస్తాడు కాబట్టి ఇంకో

అవకాశం ఇస్తారా? ఈవిడ జీవితాన్ని నిర్ణయించడానికి వాళ్ళెవరు? ఆ మొగుడు సన్నాసి ఏం చేస్తున్నాడు? అని పిచ్చి కోపం కూడా వచ్చింది. మొగ పిల్లాడు పుడితే, అప్పుడు ఆఫీసుకి సెలవు పెట్టి చూడ్డానికి వస్తాట్ట!

ఆపరేషను పూర్తి అయ్యాక ఆమెను జాగ్రత్తగా నర్సుకి అప్పజెప్పి, థియేటర్ రెస్టురూములో అలసటగా కూలబడ్డాను. డాక్టర్ దమయంతి కాఫీ కప్పుతో లోపలకి అడుగు పెట్టింది. నన్ను చూసి "అదేవిఁటి ... అప్‌సెట్ అయ్యావా! ఇలాంటివి మామూలే, ఇంకా చాలా చూడాలి నువ్వు. బ్రెయిను పెరగడానికి ఆయుర్వేదం మందు ఇప్పించార్ట హ! హ! హా!" అని నవ్వింది.

నేను ఆశ్చర్యపోయాను! ఇదేవిఁటి! అత్తగారూ, ఆడపడుచూ, ఆఖరికి పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న ఈ దమయంతికీ, ఎవ్వరికీ... ఆ నిస్సహాయ స్త్రీ మీద జాలి లేదా! అవును... స్త్రీకి స్త్రీయే శతృవు అన్నారు కదా. మరి ఆమె మొగుడు!

అంతేలే, స్త్రీకి స్త్రీయే శత్రువైతే... పురుషుడు ఆ శత్రువుకి మిత్రుడు!

"దేవుడా! నువ్వైనా ఆ స్త్రీ కి ఒంటరి పోరాటం చెయ్యడానికి శక్తి ఇవ్వు" అనుకుని, ఆమెకు నా మొహం చూపించలేక, కాంపోజ్ మత్తులోంచి బయటపడే లోపే, నేను బయటపడ్డాను.

"డాక్టర్! డాక్టర్! ఇదిగో మీ ఫీజు!" అని రమేష్ పిలుస్తున్నా, వినబడ్డట్టు నడుస్తూనే ఉన్నాను.

"అబ్బాయిగారూ ఇసుక అయిపోతోందండీ" అన్న మాటలతో మళ్ళీ మేస్త్రీ, ఇటుకలూ ఫోకస్‌లోకి వచ్చారు.

ఒక్కసారి తల విదిలించి, " అదేవిఁటీ, కావల్సినంత ఇసుక మొత్తం వొకేసారి తెప్పించమన్నాను కదా!" అన్నాను.

"ఆయ్, అవునండి. కానీ రోడ్డెమ్మట పోయీ కుర్రోళ్ళు సిందర వందర సేసేత్తారని సగవేఁ ఏయించానండి. పొద్దుటే పన్లోకి వత్తా, ఇంకో లారీడు ఇసక పురవాఁయించానండి. కానండీ ... ఇసక లారీ వోళ్ళు, పన్ను పెరిగిందని ఈ రోజు స్ట్రయికు సేత్తన్నారంటండి. రేపటి వరకూ ఎయ్యరంటండి" అన్నాడు మేస్త్రి.

"ముందే చెప్పకపోయావా మేస్త్రి గారూ, ఏ ఎడ్ల బండో పురమాయించీ వాళ్ళం కదా!" అన్నాను.

"ఆయ్ _ _ _ సెబుదావఁనుకునీ లోపు తవఁరు కేసు గురించి అడావుడిగా ఎల్లిపోయారండి!" అని నసిగాడు.

ఇదెక్కడి వ్యవహారంరా భగవంతుడా! ఈ నైరుతి గోడని 'గ్రేట్ వాల్ ఆఫ్ చైనా' లాగ అలా కట్టించుకుంటూ పోవాలేమో అనుకుని తల పట్టుకున్నాను. పైగా, పని ఆగిపోతే బజారు నుంచి తిరిగొస్తూ కాఫీ పంతులుగారు ఏవంటాడోనని ఇంకో బెంగ!

# రచయిత పరిచయం

## ఒక్క మాత్ర

### డా. రమణ యశస్వి

డా. రమణ యశస్వి గారు పుట్టి పెరిగింది ఒక మధ్య తరగతి గ్రామీణ వాతావరణంలో. గుంటూరు జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామంలో జన్మించి, ఆ ఊర్లోనే ఇంటర్ వరకు చదివి, ఆ తర్వాత ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో మెడిసిన్ చదివారు . ఆ తర్వాత కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్స్ విభాగంలో ఎమ్ ఎస్ చేసారు.. ఆ తర్వాత చెన్నైలో ఆరు నెలలు రోజుకో ఉద్యోగం చేసి, మాతృరాష్ట్రం ఎందుకు దాటాలి అని తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరారు. అక్కడ మూడేళ్లు పనిచేసి, గుంటూరు జిల్లాలో నిజాంపట్నం పీ హెచ్ సి లో పనిచేసి, ఆ తర్వాత గుంటూరు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి ఇప్పుడు ప్రొఫెసర్ అయి అక్కడే పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుండి సామాజిక సేవా దృక్పథం, సామాజిక స్పృహ, పరిశీలనాశక్తి, , పుస్తక పఠనాసక్తి ఉండటం వలన ప్రతి దృశ్యానికి, సమస్యకి కొత్త కోణాలు వెతికి కవితలుగానో కథలుగానో మార్చుకోవడం అలవాటయ్యింది. తండ్రి సంకా రామారావుగారు చిన్న చిన్న కవితలు రాసేవారు. అది కూడా ఒక జన్యు సంబంధ ప్రేరణ అయ్యి ఉండొచ్చు. శ్రీశ్రీగారి వచనకవిత్వం , చాసోగారి కథలు చదవడం, యండమూరి, మల్లాది, ముళ్ళపూడి వెంకటరమణ, సులోచనారాణి.. వంటి వారి రచనలు ప్రేరేపించిన విషయాలు. కొన్నాళ్ళు కార్టూన్స్ కూడా వేసిన డా. రమణ గారు 'ఓ! మెడికో' అనే మకుటంతో కూనలమ్మ పదాలులాంటి నూరు పద్యాలు వ్రాసి, వాటినే తర్వాత ''జై! సిరంజీవ'' పేరుతో శతకంగా వ్రాసారు. వీరి మొట్టమొదటి కథ 'మదరమ్మ' ఆంధ్రజ్యోతిలో 7/10/88 న ప్రచురితమైంది. అనతికాలంలో చాలా కథలు వ్రాసారు. వచనకవిత్వం మీద మక్కువతో సామాజిక సమస్యల మీద పెక్కు కవితలు కూడా వ్రాసిన డా. రమణగారు, వారి కథల సంపుటలు, కవితా సంకలనాలతో పాటు వైద్య గ్రంథాలను (ఆర్థోపెడిక్స్) కూడా చాలానే విడుదల చేశారు.

ఒక ఆర్థో సర్జెన్ గా దివ్యాంగుల కోసం "వాక్ ఫౌండేషన్" (WALK Foundation) అనే స్వచ్ఛంద సంస్థ స్థాపించి ఉచితంగా కృత్రిమ కాళ్ళు, చేతులు, వీల్ చైర్లు, tricycles గత 18 ఏళ్లుగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు ఎనిమిది వేలు ఆర్టిఫీషియల్ లింబ్స్ ఇచ్చారు. వారి తండ్రి గారి మరణానంతరం గణపవరంలోని వారి స్వగృహాన్ని వృద్ధాశ్రమంగా మార్చి 25 మంది మహిళలకు ఆసరాగా నిలిచారు.

# ఒక్క మాత్ర

డా. రమణ యశస్వి



***"మావాడు నా కోడల్నే ఎక్కువ ప్రేమిస్తాడని నాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. ఆస్పత్రిలో మంచం మీద ఉన్నప్పుడు నేను చనిపోవడం ఖాయం అనుకొని, ఒక్కసారన్నా 'మీ ఆవిడ మీదకన్నా నా మీదే ప్రేమ ఎక్కువని రుజువు చెయ్యరా నేను చనిపోయేలోపు' అని వాడిని కొంచెం తమాషాగా అడిగాను!"***
***విస్మయంగా అక్కడున్న అందరూ ఆమె వైపు చూసారు.***

న్యాయస్థానం గది కిటకిటలాడుతోంది. ఒక విచిత్రమైన కేసు న్యాయమూర్తి తుదితీర్పు కోసం బల్లమీదకి వచ్చింది. ఇరువర్గాల వారూ, పత్రికలవారూ వచ్చి ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

గంభీరంగా, ఎత్తుగా, నల్ల కోటులో ఉన్న న్యాయమూర్తి ఆ గదిలోకి ప్రవేశించగానే అందరూ ఒక్కసారి లేచి నిలుచున్నారు. అభివాదాలు ముగిసినై. వారందరినీ కలియచూసి, న్యాయమూర్తి తమ ఆసనంలో ఆసీనులవడంతో ఆ ప్రదేశం అంతా నిశ్శబ్దంగా మారింది.

"శ్రీలక్షమ్మ, శ్రీ లక్ష్మమ్మ, శ్రీ లక్ష్మమ్మ" మూడుసార్లు పిలిచాడు బంట్రోతు

ఆమె బోనులోకి వచ్చి నిలుచుని జడ్జిగారికి నమస్కారం చేసింది.

ఆమెకు ఎదురు వైపు ఉన్న మరొక వ్యక్తిని తీక్షణంగా చూస్తూ "మీ ఆవిడకు ఉరిశిక్ష వేస్తే, మీ కసీ, కోపం తగ్గుతాయా?" సూటిగా మనసుకు తగిలిన ప్రశ్నాస్త్రం! ఆ అరవై ఏళ్ళ పంచె కట్టిన పెద్దమనిషిని విలవిలలాడేలా చేసి, పద్యరూపంలో జవాబు బైటికొచ్చింది.

"అమ్మ చేతి ముద్ద... అమృతము సృష్టిలో

తల్లి గుండె ఘోష తరచి వినుము

భాషలన్నీ నీకు పరిచయమైనను

కన్నమనసు విలువ కట్టలేవు!"

అది ఆటవెలది పద్యం. సుతిమెత్తగా జడ్జి మనసుని ఒక ఆట ఆడించి ఆలోచింపచేసిన పద్యం అది!

జడ్జిగారుకూడా తెలుగు మీడియంలో చదువుకుని, తెలుగు ఛందస్సు వచ్చిన, తెలుగు భాష వీరాభిమాని! ఒక్క నిమిషంలో ఆ పద్యంలో ఒక మాత్ర ఎక్కువైందని గ్రహించాడు.

"ఏమయ్యా పెద్దమనిషీ! మూడోపాదంలో ఒక మాత్ర ఎక్కువైంది. మొత్తం పద్యసౌందర్యమంతా మంట గలిసింది!" అని విడమర్చి ఆ తప్పుని చెప్పారు.

"కావాలనే ఒక మాత్ర తప్పుతో పద్యం చెప్పాను. ఒక మాత్ర గాడి తప్పితే, పద్య సౌందర్యం ఎలా పాడైందో, మా ఆవిడ ఒక మాత్ర తప్పు వేయడం వలన మా అమ్మ ఆరోగ్యం కూడా అలాగే పాడైంది. అందుకే కోర్టు గడప తొక్కవలసివచ్చింది." అన్నాడు కళ్ళు ఒత్తుకుంటూ శ్రీలక్ష్మమ్మ భర్త పరమేశ్వరశాస్త్రిగారు.

జడ్జ్ గతుక్కుమన్నారు. 'అనవసరంగా తన పాండిత్యాన్ని ప్రదర్శించి, తనే తప్పుగా మాత్ర మింగినట్లయింది' అని భావించారు.


ఆ ఆలోచనా అలలను తన సులోచనాలతో కప్పిపుచ్చుతూ గంభీరంగా "మాష్టారూ, ఈ మాత్రలు వేరు, ఆ మాత్రలు వేరు అని నాకు తెలుసు. మీ ఆవిడ మీ అమ్మకు వేసిన అదనపు మాత్ర వికటించి మూత్రపిండాలు పాడైపోయాయని వైద్యులు ఊహించారు. దీనివలన మీ భార్యామణికి శిక్షపడితే మీకు ఆనందం. అవునా?" అన్నారు.

"మా అమ్మ ఆరోగ్యం నాకు ముఖ్యం. ఇంకెవరూ నాకు ముఖ్యం కాదు."

"అదే మీ తుది నిర్ణయమైతే, మహిళల పట్ల ఒక బాధ్యతగల న్యాయమూర్తిగా నేనూ ఒక ముఖ్య నిర్ణయం తీసుకుందామనుకుంటున్నాను"

"మీ తుది నిర్ణయం ఏదైనా నేను శిరసావహిస్తాను."

"అయితే అందరూ సావకాశంగా వినండి. మాత్రలు కొనుక్కురావడమే మావంతు పని; అవి పేషెంటుకు వేయడం ఇంట్లో ఆడవాళ్ళ బాధ్యత అనుకునే పురుషపుంగవులకు, ఇదొక గొడ్డలిపెట్టులాంటి తీర్పు!" గంభీరంగా అన్నారు జడ్జి



గుండు సూది వేస్తే వినపడేంత నిశ్శబ్దం రాజ్యమేలుతోంది . .

"మీరు చెప్పింది అర్థంకాక, మీ ఆవిడ ఒక్క మాత్ర ఎక్కువ వేయడం వలన మీ అమ్మ గారికి మూత్రపిండం దెబ్బతిన్నదని, మీరు వేసిన ఈ కేసులో మీకునూ అంతే బాధ్యత ఉన్నదని, మీకు కూడా మీ ఆవిడతో పాటు ఆరు నెలలు జైలు శిక్ష విధిద్దామని కోర్టు ఆలోచిస్తోంది. మీరేమంటారు?"

"మా పంతులుగారి తప్పు ఇందులో ఏమీ లేదు. వారి భార్య నిర్లక్ష్యంగా మందులు వేయడం వలన కోర్టు గడప తొక్కాల్సి వచ్చింది. వారు పౌరోహిత్యానికి వెళ్లకపోతే, ఆ ఇల్లు గడవదు. పెద్దావిడ... వాళ్ళమ్మని చూసుకోవడానికి ఎవరూ ఉండరు!" అని వాదించాడు శాస్త్రిగారి తరపు న్యాయవాది.

"పంతులుగారి భార్య ఆయన చెప్పినట్లు మందులు వేశానని, ఆమె నడుము నొప్పి మరీ ఎక్కువగా ఉందంటే ఇంకో మాత్ర

ఎక్కువ వేస్తే త్వరగా తగ్గుతుందని వేశాననీ ఆమె చెబుతున్నది. దీనికి మీ సమాధానం ఏమిటి?" అడిగాడు ఆమె తరపు న్యాయవాది.

బోనులో నుండి వింతగా చూసాడు శాస్త్రిగారు .

"పంతులుగారు ఇంకొకటి ఎక్కువ వేయొద్దని హెచ్చరించి ఉంటే 'ఈ ప్రమాదం తప్పి ఉండేది' అని కోర్టు అభిప్రాయం" అని శాస్త్రిగారి కళ్ళల్లోకి చూశాడా లాయరు.

"మేము అడుగుతుంది భార్యకు శిక్ష వెయ్యమని. మీరు ఇద్దరికీ శిక్ష వేస్తే ఆ పెద్దావిడ గతి ఏమి కాను? కుటుంబ పరువు ఏమి కాను?" ఆవేశంగా అడిగాడు శాస్త్రిగారి లాయరు.

"మీరు ఆ కుటుంబం పరువుని, ఆ స్త్రీ మూర్తిని కోర్టుకి లాగి ఎప్పుడో తీసేసారు, మందులు వేయడంలో కొడుకుకే ఎక్కువ బాధ్యత ఉంటుంది కోడలుకన్నా. ఆ తప్పు ఆయనగారి ఖాతాలో వేసి, ఆయనకే ఆ శిక్ష వేస్తే అత్తా కోడలూ, ఆయనగారు బయటికి వచ్చేవరకు హాయిగా ఉంటారు" ఉక్రోషంగా అన్నాడు శ్రీలక్ష్మమ్మ తరపు లాయరు.

"కుటుంబం ఎలా గడుస్తుందోమరి? నేను లేకపోతే మీరు తిండి పెడతారా వాళ్ళకి?" వెటకార బాణం వదిలారు పంతులుగారు.

"అవన్నీ ముందు ఆలోచించి ఉంటే... పెళ్ళాం మీదే మీరు కోర్టులో ఇంత చిన్న విషయానికి దావా వేసి ఉండరు." బాణాన్ని తిప్పికొట్ట యత్నించాడు ఆ లాయర్.

"పరువు కన్నా మా అమ్మ ఆరోగ్యం, ప్రాణం నాకు ముఖ్యం. నేను తప్పు చేసిన ఆవిడను శిక్షించమంటుంటే, నన్ను శిక్షించమని వాదించడం విడ్డూరంగా ఉంది." సందేహ బాణం వదిలాడు ఈసారి పంతులుగారు.

న్యాయమూర్తిగారు కంఠం సరిచేసుకొని "మీ ఇరువాదనలు విని, నా తుది తీర్పు ఇచ్చేముందు పంతులుగారి అమ్మగారిని ఒకసారి కోర్టు ముందు హాజరు పరచవలసినదిగా కోరుతున్నాను" అన్నారు.

అందరికీ ఉత్కంఠ ఇంకా పెరిగిపోతోంది! పెద్దావిడని ప్రవేశపెట్టారు.

"అమ్మా... మీ కోడలు మిమ్మల్ని ప్రేమగానే చూసుకుంటుందా?" అడిగారు న్యాయమూర్తి.

"కన్నతల్లిలాగా చూసుకుంటుంది. ఆ మాత్ర నాకు నొప్పి ఎక్కువగా ఉందని చూడలేక ఇచ్చింది. ఆ రాత్రి మూత్రం రాకపోవడం, ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడే వారం ఉండటంతో... మావాడికి తిక్కరేగి ఈ కేసు వేసాడు"

"అక్కడి వైద్యులు, ఆ అదనపు మాత్ర వల్లే మూత్రపిండాలు దెబ్బ తిన్నాయని చెప్పారా?"

"అవును, కానీ అది తాత్కాలికమేననీ, మళ్ళీ తిరిగి బాగవుతాననీ ధైర్యం చెప్పి, చికిత్స చేశారు. బయట పడ్డాను."

"మరి ఇప్పుడు మీ కొడుకే మీ కోడలు మీద కేసు వేశారు మీరేమంటారు?"

"నిజానికి నేను చేసిన తప్పు వల్లే అది జరిగింది." కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది

"మావాడు నా కోడల్నే ఎక్కువ ప్రేమిస్తాడని నాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. ఆస్పత్రిలో మంచం మీద ఉన్నప్పుడు నేను చనిపోవడం ఖాయం అనుకొని, ఒక్కసారన్నా 'మీ ఆవిడ మీదకన్నా నా మీదే ప్రేమ ఎక్కువని రుజువు చెయ్యరా నేను

చనిపోయేలోపు' అని వాడిని కొంచెం తమాషాగా అడిగాను."

విస్మయంగా అక్కడున్న అందరూ ఆమె వైపు చూసారు.

వాళ్ళ భావాలు ఏమీ పట్టించుకోకుండా "వాడు 'అది నా చివరి కోరిక, అది తీర్చడం తన కర్తవ్యం' అనుకొని ఇంత గోల చేసాడు" చెప్పింది ఆమె.

"వైద్యులను కూడా విచారించాము. మీ కేసులో... మీ కోడలు మీకు ఇచ్చిన మాత్ర వల్ల కాకపోవచ్చు. మీ మూత్రపిండాల సమస్య, మీ వయసు వల్ల, లేక మీ మధుమేహం వల్ల అయి ఉండవచ్చు అని చెప్పారు డాక్టర్లు" సూటిగా అన్నారు జడ్జిగారు.

"నాకు కూడా అదే అనిపిస్తుంది. ఒక మాత్ర మూత్రపిండాలకి పిండం పెడుతుందా అని..." నిష్టూరంగా అంది పెద్దావిడ పెద్దగా.

"ఆ రోజు ఒక మాత్ర అధికంగా వేయడం వలన వచ్చి ఉండవచ్చు అని జూనియర్ వైద్యుడు చెప్పడం వలన కూడా, ఈ అపార్థం కోర్టుకు దారితీసి ఉండొచ్చు అని వైద్యులు అభిప్రాయపడ్డారు." సుతిమెత్తగా చెప్పారు జడ్జిగారు.

"నేను బతికి బట్ట కడతాననుకోలేదు ఎవరూ. ఈ రెండేళ్లలో వాడిని చాలాసార్లు బతిమాలాడాను కేసు ఆపేయమని; కానీ వాడు 'తల్లే గొప్ప... పెళ్ళాం కన్నా' అని కోర్టు ద్వారా నిరూపించదలుచుకున్నాడు అని నాకర్థమయింది."

"వాళ్ళిద్దరికీ శిక్ష వేద్దామనుకుంటున్నాను' ఆమెనే చూస్తూ అన్నారు జడ్జి.

"లేదు వాడిని నేను రెచ్చగొట్టానేమో అనిపిస్తోంది, నాకు శిక్ష వెయ్యండి" అని పెద్దగా ఏడ్చి ఆ వీల్ చైర్‌లోనే వాలిపోయింది.

"ఆవిడను ఆసుపత్రికి తీసుకెళ్ళండి" అంటూ, జడ్జిగారు పెద్దావిడ ఆరోగ్యరీత్యా ఆ రోజు కోర్టు వాయిదా నిర్ణయాన్ని ప్రకటించారు. "వారి తల్లిని కూడా విచారించడం జరిగింది కాబట్టి వచ్చే వారం తుది తీర్పుకోసం, కోర్టు వాయిదా వేయబడింది!" అంటూ నిష్క్రమించారు.

మరుసటి వారం తుది తీర్పు. 'తన భార్యకి శిక్ష పడి కొన్ని రోజులు జైలులో పెడితే అదొక చారిత్రక తీర్పు అవుతుంది. కొడుకులకు తల్లి మీద ప్రేమ లోకానికి నిరూపించబడుతుంది. అది చాలు... తనకు రెండేళ్లు కోర్టులో పడిన శ్రమకు, పెట్టిన డబ్బుకు ఫలితంగా' అనుకుంటూ పడుకున్న శాస్త్రిగారి ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

ఒకరోజు తల్లికి విపరీతమైన నడుము నొప్పి వచ్చింది. వైద్యులు ఎక్స్‌రే తీసి మందులు రాసిచ్చారు. సుమారు ఎనభై ఏళ్ళు ఉన్న ఆమెకు మధుమేహం, రక్తపోటు కూడా ఉన్నాయి. 'నొప్పి మందులు జాగ్రత్తగా వాడుకోండి. నొప్పి ఎక్కువ ఉందని ఎక్కువ మాత్రలు వెయ్యకండి' అని హెచ్చరించి మరీ పంపారు వైద్యులు. అయితే ఒకరోజు రాత్రి ఆవిడకు భరించలేనంత నొప్పి వచ్చింది. విలవిలలాడుతున్న ఆమె బాధను చూసి, అమె కోడలు ఒక నొప్పిమాత్ర అదనంగా ఇచ్చింది. నొప్పి ఉపశమనం చెందటంతో పడుకుంది. కానీ తెల్లవారుజామున పొట్ట బిగిసి, పొత్తికడుపులో నొప్పి పెరగడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరీక్షలు చేసి 'అక్యూట్ రీనల్ షట్ డౌన్' అంటే అకస్మాత్తుగా మూత్రపిండాల పనితనం తగ్గడం' అని రోగ నిర్ధారణ చేసి, ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు.

మొత్తానికి ఒక వారం రోజులు ఐ సీ యూ లో, ఆ తర్వాత గదిలోకి మార్చి, అక్కడొక మూడు రోజులు ఉంచి నొప్పి మాత్రలు వేయొద్దని జాగ్రత్తలు చెప్పి పంపించారు.

'డిశ్చార్జ్ రోజున ఆ నొప్పి మాత్ర అదనంగా ఇవ్వడం వలన ఆవిడకు కిడ్నీలు అప్పటికప్పుడే, పనిచేయడం మానేశాయని అనిపిస్తోంది' అని విధుల్లో ఉన్న జూనియర్ వైద్యుడు అనుమానబీజం నాటాడు. యాదృచ్ఛికంగా అదే రోజు శాస్త్రిగారి అమ్మ ఆయనను ఆ విచిత్రమైన కోరిక కోరింది.

ఇంట్లో తన అమ్మ కోలుకోవడం మొదలుపెట్టిన వారం రోజులకు లాయర్‌ని కలిసి ఈ కేసు వేశాడు. ఆ విషయమే భార్యతో చెప్పాడు.

"మీకు న్యాయం అనిపిస్తే, నేను సంతోషంగా ఏ శిక్షనైనా అనుభవిస్తాను" అంది, మనసు కంట్లో నలకలా పడినట్లయి కళ్ళు తుడుచుకుంటూ.

పంతులుగారి కళ్ళు చెమర్చాయి. ముందుకు వంగి భార్య తల మీద ముద్దు పెడుతూ "లాయర్‌కి డబ్బు కూడా ఇచ్చి వచ్చా, కేసు తప్పకుండా గెలవాలని" అన్నారు.

భర్త కన్నీరు భార్య తలమీద పడి, చెంపల మీదుగా కారి ఆమె ఒళ్ళో పడింది. 'క్షమించు లక్ష్మీ' అన్నట్లు చూసారు పంతులుగారు. ఆ చూపులు తట్టుకోలేక ఒక్క ఉదుటున లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"లక్ష్మీ.. ఒక చుక్క కాఫీ కలిపివ్వమ్మా" అన్న అత్తగారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి ఆమెకు కాఫీ ఇచ్చి, భర్తకి కూడా కాఫీ ఇచ్చి ముభావంగా పొద్దుపొడుపు చీకటిని ఆహ్వానిస్తూ గడపలో కూర్చుంది.

ఆలోచనలో నుంచి నిద్రలోకి జారుకున్న పంతులుగారు ఆ రాత్రి నిద్ర నుండి ఉలిక్కిపడి లేచాడు. భయంకరమైన కల వచ్చింది. అదే సమయంలో గోడగడియారం రెండు గంటలు కొట్టింది.

పక్కనే పడుకున్న అమ్మ మీద చెయ్యి వేసి చల్లగా తగలడంతో "అమ్మా" అని ఆందోళనగా అరిచినట్లు పిలిచాడు. ఉలుకూ లేదు పలుకూ లేదు.

అనుమానంతో అటుపక్క చాప వేసుకొని పడుకున్న పెళ్ళాన్ని చేతితో తట్టి లేపాడు "లేచి లైట్ వెయ్యి, అమ్మ ఒళ్ళు చల్లగా తగులుతుంది" అంటూ.

పంతులుగారు అమ్మకు అంత్యక్రియలు, నిత్యకర్మలు అన్నీ శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

'జడ్జిగారితో పని లేకుండా అమ్మే తీర్పు చెప్పి వెళ్ళిపోయింది. అమ్మను తీసుకెళ్లి తనకు శిక్ష వేసింది ఎవరా?' అనే ఆలోచనలు పంతులుగారిని నిద్రకు దూరం చేశాయి.

# రచయిత్రి పరిచయం

## వైద్యో నారాయణో హరిః

**డా. మజ్జి భారతి**

శ్రీకాకుళం జిల్లా రాజంలో జన్మించిన డా. మజ్జి భారతి గారు ఇంటర్మీడియట్ వరకు అక్కడే చదివారు. తర్వాత ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్. చదివి, ఎండీ కూడా అక్కడే చేసి, ప్రభుత్వ సర్వీస్ లో చేరిపోయారు. ప్రస్తుతం శ్రీకాకుళం, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ లో సూక్ష్మజీవ శాస్త్ర విభాగం, అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. "కవితలు, కథలు రాయడానికి స్ఫూర్తి అంటూ ఏమి లేదు గాని, రాయాలనే ఆలోచన చిన్నప్పట్నుంచి వచ్చింది. ఆలోచనలలో ఏదో అంశం స్ఫురించగానే, దాన్ని కథగానో, కవితగానో మరల్చి, అక్షరరూపం ఇస్తాను." అంటూ తన సాహితీ ప్రస్థానం గురించి చెప్పే డా.భారతి గారు కథలు, కవితలు, పద్యాలు వ్రాస్తున్నారు. డా. భారతి గారి కథల సంపుటి "ఆలోచనా తరంగాలు" విడుదలయింది. త్వరలో "వేకువ" అనే కథల సంపుటి విడుదల కాబోతుంది. ఎంత బిజీగా ఉన్నా ఆలోచనలకు కథల రూపం ఇవ్వాలనే తపనతో, సమయం చిక్కించుకుని రచనలు చేస్తున్న డా. భారతిగారు తన విద్యార్థులకు నైతిక విలువలు, వైద్యులుగా సమాజంలో ఉండే బాధ్యతల గురించి కూడా బోధించడానికి తనకు మంచి అవకాశం లభ్యమయిందని ఆనందంగా తెలియచేసారు. వృత్తిపరంగా పలు అవార్డులు అందుకున్న డా. భారతి గారి నుంచి మరిన్ని మంచి కథలు తెలుగు కథాప్రియులకు భవిష్యత్తులో లభించగలవని ఆశిస్తున్నాం.

# వైద్యో నారాయణో హరిః

డా. మజ్జి భారతి



9440615206

***కానీ తన క్లోజ్‌ఫ్రెండ్ రఘు ఒక్కడే.. "నీ గురించి బాగా తెలిసినవాడిని కాబట్టి, నువ్వు తీసుకున్న ఈ నిర్ణయం సరైనది కాదేమోననిపిస్తుంది. సుచిత్రను నువ్వు పెళ్లి చేసుకుంటే వాళ్ళ నాన్నగారు చెప్పినట్లు నడుచుకోవాల్సి వస్తుందేమో! నీ లక్ష్యాలను వదులుకోవాల్సి వస్తుందేమో! భవిష్యత్తులో నువ్వు ఇబ్బంది పడతావేమో! ఆలోచించుకో" హెచ్చరించాడు.***

"ఒరేయ్ ఆ బాబు చేతిలో ఏదో మహత్తు ఉందిరా! లేకపోతే చావు ముంగిట వరకు వెళ్ళిన వాడిని ఎలా బతుకుతాను? ఆయన దేవుడురా! దేవుడే! నాలాంటి వాళ్ల ప్రాణాలు ఎంత మందివి కాపాడి ఉంటాడు? మొదటిసారి దేవుడిని చూశానురా!" ఈ మాట నాన్న ఎన్నిసార్లు అనుంటాడో!

నాన్న ఆ మాట అన్నప్పుడల్లా, నా భుజం మీద చేయి వేసి "భయపడకు. మీ నాన్నకు ఏమి కాదు. ఒక్క వారం రోజులలో మీ నాన్నకు డిశ్చార్జ్ ఇచ్చేస్తాం. చక్కగా ఇంటికి వెళ్లిపోదువు గాని!" అన్న ఆయన మాటలే గుర్తుకు వస్తాయి. ఆ మాటలు ఎప్పుడు గుర్తుకు వచ్చినా, ఇంకా ఆ చేయి తన భుజాల మీదే ఉన్నట్టు అనిపిస్తూ ఉంటుంది.

నాన్న పురుగుల మందు తాగి, చావుబతుకుల మధ్య ఉంటే, జిల్లా ఆసుపత్రి నుండి పెద్దాసుపత్రికి పంపించారు.

"ఈ గండం నుండి గట్టెక్కడం నాకు అనుమానమే! అయినా భార్య చనిపోయాక, మారు పెళ్లి చేసుకుని, పిల్లల్ని చక్కగా పెంచుకుంటున్న వాళ్ళని ఎంతమందిని చూడలేదు! ఏమిటో... వీడు ప్రాణాలన్నీ వాళ్ళావిడ మీద పెట్టుకు బతికాడు. ఆవిడేమో... నాగేష్‌ని కని, పురిట్లోనే చనిపోయింది. అప్పటి నుండి వీడు కూడా చావు కోసం ఎదురు చూడడమే!" నిట్టూర్చాడు శివ మామ.

"చాల్లేండ్రా! చిన్నపిల్లవాడి ముందు ఏమిటా మాటలు? వీడికేమి కాదు. పెద్దాసుపత్రిలో పెద్ద పెద్ద డాక్టర్లుంటారు. వీడికి తిరిగి ప్రాణాలు పోస్తారు. ఈ బుడ్డోడిని దేవుడు అన్యాయం చెయ్యడు. చూస్తూ ఉండండి!" పక్కింటి సోమయ్య తాత.

"ఏమో దద్దా! వీడు ఈ ఉపద్రవం తట్టుకొని బతికి బట్టకట్టినా ఏమి లాభం? కష్టపడి పనిచెయ్యడం... తెచ్చిందంతా తాగుడికి పొయ్యడం... 'చుక్క గొంతు దిగితే మా ఆవిడ నా పక్కనే ఉన్నట్టు అనిపిస్తుంటుందిరా! అందుకని మందు లేకపోతే నిలవలేనురా' అని పూటుగా తాగడం. ఆఖరికెప్పుడో తాగి, తాగి ఆ తాగుడు మైకంలో ఏ లారీ కిందపడి చచ్చిపోతాడోనని నా గుండెలెప్పుడూ పీచు, పీచుమంటాయి!" నిట్టూర్చాడు నాన్న సావాసగాడు కామేశం మామ.

"ఇప్పుడామాటలెందుకు?" కోప్పడ్డాడు తాత.

కానీ, వాళ్ళ మాటలు పన్నెండేళ్ల నాగేష్ మనసులో నాటుకుపోయాయి. నాన్న ఇప్పుడు బ్రతికినా, తరువాత అందరిలాగా తాను పెద్దయ్యే వరకు ఉండడా! తాగి తాగి చనిపోతాడా? తనకెవరూ ఉండరా?

"మాదాకబళం తల్లీ! తల్లి తండ్రి లేని అనాథను. మీరే సూడాల!" అని తమ ఇళ్ల ముందు రోజూ అడుక్కుంటున్న పిల్లవాడు కళ్ళముందు కనిపించాడు నాగేష్‌కి. నాన్న లేకపోతే తన పరిస్థితీ అంతేనా? భయమేసింది నాగేష్‌కి. దుఃఖం ముంచుకొచ్చి, వెక్కివెక్కి ఏడ్చేసాడు.

“ఫర్వాలేదురా బుడ్డోడా! మీ నాన్నకేమీ కాదు భయపడకు!” ధైర్యం చెప్పాడు తాత.

హాస్పిటల్ మంచం మీద నాన్న... ఊపిరి తీసుకోవడానికి, గుండెలు ఎగిరెగిరి పడుతుంటే... నాన్న మృత్యువుతో యుద్ధం చేస్తున్నట్లనిపిస్తుంది. నాన్ననలా చూస్తుంటే భయమేస్తుంది, ఆ గుండెలెప్పుడాగిపోతాయేమోనని! కొంతసేపు గడిచాక యుద్ధం చెయ్యలేకపోయాడేమో! గుండెలెగిరెగిరి పడడం ఆగిపోయింది.

“కార్డియాక్ అరెస్ట్” గాభరాగా అంటూ ఏమేమో చేస్తున్నారు చిన్న డాక్టర్లు. అందరూ నాన్న చుట్టూ మూగిపోయారు.

“ఒరేయ్ రాముడూ! కళ్ళిప్పి చూడరా! ఎలా వెళ్ళిపోతావురా? ఒక్కసారి శివా అని పిలువరా!” ఏడుపుతో మాటలు కూడా సరిగ్గా రావడం లేదు శివ మామకి. “ఈ బుడ్డోడి కోసమైనా బ్రతుకురా” తనను చూపిస్తూ అంటున్నాడు సోమయ్య తాత. తనను జాలిగా చూస్తున్నాడు కామేశం మామ.



“పక్కకు జరగండి. పెద్ద డాక్టరుగారు వస్తున్నారు!” అందర్నీ కేకలేసింది నర్స్. వచ్చిన పెద్ద డాక్టరుగారు చిన్న డాక్టర్లకి ఏవేవో చెబుతూ, తన చేతులను నాన్న గుండెల మీద ఉంచి లయబద్ధంగా నొక్కడం మొదలు పెట్టారు. అదేమిటో! అంతకు ముందు చిన్నడాక్టర్లు నాన్న గుండెలను నొక్కుతుంటే, వాళ్ళ బరువుకి నాన్న ఎముకలు విరిగి పోతాయేమోనని భయమేసింది. కాని ఈయన చేస్తుంటే, ఏదో మంత్రం వేస్తున్నట్టు అనిపిస్తుంది. ఏదో శక్తిని తన చేతుల ద్వారా నాన్న గుండెలలోనికి పంపిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆయన చేతులు పడగానే నాన్న బ్రతుకుతాడన్న ధైర్యం కలుగుతోంది. కళ్ళు మూసుకున్నాడు తాను. ఎంత సేపో తెలియదు. కళ్ళు తెరిచేటప్పటికి నాన్న ప్రశాంతంగా ఊపిరి తీసుకుంటున్నాడు.

★★★

రెండురోజులు పోయాక అందరూ వెళ్ళిపోయారు. అసలే కోతల రోజులు. ఎన్ని రోజులని హాస్పిటల్‌లో ఉండిపోగలరు ఎవరైనా! అందరూ ఉన్నప్పుడు తెలియలేదు గాని, అందరూ వెళ్ళిపోయాక ఏమిటో భయమేస్తుంది. “ఇంకెన్నాళ్లో బతకడురా వీడు” ఆ మాటలే పదే పదే గుర్తుకు వస్తున్నాయి. వెక్కివెక్కి ఏడ్చేసాడు నాగేష్. ఎవరిదో చల్లని చేయి భుజం మీద పడితే, తుళ్ళిపడి చూశాడు. ఎదురుగా పెద్దడాక్టరుగారు.

తెల్లని మేని ఛాయ, కోటేరులాంటి నాసిక, కరుణామృతాన్ని ఒలికిస్తున్న కన్నులు... ప్రశాంతమైన వదనం... తెలుగు మాస్టారు వర్ణించి చెప్పిన భగవంతుడిలా అనిపించారు. అప్రయత్నంగా చేతులు జోడించి, ఆయన కాళ్లమీద పడిపోయాడు.

"ఛ,ఛ... ఏమిటిది? లే, లే" అని లేపి, "మీ నాన్నకొచ్చిన భయమేమీ లేదు. దిగులుపడకు. మరొక్క వారం రోజులలో ఇంటికి పంపించేస్తాను. బుద్ధిగా చదువుకొని, మీ నాన్నను బాగా చూసుకో!" తలమీద చేయి వేసి చెప్పారు.

★★★

"వాళ్ళమ్మకు నాగేశుడంటే మహా భక్తి. అందుకని వాడికి నాగేశ్వరరావని పేరు పెట్టాను. కానీ, వీడు పాముపిల్ల. అందుకే వీడికి భయపడి వెళ్ళిపోయింది. లేకపోతే అంతవరకు బాగానే ఉండి, వీడు భూమ్మీద పడగానే చనిపోవడమేమిటి? వీడెప్పుడో నన్నూ చంపేస్తాడు. అందుకే నాకు బ్రతకాలని లేదు. మా ఇంటిదాని దగ్గరికి పోతాను" తాగుడు ఆపి, పిల్లవాడిని బాగా చూసుకో అన్న డాక్టర్‌గారి మాటలకు, నాన్న తల కొట్టుకొని ఏడుస్తున్నాడు.

"నీ భార్య ఎక్కడికి వెళ్ళింది? నీ దగ్గరే, నీ మనసులోనే ఉంది. నువ్వున్నావన్న ధైర్యంతోనే నీ కొడుకును నీకొదిలి ఆవిడ వెళ్ళిపోయింది. ఆవిడ నమ్మకాన్ని వమ్ము చేస్తావా? కొడుకు మీద ఆవిడ ఎన్ని ఆశలు పెట్టుకుందో? నువ్వు కొడుకు గురించే కాదు, నీ ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోవడం లేదంటే, పైనుండి ఆవిడెంత బాధ పడుతుందో? ఎప్పుడైనా ఆలోచించావా?" నెమ్మదిగానే, అయినా సూటిగా అడుగుతున్నారు పెద్ద డాక్టరుగారు నాన్నను.

"తాగుడు ఆపు" అని నాన్నకు చెప్పినవాళ్లే గాని, ఇలా డాక్టరుగారిలా, మా అమ్మను గుర్తు చేస్తూ ఎవ్వరూ నాన్నకు చెప్పి ఉండరు.

"నీ కొడుకులో నీ భార్యను చూసుకొని, వాడిని బాగా చదివించు. పై నుండి నీ భార్య సంతోషిస్తుంది." మృదువుగా చెప్తున్నారు పెద్ద డాక్టరుగారు. గీతోపదేశం చేసిన కృష్ణ భగవానుడు గుర్తుకొచ్చాడు నాగేష్‌కి. నాన్నింక తాగుడు జోలికి పోడు. నాన్న ప్రాణాలుకు ఢోకా లేదు. నాగేష్‌కి ధైర్యం వచ్చింది.

★★★

కాలచక్రం గిర్రున తిరిగింది. ఐదేళ్లు గడిచాయి నాన్నతో పాటు భయం, భయంగా ఆంధ్ర మెడికల్ కాలేజీలోకి అడుగు పెట్టాడు నాగేశ్వరరావు వైద్య విద్యార్థిగా ప్రవేశానికి.

"ఉండరా! పెద్ద డాక్టరుగారిని ముందు కలిసి, ఆ బాబు ఆశీర్వాదం తీసుకుందువు గాని!" అని డాక్టరుగారి గది దగ్గరికి వెళ్ళారిద్దరు.

"పేరు చెప్పకుండా పెద్ద డాక్టరుగారంటే ఎలాగయ్యా? ఇక్కడ చాలామంది పెద్ద డాక్టర్లు ఉంటారు!" నర్సు చెప్పింది.

"అదేనమ్మా! తెల్లగా, అందంగా... ఈ గదిలోనే ఉండేవారు! ఆ బాబు!" నాన్న చెప్పాడు.

"రామనరసింహం గారి గురించా? ఆయనకు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారు" చెప్పింది స్టాఫ్ నర్స్.

ఎంతో ఉత్సాహంగా పెద్ద డాక్టరుగారిని కలుద్దామని వచ్చిన తండ్రీ కొడుకులిద్దరూ నిరుత్సాహంగా ఒకరినొకరు చూసుకున్నారు.

★★★

"మీ చేతి వేళ్ళకు కళ్ళుండాలి. అవి రోగి శరీరంలోని బాధను పట్టుకోగలగాలి. ఇన్వెస్టిగేషన్స్ అవసరం లేకుండా, రోగిని తనిఖీ చేసి రోగమేమిటో కనిపెట్టగలగాలి. మీ నైపుణ్యాన్ని మీరు నమ్ముకోండి. ఎంత జాగ్రత్తగా రోగిని పరిశీలిస్తే, అంత బాగా మీరు రోగనిర్ధారణ చేయగలరు. టెస్టులంటూ రోగిపై అదనపు భారం మోపకుండా, రోగ నిర్ధారణ చేయగలిగినప్పుడే, మీరు మంచి డాక్టరు అనిపించుకుంటారు!" క్లినికల్ పోస్టింగ్‌లోకి అడుగుపెట్టిన నాగేష్ ఆ మాటలు వినిపించిన వైపు చూశాడు.

పదిమంది వైద్యవిద్యార్థుల మధ్య తెల్లగా మెరిసిపోతూ ఆయన... తన రోల్ మోడల్... అమాంతం వెళ్ళి ఆయన కాళ్ళమీద పడిపోవాలనిపించింది. నిగ్రహించుకున్నాడు. తనకు పోస్టింగ్ వేసిన వార్డుకు వెళ్లకుండా అక్కడే ఉండిపోయాడు. ఆయనను కలవాలని ఉంది. కలిసి ఏం మాట్లాడతాడు? తనెవరని చెప్తాడు? ఎందరో రోగులు... వాళ్ళ బంధువులు... ఎంతమందినని గుర్తు పెట్టుకోగలరాయన? ఎప్పుడో ఆరేళ్ల క్రిందటి సంగతి. అందుకే ఆయనను కలవాలన్న కోరికను బలవంతంగా అణుచుకున్నాడు. పోస్టింగు ఎగ్గొట్టి మరీ ఆయన క్లాసులకు వెళ్లేవాడు నాగేష్.

పోస్టింగుకి రావడం లేదని, రిజిస్ట్రార్ పిలిచి, "ఆబ్సెంట్ వేస్తాను, ఎగ్జామ్‌కు వెళ్లకుండా చూస్తానని" చీవాట్లు పెట్టారు. అటుగా వెళుతున్న రామనరసింహం సార్ ఈ మాటలు విని ఉంటారా?

"సార్! మీరే నా రోల్ మోడల్" అని ఎవరి ముందు... చెప్పాలని అనుకుంటున్నాడో... ఆయన ముందు పోస్టింగుకి రాకుండా తిరుగుతున్న వాళ్ళలో ఒకడిలా... ఎప్పటికైనా ఆయనకు తన ముఖం చూపించగలడా? ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్ అంటారు... తన రోల్ మోడల్ ముందు, చీవాట్లు తింటూ...

గంట పోయాక "రామనరసింహం సార్ రమ్మంటున్నారు" అని వచ్చిన స్టాఫునర్సుతో రూముకి వెళ్ళిన నాగేష్‌ని "నీకు పోస్టింగ్ వేసిన వార్డుకు వెళ్లకుండా నా వార్డుకు ఎందుకు వస్తున్నావు?" సూటిగా అడిగారాయన.

"అమ్మయ్య! క్లాసుల్లో నన్ను చూశారన్నమాట. పోస్టింగుకి వెళ్లకుండా తిరుగుతున్నవాడినని అనుకోలేదన్నమాట" ఈ ఆలోచన రాగానే, వంగి ఆయన కాళ్లకు నమస్కారం చేశాడు. ఒక్క క్షణం కదలకుండా నిలిచి ఉన్నారాయన.

మరుక్షణం నాగేష్ భుజాలు పట్టుకుని లేపి ఐడి కార్డుమీద పేరు చూసి "నాగేశ్వరరావు" తనలో తనే అనుకుంటున్నట్టు చదివి, ఏదో గుర్తుకు వచ్చినట్లు, "నాగేష్!" ఆశ్చర్యంగా అడిగారాయన. ఆయన నోటి నుండి తనపేరు విన్న నాగేశ్వరరావుకి గాలిలో తేలిపోతున్నట్టు అనిపించింది.

"మీ నాన్నగారు బాగున్నారా?" భుజాన్ని తడుతూ అడిగారాయన. తలూపిన నాగేష్‌ని చూసి, "మీ నాన్ననెప్పుడూ డిసప్పాయింట్ చేయవద్దు. బాగా చదువుకో. కాని పోస్టింగ్ ఏ వార్డుకి వేస్తే, అక్కడికే వెళ్లాలి!" నవ్వుకుంటూ అన్నారాయన.

కాలచక్రంలో మరో రెండేళ్లు గడిచాయి. ఫైనల్ ఇయర్‌కు వచ్చేశాడు నాగేష్. అదృష్టం... ఈసారి ఆయన వార్డులో మెడిసిన్ పోస్టింగ్స్.... రెండునెలలు ప్రతిరోజూ ఆయన దగ్గర నేర్చుకుంటూ.... ఇంతకన్నా ఇంకేం కావాలి? ఎగిరి గంతేసింది మనసు.

"రోగిని ముట్టుకోకుండా బాగా పరిశీలించడం, రోగి శరీరాన్ని ముట్టుకొని తనిఖీ చేయటం, స్టెతస్కోప్ పెట్టి పరీక్షించడం. ఈ మూడూ బాగా నేర్చుకుంటే, ఏ వ్యాధినైనా ఎక్స్‌రేలు, సీటి స్కాన్‌లు, ఎంఆర్ఐ స్కాన్‌లు లేకుండా డయాగ్నోసిస్ చేయవచ్చు. రోగులు వారి బాధను మనం నయం చేస్తామన్న నమ్మకంతో వస్తారు. ఆ నమ్మకాన్ని మనం వమ్ము చేయకూడదు. రోగి లేకపోతే డాక్టర్ అన్న వ్యక్తి ఉండడు, గుర్తుపెట్టుకోండి. అలాగే డాక్టర్ మీదే రోగి జీవితం ఆధారపడి ఉంటుంది. అందుకని రోగనిర్ధారణలో ఎక్కడా పొరపాటు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మనదే!" స్టూడెంట్స్‌కు, సబ్జెక్ట్‌తో పాటు పదేపదే

ఈ విషయాలు చెప్తారు సార్. ఆయన ఏ మాట చెప్పినా హృదయానికి హత్తుకుపోతుంది. అందుకే మిగిలిన వార్డు స్టూడెంట్స్ కూడా సార్ క్లాసుకి వస్తారు.

"ఈ బాబు హస్తవాసి చాలా మంచిది. ఆ బాబుతో మాట్లాడితే సగం జబ్బు తగ్గిపోతుంది" అని పేషెంట్స్ అనడం ఎన్నోసార్లు విన్నాడు నాగేష్. ఆయనలాగే తానూ పేరు తెచ్చుకోవాలని ఎంతో కోరిక నాగేష్‌కి.

మృదుమధురమైన ఆయన స్వరం... "పేషెంట్ హిస్టరీ కరెక్టుగా తీసుకుంటే... సగము డయాగ్నోసిస్ అయినట్లే... మిగిలిన సగం ఫిజికల్‌గా తనిఖీ చేసి రోగనిర్ధారణ చేయాలి. అవసరమనుకుంటేనే టెస్టులు రాయాలి. అంతేకానీ అనవసరంగా టెస్టులు రాసి పేషెంటుని ఇబ్బంది పెట్టకూడదు. కేవలం టెస్టుల మీద డిపెండ్ అయి డయాగ్నోసిస్ చేయకూడదు!" ఆయన మాటలు అణువణువునా ఇంకిపోయాయి నాగేష్‌కి. ఆయనలాగే తాను కూడా మంచి డాక్టరనిపించుకోవాలి.

★★★

మరో రెండేళ్లు గిర్రున తిరిగి పోయాయి. నీట్ ఎగ్జామ్ రిజల్ట్స్ వచ్చేసాయి. స్టేట్ ఫస్ట్ వచ్చింది. జనరల్ మెడిసిన్ చేసి, గవర్నమెంట్ జాబ్‌లో చేరి, గురువుగారిలా పేదలకు సర్వీస్ చెయ్యాలన్న తన కోరిక తొందరలో తీరబోతుంది. మేఘాలలో తేలిపోతున్నాడు నాగేష్.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం కౌన్సిలింగ్ జరుగుతోంది. "కంగ్రాట్యులేషన్స్ మిస్టర్ నాగేశ్వరరావు, నీట్ ఎగ్జామ్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చినందుకు..!" కౌన్సెలింగ్‌లో అధికారులు నాగేష్‌కి విష్ చేసి, "మీ ఆప్షన్ చెప్పండి. ఏ కోర్సులో జాయిన్ అవుతారు?" అడిగారు.

ఇదే ప్రశ్న ఇంకొకరు తననడిగారు. కానీ ఆప్షన్ తనని ఎంచుకోమనలేదు. ఏ ఆప్షన్ తాను తీసుకోవాలో వారే చెప్పారు. వారం క్రితం జరిగిన సంగతి గుర్తుకొచ్చింది నాగేష్‌కి. ఎంబిబిఎస్‌లో తన క్లాసుమేట్, సుచిత్ర... ఆస్తి, అందం, అణకువ, తెలివితేటలు అన్నీ ఉన్నాయి. పైగా ఒక్కతే కూతురు. మగపిల్లలందరి చూపులు ఆమెమీదే. "నాన్నగారు మీతో ఏదో మాట్లాడాలంట. మీ రూముకి వస్తానన్నారు" ఫోన్ చేసి చెప్పింది.

వాళ్ళ నాన్నగారు కేంద్ర ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగి. ఆయన నా రూముకి వస్తానన్నారంటే...ఏమై ఉంటుంది? నా స్థాయి ఏమిటో నాకు గుర్తుంది కాబట్టి, ఊహలో కూడా వేరే ఆలోచనకు తావివ్వలేదు నా మనసు. ఆయన సరాసరి విషయానికొచ్చేసారు. వాళ్ళమ్మాయి సుచిత్ర గైనకాలజీ తీసుకుని, తర్వాత ఫెర్టిలిటీ సెంటర్ పెడుతుంది. నర్సింగ్ హోమ్‌కు కావలసిన ఏర్పాట్లు ఇప్పటినుండే చేస్తున్నారు. తాను పీజీలో రేడియో డయాగ్నోసిస్ సీటు తీసుకుంటే, వాళ్ళమ్మాయినిచ్చి పెళ్లి చేసి, తనపేరున డయాగ్నొస్టిక్ సెంటర్ పెడతారు. ఇదీ ఆయన ప్రపోజల్.

కలలో కూడా ఊహించని విషయమిది. సుచిత్ర చేయి పట్టుకోవడమంటేనే.... మనసు ఎగిరిగంతేసింది. అందరాని చందమామ ముంగిట వాలినట్లు అనిపించింది. సిరి రా మోకాలడ్డుతారా ఎవరైనా? గాని... జనరల్ మెడిసిన్ చేసి, గవర్నమెంట్ సర్వీసులో చేరి, గురువుగారిలా పేదలకు సర్వీస్ చెయ్యాలన్న తన కోరిక...???

"పేదలకు సర్వీస్ చెయ్యాలంటే, గవర్నమెంట్ జాబే చెయ్యాలని రూలేమన్నా ఉందా? ఏముంది? రేడియో డయాగ్నోసిస్ తీసుకొని, ప్రైవేట్ ప్రాక్టీస్‌లో బాగా సంపాదించి పేదలకు సర్వీస్ చెయ్యవచ్చు కదా!" మనసు మభ్య పెట్టింది. సుచిత్ర గుర్తుకు రాగానే అంతవరకు తీసుకున్న నిర్ణయాలన్నీ గాలికి కొట్టుకుపోయాయి.

సుచిత్రను పెళ్లి చేసుకోవాలని ఎంతమంది కోరికో! అటువంటిది, ఆ అదృష్టం నాకు పట్టబోతోంది. ఈ పెళ్ళి జరిగితే తను దేనికి చూసుకోనక్కరలేదు. జీవితం ఇక పూలబాటే. సుచిత్రను తలచుకొని మనసు ఊహలలో తేలిపోతుంది.

అందరూ తన అదృష్టాన్ని పొగిడే వారే! కానీ తన క్లోజ్ ఫ్రెండ్ రఘు ఒక్కడే "నీ గురించి బాగా తెలిసిన వాడిని కాబట్టి, నువ్వు తీసుకున్న ఈ నిర్ణయం సరైనది కాదేమోననిపిస్తుంది. సుచిత్రను నువ్వు పెళ్లి చేసుకుంటే వాళ్ళ నాన్నగారు చెప్పినట్లు నడుచుకోవాల్సి వస్తుందేమో! నీ లక్ష్యాలను వదులుకోవాల్సి వస్తుందేమో! భవిష్యత్తులో నువ్వు ఇబ్బంది పడతావేమో! ఆలోచించుకో" హెచ్చరించాడు.

"సుచిత్ర పక్కనుంటే చాలు, దేనినైనా భరించగలను" నమ్మకంగా చెప్పాను. నా నమ్మకం మీద రఘుకి నమ్మకం కలిగినట్లు లేదు. కానీ రఘు నమ్మకంతో నాకు పనిలేదు. ఇన్నాళ్లూ సుచిత్ర నా ఊహలలోనే .. ఇప్పుడా ఊహలన్నీ నిజమవబోతున్నాయి. ఇంకేం కావాలి జీవితంలో!

"మిస్టర్ నాగేశ్వరావు, మీ ఆప్షన్" ఆలోచనలో పడిపోయిన నాగేష్‌ని మరొక్కసారి అడిగారు యూనివర్సిటీ అధికారులు. ఉలిక్కిపడి సమాధానం చెప్పాడు నాగేష్ చిరునవ్వు నవ్వుతూ.

★★★

"సార్ మీరు రేడియో డయాగ్నోసిస్ తీసుకుంటారని విన్నాము. ఇప్పుడు జనరల్ మెడిసిన్ తీసుకున్నారు కారణమేమిటి?" కౌన్సిలింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చిన ఫస్ట్ ర్యాంకర్ నాగేశ్వరరావుని చుట్టుముట్టారు విలేఖరులు.

కారణమేమిటా! ఈ రెండు సంఘటనలు జరగకపోయుంటే... తన జీవితలక్ష్యాన్ని తాను మర్చిపోయి ఉండేవాడు. అందరిలాగే తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆరాటపడి, భవిష్యత్తులో వెనక్కి తిరిగి చూసుకుంటే, జీవితాన్ని కోల్పోయానని బాధపడి ఉండేవాడు. వారం క్రితం జరిగిన ఆ రెండు సంఘటనలు.....

చిన్నప్పటి తన క్లాస్‌మేట్ తాతగారు నర్సింగ్ హోమ్‌లో చనిపోతే, స్టాంపు పేపరు మీద రాసిస్తామన్నా, బాకీ ఉన్న బిల్లుకడితే గాని డెడ్‌బాడీని ఇవ్వనన్నారట. నర్సింగ్ హోం చీఫ్ తెలుసని వెళ్లి అడిగితే "నువ్వడిగావు కాబట్టి, బిల్లులో ఫైవ్ పర్సెంట్ డిస్కౌంట్ ఇవ్వగలను. అంతేగానీ బిల్లు కట్టకుండా డెడ్‌బాడీని ఇవ్వడమంటే... ఇలాగే ప్రతీవాళ్లు అడిగితే నేను నర్సింగ్ హోమ్ మూసుకోవలసి వస్తుంది. అర్థం చేసుకో" అనేసారాయన. అంటే రేపు నేను నర్సింగ్ హోమ్ పెట్టినా... నేను కూడా... అసలది నాది కూడా కాదు సుచిత్రదవుతుంది... అటువంటప్పుడు నేను ఫ్రీ సర్వీసు చేయాలంటే...

ఆ సమయంలోనే జరిగిన ఇంకొక సంఘటన... నా లక్ష్యాన్ని నాకు గుర్తు చేసింది. శివమామ డెంగ్యూ జ్వరంతో చావుబతుకుల మధ్య ఉన్నప్పుడు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఒక డాక్టరుగా కాకుండా... ఒక రోగి బంధువుగా... ఫిజిషియన్ పాత్ర ఏమిటో, ప్రత్యక్షంగా చూశాను. ఎప్పటికప్పుడు రోగిని తనిఖీ చేస్తూ, పరిస్థితిని బట్టి వైద్యాన్ని మారుస్తూ, రోగికి ప్రాణాలు పొయ్యడం... రోగిని ప్రత్యక్షంగా చూసిన డాక్టర్లకే సాధ్యం. రేడియో డయాగ్నోసిస్ తీసుకొని, పేషెంట్‌కు దూరంగా నేనుండలేను.

"సార్! మీరు జనరల్ మెడిసిన్ తీసుకోవడానికి కారణం?" ఆలోచనలలో మునిగిపోయిన నాగేష్‌ని అడిగారు విలేఖరులు.

"మిగిలిన డాక్టర్లకన్నా, జనరల్ మెడిసిన్ చేసిన డాక్టర్లే ఎక్కువసేపు పేషెంట్లతో గడుపుతారు. అలాగే రోగి ఆఖరి క్షణాలలో, సాధారణంగా దగ్గర ఉండేది జనరల్ మెడిసిన్ డాక్టర్లే. రోగికి స్వస్థత చేకూర్చామన్న తృప్తి, వీలుకాకపోతే వారి ఆఖరిక్షణాలలో

దగ్గర ఉన్నామన్న తృప్తి మనకుంటుంది” “సార్! మీరు జనరల్ మెడిసిన్ ఎందుకు తీసుకున్నారంటే” గురువుగారు చెప్పిన సమాధానం. గురువుగారి మాటలే విలేఖరులకు చెప్పాను.

“కానీ ఏ ఎయిమ్స్ లోనో, సీటు తీసుకోకుండా ఆంధ్ర మెడికల్ కాలేజీలో జాయిన్ అవ్వడానికి కారణం?” రెట్టించారు విలేఖరులు.

“మా గురువుగారు రామనరసింహంగారి దగ్గర ట్రైనింగ్ అవుదామని. విలువలతో కూడిన వైద్యానికి వారసుడినవ్వాలని” చిరునవ్వుతో చెప్పి, చుట్టూ చూశాడు నాగేష్. తాను రేడియో డయాగ్నోసిస్ తీసుకోనందుకు... అంటే ఇన్‌డైరెక్టుగా సుచిత్రను కాదన్నందుకు తన ఫ్రెండ్స్ ముఖంలో విస్మయం. రఘు ముఖంలో ఆనందం. సుచిత్ర ముఖంలో పట్టరాని కోపం.

“సారీ సుచిత్రా! నువ్వు వద్దనుకుని కాదు. కానీ మీ నాన్నగారి కండిషన్స్ ఒప్పుకుంటే, నా జీవితలక్ష్యాన్ని నేను సాధించలేను. నా వైద్యం ద్వారా, నా మాటల ద్వారా రోగికి స్వస్థత చేకూర్చాలంటే, జనరల్ మెడిసిన్‌లోనే అది సాధ్యమవుతుంది. రేడియో డయాగ్నోసిస్‌లో సీటు తీసుకొని పేషెంట్‌కు దూరంగా ఏసి గదిలో కూర్చొని, కేవలం రోగ నిర్ధారణ చేసి నా మనసును నేను సంతృప్తి పరచుకోలేను. అందుకే నేను జనరల్ మెడిసిన్ తీసుకున్నాను. అలాగే పేషెంట్స్‌కు ఫ్రీగా సర్వీస్ చెయ్యాలన్న నా కోరిక కూడా ప్రైవేటు ప్రాక్టీసులో కుదరదు. పిజి అయిపోయాక నేను గవర్నమెంట్ సర్వీసులోనే చేరుతాను. నా నిర్ణయం నీకిష్టమైతే మనం జీవితాంతం కలిసి ఉండవచ్చు!” సుచిత్ర దగ్గరకు వెళ్లి చెప్పాడు నాగేష్.

*అంకితం – ఈ కథ మా గురువుగారు డాక్టర్ వెంపటి రామనరసింహం గారికి భక్తి ప్రపత్తులతో.*

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.

అవసరాల వెంకటరావు
9989976688

జయంతి ప్రకాశ శర్మ
9848629151

◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
www.kathamanjari.in

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in